మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 12 నవంబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 306 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

బండెనక బండి.. ఢీకొట్టెనండి..!



2

జమ్మూ కశ్మీర్‌లో హిమపాతం..



2



వచ్చే ఏడాది నుంచి 10+2 విధానం

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సంస్కరణలు

బోధన సిబ్బంది ప్రయోజనాలకు భంగం కలగనివ్వం

యూనివర్సిటీ బోధనా సిబ్బంది నియామకాల ప్రక్రియ వేగవంతం

విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11, (మనం బ్యూరో): విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్యమైన విద్యా బోధన ద్వారా, ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మని స్పష్టం చేశారు. విద్యా శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ...మిగతా 2లో

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

బ్లూ కాలర్ జాబ్స్
ఏఐతో చేయలేం

మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ ఘనతే

ఆ రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించింది

జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11, (మనం బ్యూరో): సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు పలు విభాగాల్లో ఏఐతో ఉద్యోగాలు పోయే పరిస్థితి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కానీ, బ్లూ కాలర్ జాబ్స్‌ను ఏఐతో చేయలేమని స్పష్టం చేశారు. బుధవారం జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధికి ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించిన ...మిగతా 2లో



13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్

BHARAT SUMMIT
FORGING A NEW WORLD

దావోస్ తరహాలో ప్రపంచ విధాన చర్చల వేదికగా హైదరాబాద్

70కిపైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం

రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అంతర్జాతీయ స్థాయి చర్చలు: భట్టి

ప్రగతిశీల ఆలోచనలతో కాంగ్రెస్ ముందుకు నడుస్తుంది: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబర్ 11, (మనం బ్యూరో): ప్రపంచ ఆర్థిక, పెట్టుబడుల విధానాలపై చర్చలకు దావోస్ గుర్తింపు పొందినట్లే.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే భారత్ సమ్మిట్ 2026తో రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై ప్రపంచానికి దిశానిర్దేశం చేసే అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్ ఎదగనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల ...మిగతా 2లో



విజన్ 2047 లక్ష్య సాధనలో ఆటోమొబైల్, ఈవీ రంగాలు కీలకం

- ఈ రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వాములు కావాలి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబర్ 11, (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు, ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు ...మిగతా 2లో



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

- ఎడిటర్

నేటి నుంచి పాల ధరల పెంపు

నేటి నుంచి కొత్త ధరలు అమల్లోకి



హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి): పాల ధరలు మరోసారి పెరగనున్నాయి. ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డెయిరీ లీటరు పాల ధరలను రూ.2 నుంచి రూ.4 వరకు పెంచింది. సవరించిన ధరలు రేపటి నుంచి అమల్లోకి రానున్నాయి. పాడి రైతుల నుంచి పాలు సేకరించే ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయం అధికమైందని, ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, తొలుత ఈ ధరల పెంపును ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అమలు చేయనున్నారు.


కొత్త ధరల ప్రకారం ఫుల్ క్రీమ్ ప్యాకెట్ పాల లీటరు ధర రూ.72 నుంచి రూ.76కు పెరిగింది. టోన్డ్ ప్యాకెట్ పాలు రూ.60 నుంచి రూ.62కు చేరాయి. డబుల్ టోన్డ్ పాలు రూ.54 నుంచి రూ.56కు పెరిగాయి. ఆవు పాల ధర లీటరుకు రూ.62 నుంచి ...మిగతా 2లో

విదేశాల్లో పుట్టినా..
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన సోనియా



- ప్రధాని పదవిని త్యజించిన ఘనత ఆమెదే
- ఆమె పుస్తకంపై విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 11 (మనం బ్యూరో): విదేశాల్లో పుట్టినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన ఆదర్శ మహిళ సోనియా గాంధీ అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రధాని పదవిని చేపట్టే అవకాశం వచ్చినా త్యజించిన ఘనత ఆమెకే దక్కుతుందని పేర్కొన్నారు. సోనియా గాంధీ రచించిన 'బిలాగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ...మిగతా 2లో



జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్
జవాన్లపై ఉగ్రదాడి

శ్రీనగర్, నవంబర్ 11: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. కుల్గాం జిల్లాలోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై బుధవారం ఉగ్రవాదులు దాడి చేశారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపారు. దీంతో సీఆర్పీఎఫ్ జవాన్లు ఎదురుకాల్పులు జరపగా.. ఉగ్రవాదులు అక్కడి నుంచి పరారయ్యారు.

ఈ ఘటనలో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. నిందితులను పాకిస్థానీ ముఠాకు చెందిన ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నారు.

సూపర్ పీఎం అయ్యేందుకే పీఎం వద్దన్నారు

సోనియాపై బీజేపీ



ఢిల్లీ , నవంబర్ 11: 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ఆత్మకథలో సోనియా గాంధీ పేర్కొన్న అంశాలను తప్పుబట్టిన బీజేపీ తాజాగా మరోసారి విమర్శలు గుప్పించింది. 'సూపర్ పీఎం' కావడానికే ప్రధానమంత్రి పదవిని చేపట్టకూడదని ఆమె నిర్ణయించుకున్నారని ఆరోపించింది. ఎమర్జెన్సీని రాజీవ్ గాంధీ వ్యతిరేకించారని సోనియా చెప్పడాన్ని తోసిపుచ్చింది. ఎమర్జెన్సీ విధించడం సరైనదేనని గతంలో రాజీవ్ స్వయంగా అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేసింది. మరోవైపు కాంగ్రెస్ అగ్రనాయకురాలు పుస్తకంలో చెప్పిన పలు విషయాలపై అన్నా హజారే, జేడీయూ నుంచి ప్రతికూల స్పందన వచ్చింది.యూపీఏ హయాంలో క్యాబినెట్ ర్యాంక్ ఉన్న నేషనల్ అడ్వైజరీ కమిటీ ఛైర్‌పర్సన్ పదవిని సోనియా చేపట్టారని అది గొప్ప త్యాగమేనంటూ బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ తర్వాత ఓ వివాదం చుట్టుముట్టడంతో ...మిగతా 2లో

ఏపీ, బిహార్, ఢిల్లీలో.. ఈవెనింగ్ కోర్టులు..!

2

ఇరాన్‌తో యుద్ధం ముగిసినట్టే

ఖతార్ ప్రధానితో చర్చల తర్వాత ట్రంప్ వ్యాఖ్య



వాషింగ్టన్, నవంబర్ 11: ఇరాన్‌పై తమ యుద్ధం సైనికపరంగా ముగిసినట్టేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ దేశంపై తిరిగి బాంబు దాడులు జరిపే యోచన ప్రస్తుతానికి లేదన్నారు. ఖతార్ ప్రధాని మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీతో సమావేశం అనంతరం శ్వేతసౌధంలో ట్రంప్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ''సైనికపరంగా ఇరాన్ పనైపోయింది. మేం కేవలం యథాతథ స్థితిని కొనసాగిస్తున్నాం. పరిస్థితులు మారితే తిరిగి దాడులు జరిపేందుకు మా సైన్యం సిద్ధంగా ఉంటుంది. టెహ్రాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేసే దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం'' అని వ్యాఖ్యానించారు.

మా షరతులకు అంగీకరించి లొంగిపోండి: ఇరాన్

పశ్చిమాసియాలో ఘర్షణ ముగించేందుకు తాము విధించిన ఏడు షరతులకు అంగీకరించి, లొంగిపోవాలని అమెరికాను ఇరాన్ హెచ్చరించింది. తమతో యుద్ధం అమెరికా ప్రభుత్వాన్ని ...మిగతా 2లో

కుమార్తే.. కిమ్ వారసురాలు!

భావి నాయకురాలిగా ఆమెను తీర్చిదిద్దుతున్న ఉత్తర కొరియా అధినేత



పాంగ్యాంగ్ , నవంబర్ 11: పురుషాధిక్య దేశమైన ఉత్తర కొరియాలో తొలిసారి ఒక మహిళకు పాలనా పగ్గాలు అప్పగించనున్నారా? దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారా? అవుననే అంటున్నారు.. ఉత్తర కొరియా నుంచి పారిపోయి వచ్చిన శరణార్థులు! వారితో పాటు దక్షిణ కొరియా నిఘా వర్గాలు అందిస్తున్న సమాచారం ప్రకారం.. కిమ్ తన కుమార్తె కిమ్ జు-ఏ (13)ను నాలుగేళ్లుగా క్షిపణి పరీక్షలు, సైనిక కవాతులకు వెంటబెట్టుకుని వెళ్తున్నారు. ఇది భావి నాయకురాలిగా ఆమెను తీర్చిదిద్దే వ్యూహంలో భాగమేనట. 1948లో ఏర్పడిన ఉత్తర ...మిగతా 2లో



రష్యా-ఉక్రెయిన్ చర్చల్లో పురోగతి

అబుధాబి, నవంబర్ 11: అబుధాబీలో జరిగిన రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పురోగతి చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు పరస్పరం అంగీకారం కుదిరింది. ఖైదీల విడుదలకు అంగీకరించినప్పటికీ.. దీనికి సంబంధించిన కచ్చితమైన సంఖ్యను మరికొన్ని గంటల్లో ఖరారు చేస్తామని అమెరికా ప్రతినిధి బృందం పేర్కొంది. యుద్ధ ఖైదీల అప్పగింతపై చర్చలు సానుకూలంగా జరిగాయని.. ఒక్కో వైపు నుంచి సుమారు 1,000 నుంచి 1,500 మంది యుద్ధ ఖైదీలను విడుదల చేసే అంశంపై సమాలోచనలు చేశామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధాన్ని విరమింపజేసే లక్ష్యంతో అమెరికా మధ్యవర్తిత్వంలో ...మిగతా 2లో

వచ్చే ఏడాది నుంచి 10+2 విధానం

(మొదటి పేజీ తరువాయి)



వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు విధానాన్ని అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న ప్రగతిని అధికారులు వివరించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విధానాన్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. 12వ తరగతి వరకు విద్యార్థులను భాషా, సమాచార నైపుణ్యాలపై పూర్తి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. 12 వ తరగతి తర్వాత తమకు నచ్చిన సబ్జెక్టును ఎంచుకొని అందులోని నిపుణులుగా మారేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలన్నారు. ఎదో తరగతి తర్వాత ఎక్కువ శాతం మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారని, అందులో అత్యధికులు బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలే ఉంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 12వ తరగతి వరకు కొనసాగింపు ఉన్న కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో డ్రాపౌట్స్ సంఖ్య చాలా స్వల్పంగా ఉంటోందన్నారు. దేశంలో 18 రాష్ట్రాల్లో 12వ తరగతి వరకు విధానమే అమల్లో ఉందన్నారు. విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. జూనియర్ కళాశాలల్లోని లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, రిటైర్మెంట్ బెనిఫిట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న స్కూళ్ల నిర్మాణ ప్రగతిపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఆయా స్కూళ్ల నిర్మాణాలపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఎక్కడైనా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటే వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పురోగతిపైనా సమీక్షించిన సీఎం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా స్కూళ్లలో ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు, ఇంటీరియర్, డిజిటల్ పరికరాలు, క్రీడా పరికరాలు, కిచెన్ సామగ్రి సేకరణకు సంబంధించి అత్యుత్తమ సంస్థలను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదశలోనూ నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. ఐటీఐలను ఏటీసీలుగా అప్డేట్ చేసిన తర్వాత విద్యార్థుల నమోదు పెరగడంతో పాటు వాటిలో శిక్షణ పొందిన వారందరికీ ఉద్యోగాలు లభించాయని తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్‌కు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలనీ, ఈ క్రమంలో శాఖపరమైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలనీ, నియామక ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు..

బ్లూ కాలర్ జాబ్స్ ఏఐతో చేయలేం

(మొదటి పేజీ తరువాయి)

ఘనత అబుల్ కలాం ఆజాద్ సొంతమని, దేశంలో ఐఐటీలను ఏర్పాటు చేసి ఎంతో మంది ఇంజినీర్లను తయారు చేసేందుకు పునాది వేశారని చెప్పారు. నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందనీ, నైపుణ్యం పెంచుకుంటే బ్లూ కాలర్ జాబ్స్‌కు కొదవే లేదని పేర్కొన్నారు. గులాం నబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలను మైనార్టీలకు కల్పించిందన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేననీ, వారి రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ చేవెళ్ల సభలో ప్రకటించిందని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమం మా బాధ్యత, పేదలు, మైనార్టీలకు కాంగ్రెస్ ఓటు హక్కు కల్పిస్తే బీజేపీ ఆ ఓట్లను తొలగించాలని చూస్తున్నదని ఆరోపించారు. 12 ఏళ్లు గడచినా బీజేపీ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ నిలబెట్టుకోలేదనీ, బీజేపీతో పోరాడే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. క్రీడల్లో దేశ ప్రతిష్టనుపెంచిన మైనారిటీ క్రీడాకారులకు ప్రభుత్వం నగదు బహుమతితో పాటు ఉద్యోగం ఇచ్చి గౌరవించిందన్నారు.

ఓల్డ్ సిటీలో మెట్రో పనుల్లో వేగం పెంచుతామనీ, మూసీ పునరుజ్జీవంతో పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది, మీ సంక్షేమం కోసం పనిచేస్తుంది, చదువు ఒక్కటే మీ జీవితాలను మారుస్తుంది, పిల్లలను చదివించండి, నైపుణ్యాన్ని అందించండి అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన సోనియా

(మొదటి పేజీ తరువాయి)

పుస్తకం మార్కెట్లోకి విడుదలైన సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ పుస్తకంలో ఎన్నో బాధాకరమైన వాస్తవాలు ఉన్నాయని చెప్పారు. పుస్తకంలో తన జీవితంలోని అనుభవాలను వెల్లడించిన సోనియా విదేశాల్లో పుట్టినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించారని పేర్కొన్నారు. దేశ రాజకీయాలను ఆకళింపు చేసుకుని పార్టీని నడిపిస్తున్న నాయకురాలు సోనియా అనీ, మన్మోహన్ సింగ్‌ను భారత ప్రధానిగా ఎంపిక చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఇందిరా గాంధీ,సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ మరణాలతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారనీ, తన జీవితంలోని విషాదాలను సోనియా తన ఆత్మకథ పుస్తకంలో వివరించారని గుర్తు చేశారు. సోనియా పుస్తకంపై రాజకీయ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ, ప్రతి ఒక్కరూ సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని చదవాలని ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ చెప్పారు.

నేటి నుంచి పాల ధరల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

రూ.65కు చేరింది. బల్క్ వెండింగ్ కేంద్రాల ద్వారా విక్రయించే టోన్డ్ పాలు రూ.58 నుంచి రూ.60కు పెరిగాయి. పాడి రైతుల నుంచి పాలు సేకరించేందుకు చెల్లించే ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మదర్ డెయిరీ తన పాల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 75 నుంచి 80 శాతం వరకు రైతులకు చెల్లిస్తోంది.

ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మదర్ డెయిరీ రోజుకు సుమారు 35 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. సంస్థకు చెందిన అవుట్‌లెట్లు, సాధారణ విక్రయ కేంద్రాలు, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఈ అమ్మకాలు సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా రోజువారీ పాల విక్రయాలు 50 లక్షల లీటర్లకు పైగా ఉన్నాయి. ఈ ఏడాది మే 14న చివరిసారిగా ధరలను సవరించిన సంస్థ.. ఆరు నెలల వ్యవధిలో మరోసారి పెంపు నిర్ణయం తీసుకుంది.

హైడ్రా కమిషనర్‌ను కోర్టులో హాజరుపరచండి

డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 11: హైడ్రా కమిషనర్ రంగనాథ్కు హైకోర్టు షాక్ ఇచ్చింది. కోర్టు ధిక్కారణ నేరం కింద రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్ను హైకోర్టు ముందు హాజరు పరచవలసిందిగా డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.కోర్టు ధిక్కరణ నేరం కింద.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వచ్చే మంగళవారం కోర్టులో హాజరు పరచాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయనతో పాటు శంషాబాద్ తహసీల్దార్ను కూడా కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. కోర్టు సమన్లు జారీ చేసినా విచారణకు హాజరుకాకపోవడాన్ని కోర్టు ధిక్కరణ నేరంగా పరిగణిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందిగా కోరుతూ.. రంగనాథ్, తహసీల్దార్లు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

కాంగ్రెస్ దోపిడీకి ప్రయోగశాలగా తెలంగాణ

- కాంగ్రెస్ పెద్దలే ప్రభుత్వ భూములను మింగుతుండ్రు?
- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ధ్వజం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణను దోపిడీకి ప్రయోగశాలగా మార్చేసి విచ్చలవిడి అవినీతికి పాల్పడుతూ ఈ ప్రభుత్వ పెద్దలు భూ కబ్జాకోరులుగా మారిపోయారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇవాళ భూములను తెగనమ్ముతున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమికి యజమాని ప్రభుత్వం కాదు.. ప్రభుత్వం తోటమాలి లెక్క కేవలం కస్టోడియన్ మాత్రమే.. అమ్మేందుకు హక్కుండదు.. ఒకవేళ అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడితే కూడా దీర్ఘ కాలిక ఇన్ఫ్రా స్ట్రక్చర్ తయారు చేసేందుకో.. ప్రజల అవసరాలకు ఆదుకోవడం కోసమో ప్రభుత్వ భూమిని వినియోగించాలి తప్ప ప్రైవేట్ వాళ్లకు కట్టబెట్టుకుని సొమ్ము చేసుకుని తద్వారా కమీషన్లు దండుకునే వెసులుబాటు రాజ్యాంగం ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు.

గాదె కింద పందికొక్కుల కంటే హీనంగా ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా ప్రైవేట్ వాళ్లకు కట్టబెట్టి లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని దాసోజు ఫైర్ అయ్యారు.. ఇంతకంటే నీచత్వం రాజ్యాంగ విద్రోహం, ప్రజా ద్రోహం ఇంకోటి లేదన్నారు. దళిత భూముల కథ అయిపోయింది.. . అక్కడ దళితులకు చెందిన 6 ఎకరాల భూమిని 'ఏక్తా మాల్' పేరిట ప్రైవేట్ కంపెనీకి కాంగ్రెస్ ప్రభుత్వం దోచిపెట్టిందని వివరించారు. ఇవాళ బీసీ భూముల మీద పడ్డది. బహుజన బిడ్డలకు సంబంధించిన రూ. 1,000 కోట్ల విలువైన 3.17 ఎకరాల భూమిని.. శేరిలింగంపల్లి ఖాజాగూడ గ్రామంలో ఉన్న అత్యంత ఖరీదైన భూమిని 'ఖిఅఖి ఖుజట్పసకు దోచిపెట్టారు. మరి వీళ్లు ఎవరికి చుట్టమో.. ఏ లోపాయికారి ఒప్పందాలు ప్రభుత్వ పెద్దలతో ఉన్నయో .. ఇవన్నీ విచారణలో బహిర్గతం కావాల్సిన అవసరముందన్నారు వీళ్లేమైనా తెలంగాణ ప్రజలకు అల్లుళ్లా.. తెలంగాణ బీసీ బిడ్డలకు చెందాల్సిన ఒక హక్కును, ఆస్తులను మీ ఈ రకంగా ఎట్లా కట్టబెడుతుండో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు బుధవారం హైదరాబాద్లో నవంబర్ 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్-2 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్లో భారత్ సమ్మిట్-2 విజయవంతం చేయడానికి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడుతూ ఈ సదస్సులో పాల్గొనేందుకు 70కిపైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఇప్పటికే తమ అంగీకారం తెలిపారని వెల్లడించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఉన్నట్లే ప్రతిపక్షం కూడా ఉండాలని, ఈ రెండూ ప్రజాస్వామ్య వ్యవస్థకు రెండు కీలక స్తంభాలని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష పార్టీలను, నాయకులను శత్రువులుగా చూడకూడదని, కేవలం తమతో విభేదించే రాజకీయ ప్రత్యర్థులుగానే భావించాలని సూచించారు. ప్రతిపక్షాల ఆలోచనలు, విధానాలను వ్యతిరేకించాలే తప్ప, వారిని శత్రువులుగా పరిగణించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రతిపక్ష పార్టీలను శత్రువులుగా చూస్తున్నారని వాటి నాయకత్వాన్ని రాజకీయంగా అంతం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాలు రెండూ సమర్థవంతంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను బలంగా విశ్వసిస్తుందని, ఈ అంశాలపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను, నాయకులను భారత్ సమ్మిట్కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ప్రగతిశీల ఆలోచనలతో కాంగ్రెస్ ముందుకు నడుస్తుంది: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రగతిశీల ఆలోచనలు కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ... ఆ ఆలోచనలతోనే ముందుకు నడుస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బీజేపీ ఆలోచనలు వేరు. ఆ భావజాలమేంటో అందరికీ తెలుసు. భారత్ సమ్మిట్‌పై హెచ్ఐసీసీలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని రీ లాంఛ్ చేయడానికే భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నారంటూ కొందరూ బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.. రాహుల్ గాంధీ జాతీయ, అంతర్జాతీయ నాయకుడు. ఆయనను మళ్లీ స్పెషల్ గా లాంఛ్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేద్దామని బీజేపీ ఆలోచిస్తోందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన విధానం బీజేపీ కి ఎప్పటికీ అర్థం కాదు.రాజకీయాలు కాదు... ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ సమ్మిట్ ద్వారా పరిష్కార మార్గాలు చూపాలన్నదే మా తపన. ఇది ఒక ఎకనామిక్ సమ్మిట్ లాగా ఉపయోగపడుతోందని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ లో యూత్, టెక్నాలజీ ఇలా చాలా అంశాలపై చర్చ ఉంటుంది. ముఖ్యంగా... జెన్ జీ లు లేవనెత్తిన పలు అంశాల పై కూడా మేధోపరమైన చర్చ జరుగుతుంది. సర్ పేరిట కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలపై కూడా చర్చిస్తామని వెల్లడించారు.

విజన్ 2047 లక్ష్య సాధనలో ఆటోమొబైల్, ఈవీ రంగాలు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

సాగుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026లో భాగంగా ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాలకు సంబంధించి సచివాలయంలో నిర్వహించిన తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026లో ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆటోమొబైల్ తయారీ, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీ, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలు తమ పరిశ్రమలను మరింత విస్తరించడంతో పాటు, కొత్త పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. తెలంగాణను కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితమే దేశంలో ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఈవీ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులు కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహకాల ఫలితంగా గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 2,17,690 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయని, తద్వారా సుమారు రూ.2,343 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించామని వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వినియోగించుకొని ఆటోమొబైల్ తయారీ, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, బ్యాటరీ స్టోరేజ్, ఛార్జింగ్ మౌలిక సదుపాయాల రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026ను విజయవంతం చేయడంలో పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని, ఈ సదస్సు ద్వారా తెలంగాణకు భారీ పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయని, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సూపర్ పీఎం అయ్యేందుకే పీఎం వద్దన్నారు

(మొదటి పేజీ తరువాయి)



ఆ వ్యాఖ్యలు సరికాదు - హజారే

ఆమె రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. సోనియా ప్రధాని కావాలనుకున్నారని అందుకు 1999 ఎన్నికల ఫలితాల తర్వాత చోటుచేసుకున్న పరిణామాలే నిదర్శనమన్నారు. నాడు ప్రభుత్వ ఏర్పాటుకు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వానికి స్వల్ప మెజార్టీ తగ్గిన వేళ రాష్ట్రపతి (కేఆర్ నారాయణన్)ని సోనియా నేతృత్వంలోని బృందం కలిసిందని, అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ ఉన్నట్లు ప్రకటించారని చెప్పారు. దీంతో ఆమె ప్రధాని కావాలనుకున్నట్లు అర్థమవుతోందన్నారు. కానీ, వారికి మిత్రపక్షాల మద్దతు లభించలేదన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు - హజారే

'ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్' ఉద్యమానికి బీజేపీ, ఆరెస్సెస్ మద్దతు పలికాయని సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను అన్నా హజారే ఖండించారు. బీజేపీ లేదా ఆరెస్సెస్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. వారి కార్యక్రమాల్లో ఎప్పుడూ పాల్గొనలేదన్నారు. తాను ఇప్పటివరకు చేసినదంతా సమాజం, దేశం కోసమేనన్నారు. సోనియా అలా మాట్లాడటం సరికాదని, ఇలాంటి ప్రకటనలు వారి ప్రతిష్ఠనే దిగజారుస్తుందన్నారు.

నితీశ్ దాని రూపకర్త - జేడీయూ

బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ గురించి సోనియా గాంధీ పేర్కొన్న అంశాలపై జేడీయూ అసంతృప్తి వ్యక్తం చేసింది. బీజేపీతో ప్రభావితుడైన ఆయన జాతీయ స్థాయిలో విపక్ష కూటమి 'ఇండియా' నుంచి బయటకు వెళ్లడానికి ఓ అవకాశం కోసం చూశారని చెప్పడాన్ని తోసిపుచ్చింది. ప్రతిపక్ష కూటమికి ఆయనే ప్రధాన రూపశిల్పి అని బీజేపీ స్పష్టం చేసింది.

భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 11: భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలోనే భూ రీసర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. భూ రీసర్వే ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సర్వే అనంతరం అభ్యంతరాల స్వీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని, నోటీసుల జారీ తర్వాత ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం 708 రోవర్లతో కొనసాగుతున్న రీసర్వేకు వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేపడుతున్నట్లు, ఎస్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ-ఫారెస్ట్ భూముల సరిహద్దుల నిర్ధారణ, 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి.. పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి వెంటనే భూములను గుర్తించాలని సూచించారు. 2బీహెచ్కే ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక



ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. భూ రీసర్వే పనితీరులో నల్గొండ, ఖమ్మం జిల్లాలపై ప్రశంసలు వ్యక్తం చేయగా, నిజామాబాద్ జిల్లాలో రీసర్వే పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

జమ్మూ కశ్మీర్‌లో హిమపాతం

శ్రీనగర్, నవంబర్ 11: జమ్మూకశ్మీర్ లోని బందిపొరాలో భారీగా మంచు కురుస్తోంది. గురేజ్ పర్వత ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారాయి. రాజ్దాన్, తులైల్ లోయలో మంచు కురిసింది. దీంతో రోడ్లు జారుడుగా మారాయి. వాతావరణ పరిస్థితులు మెరుగుపడేవరకు గురేజ్ పర్వత ప్రాంతాలను సందర్శించొద్దని పర్యాటకులకు అధికారులు సూచనలు జారీ చేశారు. కార్గిల్లో మోనామార్గ్, జోగిలా పాస్ ప్రాంతాల్లో మంచు వర్షం కురుస్తోంది. దీంతో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు.

బండెనక బండి.. ఢీకొట్టెనండి..!

బల్గేరియా, నవంబర్ 11: బల్గేరియాలోని ఒడరేవు నగరం బుర్గాస్ నుంచి రాజధాని సోఫియాకు వెళ్లే మార్గంలో మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు భయోత్పాతం సృష్టించింది. చోదకులకు రహదారి కనిపించక ఒకదాని వెంట మరొకటి వరుసగా 86 వాహనాలు ఢీకొనడంతో ఆ మోటార్ వే మొత్తం భయానక వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదాల్లో 12 మంది మృతిచెందగా, 46 మంది క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ఢీకొన్న వాహనాల్లో అత్యధికంగా భారీ ట్రక్కులే ఉన్నాయి.

ఇరాన్‌తో యుద్ధం ముగిసినట్టే

(మొదటి పేజీ తరువాయి)

అతలాకుతలం చేసిందని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు-అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ చెప్పారు. అయితే ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గబోమని స్పష్టం చేశారు.

కుమార్తే కిమ్ వారసురాలు!

(మొదటి పేజీ తరువాయి)

కొరియాలో ఇప్పటివరకూ మూడు తరాలుగా కిమ్ కుటుంబమే నియంతృత్వ పాలన సాగిస్తోంది. ప్రస్తుతం కిమ్ జు-ఏకు ఇస్తున్న ప్రొటోకాల్‌ను చూస్తుంటే.. కిమ్ వారసురాలిగా ఆమెకు అధికారిక ముద్ర పడినట్లేనని ఉత్తర కొరియా మాజీ దౌత్యవేత్త తే యోంగ్-హో తెలిపారు. గతంలో కిమ్ జోంగ్ ఉన్ను వారసుడిగా ప్రకటించినప్పుడు ఇలాంటి గౌరవ మర్యాదలే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అధికార వర్కర్స్ పార్టీలోని 17 విభాగాల్లో ఒకే ఒక్క మహిళ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె- కిమ్ సోదరి కిమ్ యో జోంగ్. ఇలాంటి పురుషాధిక్య సమాజంలో ఒక చిన్నారిని సుప్రీం లీడర్‌గా అంగీకరించడం కొందరికి మింగుడుపడటం లేదని శరణార్థులు చెబుతున్నారు. అయితే ఉత్తర కొరియాలో కిమ్ కుటుంబాన్ని.. మనుషులను ఏలే దేవుళ్లుగా భావిస్తారని, కాబట్టి అక్కడ లింగ భేదం పెద్ద సమస్య కాదని మరికొందరు విశ్లేషిస్తున్నారు.

రష్యా-ఉక్రెయిన్ చర్చల్లో పురోగతి

(మొదటి పేజీ తరువాయి)

అబుధాబీ వేదికగా రెండు రోజులపాటు త్రైపాక్షిక చర్చలు జరిగాయి. అమెరికా తరఫున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, దౌత్యవేత్త స్టీవ్ విట్కాఫ్‌లు ఇందులో పాల్గొనగా.. రష్యా బృందానికి వ్లాదిమిర్ మెడిన్స్కీ, ఉక్రెయిన్ తరఫున రుస్తెం ఉమెరోవ్ నేతృత్వం వహించారు. గతంలో విఫలమైన శాంతి ప్రయత్నాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని అమెరికా ప్రతినిధి బృందం పేర్కొంది. రెండురోజుల చర్చలు ముగిసిన నేపథ్యంలో నవంబర్ 12న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో, ఆ తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అవుతామని తెలిపింది.

ఏపీ, బిహార్, ఢిల్లీలో.. ఈవెనింగ్ కోర్టులు..!

ఢిల్లీ, నవంబర్ 11: దేశంలో పెండింగ్ కేసుల పరిష్కారానికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈవెనింగ్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, బిహార్‌లలో ఈ సాయంత్రపు కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కోర్టులు పగటిపూట నిర్దిష్ట సమయాల్లో పనిచేస్తున్నాయి. ఈ సమయాన్ని మరింత పెంచి సాయంత్రం పూట అదనంగా కొన్ని గంటల పాటు న్యాయస్థానాలు పనిచేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఆ అదనపు వేళల్లో కేవలం పెండింగ్ కేసులను మాత్రమే విచారించేలా నిబంధనలు తీసుకొస్తామన్నారు. ఇక, ఈవెనింగ్ కోర్టుల నిర్వహణకు రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలను వినియోగించుకోవాలని కేంద్రం యోచిస్తున్నట్లు మేఘవాల్ వెల్లడించారు. తొలుత ఢిల్లీ, బిహార్, ఏపీలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల హైకోర్టు సమన్వయం, సహకారంతో వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

పట్టభద్రులు 80 లక్షలు..
ఓటర్లు 10 లక్షల లోపే

10 లక్షల ఓట్లు నమోదు కాని వైనం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత



హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత విమర్శించారు. ఈ మేరకు బుధవారంనాడు హైదరాబాద్ బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ... ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలో 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమని కవిత పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏం చేసైన సరే విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు.

త్వరలోనే పునరుజ్జీవ పనులు ప్రారంభిస్తాం
హైదరాబాద్ అంటేనే రాక్స్ అండ్ లేక్స్ సిటీ
తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11, (మనం బ్యూరో): కొంతమందికి నష్టం జరిగినప్పటికీ కొన్ని తరాలకి మంచి భవిష్యత్తును ఇవ్వాలని తమ్మిడి కుంటను అభివృద్ధి చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 14 ఎకరాలకు కుంచించుకు పోయిన చెరువును 30 ఎకరాలకు విస్తరించామని పేర్కొన్నారు. బుధవారం హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అక్కినేని నాగార్జున మంచి మనసుతో ముందుకు వచ్చి 2 ఎకరాలు ప్రభుత్వానికి అందించారనీ, సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలో కూడా నాగార్జున హీరోగా నిలిచారని పేర్కొన్నారు. హైదరాబాద్ సైట్ అంటేనే రాక్స్ అండ్ లేక్స్ సిటీ అనీ, నగరంలో లో 1372 చెరువులుంటే రకరకాల కారణాలతో 50 శాతం చెరువులు మాయమయ్యాయని తెలిపారు. చెరువుల ఆక్రమణలతో వర్షాలు వస్తే రోడ్లపై నీళ్లు నిలిచే పరిస్థితి కాలనీలు జలమయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిపై ప్రతీ ఒక్కరూ ఆలోచన చేయాలనీ, ఆనాడు మూసీ వరదల నుంచి నగరాన్ని కాపాడేందుకు నిజాం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తు చేశారు. వికారాబాద్ నుంచి మొదలైన ముచుకుందా నది మూసా, ఈసా కలసిన చోట మూసీగా మారింది ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో నదీ నాగరికత అభివృద్ధి చెందిందనీ, ఆనాడే ఇది గుర్తించి వందేళ్ళ క్రితమే నిజాం మూసీ నదీ పరివాహకాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు.

కానీ ఇప్పుడు మూసీ కాలుష్యమయంగా మారిపోయింది, మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారనీ, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నల్లగొండ ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని విమర్శించారు . అందుకే ఈ పరిస్థితి మారాలని మూసీ పునరుజ్జీవనం చేపట్టాలని నిర్ణయించామనీ, ప్రకృతిని పరిరక్షించాలన్నదే నా ఆలోచన, హైదరాబాద్ ను విశ్వనగరంగా నిలబెట్టడం కోసమే మా తపన అని స్పష్టం చేశారు. అందులో భాగంగానే చెరువులను పునరుద్ధరిస్తున్నామనీ, ఇందుకు సహకరించిన అందరినీ అభినందిస్తున్నా.మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందే..మూసీ ప్రక్షాళనలో ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ఇందుకు కలిసి నడవాల్సిన అవసరం ఉంది.త్వరలోనే మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు ప్రారంభించుకోబోతున్నాం. నగర ప్రజల జీవితాలు మూసీ నదితో ముడిపడి ఉన్నాయి. నదుల పేర్లు ఆడబిడ్డలకు పెట్టుకునే సంస్కృతి మనది..అందుకే మూసీ నదిని కాపాడుకోవాల్సిన మనందరిపై ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



నిమిషాల్లో నకిలీ బర్త్ సర్టిఫికేట్స్

రాజధాని అడ్డగా నకిలీ బర్త్ సర్టిఫికేట్ల దందా

హైదరాబాద్‌లో జోరుగా అన్ని రాష్ట్రాలకు చెందిన సర్టిఫికేట్ల దందా

ముగ్గురిని అరెస్ట్ చేసిన ఎస్ఓటీ పోలీసులు

హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి) : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను తయారు చేస్తున్న ఓ గ్యాంగ్‌ను బుధవారంనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. టెలిగ్రామ్ కేంద్రంగా ఈ దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల పూర్తి కథనం ప్రకారం.. నగరంలో నకిలీ సర్టిఫికేట్ల దందా కొనసాగుతుందన్న సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు.. ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో జీడిమెట్లకు చెందిన సలీం, మహమ్మద్ యాహియా, వెంకటేష్‌లు.. హైదరాబాద్ కేంద్రంగా ఈ దందాను చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, వీరు అన్నీ రాష్ట్రాలకు సంబంధించిన నకిలీ బర్త్ సర్టిఫికేట్లను నిమిషాల్లో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. టెలిగ్రామ్ ద్వారా ఈ దందాను నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారి నుంచి.. పెద్ద ఎత్తున 70 నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో.. మహమ్మద్ యాహియా ప్రధాన నిందితుడు కాగా.. మిగిలిన ఇద్దరు అతనికి సహకరిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి.. ఆరోస్ పురం సైబర్ క్రైం పోలీసులకు అప్పగించారు.

అప్రమత్తంగా ఉండండి?.. బాధితులు కావద్దు?

భారీ డిస్కౌంట్లు ఇస్తామంటే నమ్మొద్దు?.. లేదంటే? బాధితులుగా కాక తప్పదు?

ప్రజలకు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వార్నింగ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో బుధవారం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా నకిలీ ఆన్‌లైన్ ప్రకటనలు, క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

అ మేరకు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. ప్రజలకు పబ్లిక్ అడ్వైజరీ జారీ చేసింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల పేరుతో.. వల పన్ని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఇందుకు ఇనిస్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ముందుగా.. బ్రాండెడ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, దుస్తులపై భారీ డిస్కౌంట్‌లు అంటూ ప్రకటనలు ఇచ్చి.. అనంతరం (యూపీఐ), డిజిటల్ వాలెట్లు, బ్యాంక్ ట్రాన్సఫర్‌ల ద్వారా డబ్బులు వసూలు చేస్తారని.. ఆ తర్వాత నకిలీ ఆర్డర్ కన్‌ఫర్మేషన్ పంపి డెలివరీ ఆలస్యమంటూ.. నమ్మించే ప్రయత్నం చేస్తారని.. డబ్బులు తీసుకున్న తర్వాత బాధితుల ఫోన్ నంబర్లు బ్లాక్ చేయడంతో పాటు.. నకిలీ వెబ్‌సైట్‌లను కూడా మాయం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వస్తువులు అందకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు సూచించారు.

క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు.. మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మోసాలు జరిగే తీరును వివరించారు. సైబర్ నేరగాళ్లు.. ముందుగా బ్యాంక్ రివార్డులు, క్యాష్‌బ్యాక్, కార్డు లిమిట్ పెంపు పేరులో ఫిషింగ్ లింకులను పంపుతారని.. లేదంటే, రూ.5 లక్షల వరకు క్రెడిట్ లిమిట్ పెంచుతామంటూ నకిలీ మెసేజ్‌లు పంపి.. వాటి ద్వారా హానికరమైన ఏపీకే ఫైల్స్‌ను పంపుతారని పోలీసులు తెలిపారు. ఆ లింకులపై క్లిక్ చేయగానే కార్డు వివరాలు తస్కరణకు గురవుతాయని.. ఇలా కార్డు నంబర్, సీవీవీ,పిన్ వివరాలను కేటుగాళ్లు సేకరిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. బాధితుల ఫోన్సుకు ఎస్ఎంఎస్ అలర్టులు రాకుండా.. మొబైల్‌లో మాల్వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నారని వెల్లడించారు. ఈ విధంగా బాధితుల అనుమతి లేకుండానే.. నిమిషాల్లో వారి అకౌంట్ల నుంచి నేరగాళ్లు డబ్బులను కాజేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ లావాదేవీలను కూడా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి సందర్భాల్లో.. బాధితులు వెంటనే స్పందించి.. కార్డును బ్లాక్ చేసి.. తక్షణమే బ్యాంకుకు సమాచారం అందించాలని సైబర్ పోలీసులు సూచించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు తీపీ కబురు

తెలంగాణ బస్టాండ్‌లో ఫ్రీ వైఫై

రాష్ట్ర వ్యాప్తంగా 86 రద్దీ స్టేషన్లలో ఉచిత వైఫై

ఒక్కో బస్ స్టేషన్‌కు ప్రత్యేక కంట్రోలర్ నియామకం

బస్సుల వివరాల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

త్వరలో అన్ని స్టేషన్లలో కొత్త టైమ్ టేబుల్ బోర్డులు, సీసీ కెమెరాలు

హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి) : త్వరలో తెలంగాణ బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 5 వేల మందికిపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 బస్ స్టేషన్లను గుర్తించింది. వీటిలో దశలవారీగా ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది. అయితే, గుర్తించిన బస్ స్టేషన్లలో ఇప్పటికే ఒక్కో కంట్రోలర్‌ను నియమించింది. ప్రయాణికులు బస్సుల వివరాలు, రాకపోకల సమయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసింది. కొత్త టైమ్ టేబుల్ బోర్డులను కూడా అందుబాటులోకి తీసుకురానుంది.

ఇకనుంచి ప్రయాణికుల భద్రతతో పాటు అన్ని బస్టాండ్‌లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వీటిని సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించనున్నారు. తద్వారా బస్ స్టేషన్లలో పరిస్థితులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. బస్ స్టేషన్లలో వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు సంస్థ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

మెడికవర్ హాస్పిటల్స్‌పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ దవాఖానలపై ఏది?

- సీఎం రేవంత్‌రెడ్డికి మన్నె క్రిశాంక్ కౌంటర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డికి మెడికవర్ హాస్పిటల్స్‌పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ దవాఖానలపై ఎందుకు లేదు? అని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. 2 సంవత్సరాల్లో హెలికాప్టర్ వేసుకొని వెళ్లి 3 మెడికవర్ దవాఖానలను ప్రారంభించాడు. కానీ అదే 23 నెలల్లో అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ పనులు కేవలం 5 శాతం మాత్రమే చేశారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 2025 జనవరి నెలలో అల్వాల్ టిమ్స్ దవాఖానను సందర్శించి, 90% పనులు పూర్తయ్యాయని, 2025 ఆగస్టు 31వ తేదీలోపు పనులు పూర్తి చేస్తామని తెలిపాడు. ఇటివల మొన్న (నవంబర్ 10, 2026వ తేదీన) మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించి, 95% పనులు పూర్తయ్యాయని, త్వరలో దవాఖానను ప్రారంభిస్తామని చెప్పాడు. అంటే జనవరి 2025 నుంచి నిన్నటి వరకు అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ పనులు కేవలం 5% మాత్రమే జరిగాయని మంత్రులు స్పష్టం చేసినట్లు అర్థమవుతుందన్నారు.

ఏం, మేం చేప్తే కూడా వినరా?



- తాజా విచారణకు కలెక్టర్ డుమ్మా.. తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి
- ఎలా ఉంది? చేప్తే వినరు? రమ్మన్న కోర్టుకు రారు?
- మేడ్చల్ కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం
- నిర్లక్ష్యం, కోర్టులను లెక్కచేయని కలెక్టర్‌ను కోర్టులో హాజరుపరచండి : సీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి) : ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో ఉదాసీనంగా వ్యవహరించారని పేర్కొంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన కోర్టు విచారణకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఏకంగా పోలీస్ కమిషనర్‌కు బుధవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. తక్షణమే కోర్టు ముందు హాజరుపరచాలని సీపీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే,ఇటివల ఓ మూడు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు 6 నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధించిన అంశం తీవ్ర చర్చ రేపుతుండగా.. మరోవైపు తాజాగా మేడ్చల్ కలెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

ఏం జరిగింది? అత్యున్నత ధర్మాసనం ఎందుకు అగ్రహం వ్యక్తం చేసిందంటే?..

ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూ చౌదరిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా బుధవారం నాటి విచారణకు ఆయన హాజరుకాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. దీంతో కలెక్టర్‌ను నేరుగా న్యాయస్థానంలో హాజరుపరచాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌ను జడ్జి ఆదేశించారు. అయితే, ఇది రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వరుసగా బ్యూరోక్రాట్లు న్యాయస్థానాల ఆగ్రహానికి గురికావడం ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ పాలనలో ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు
ఇది సీఎం రేవంత్‌రెడ్డి ఘనత
నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బీఆర్ఎస్ 'రైతు గర్జన' బహిరంగ సభ

కాంగ్రెస్ – బీజేపీ దొందుదొందే

కేసీఆర్.. నీళ్లు, ఏళ్ల కరెంట్ కష్టాలు తీర్చిండు?





హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి) : ఈ గడ్డ ఎన్నో దశాబ్దాలు మోసపోయి గొసపడ్డ తెలంగాణ రైతులంతా స్వరాష్ట్రంలోనైనా మంచిగుండాలని కీలక నిర్ణయాలు తీసుకున్న నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. 2014లో కేసీఆర్ పదవీ బాధ్యతలు చేపట్టిన నాడు.. అప్పటికి సమైక్యపాలనలో, కాంగ్రెస్ పాలన నీటి తీరువా కట్టించేదని, నీళ్లకు పన్ను ఉండేదని, కానీ, కేసీఆర్ రాగానే కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. చెరువులను బాగు చేయడంతోపాటు నీటి తీరువా శాశ్వతంగా రద్దు చేసి అప్పటిదాకా నీటి పన్ను రూ.300 కోట్ల బకాయిలు ఉంటే మాఫీ చేసిండని కేసీఆర్ అని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ కారణంగా.. మండు టెండల్లోనూ చెరువుల్లో నీళ్లు పొంగిపొర్లాయని వివరించారు. మిషన్ భగీరథతో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని పేర్కొన్నారు. విద్యుత్ సంక్షోభం నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని గట్టెక్కించారని తెలిపారు. 60 ఏళ్ల కరెంట్ కష్టాలను కేసీఆర్ తీర్చారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల వేళ మాయ మాటలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సరిగ్గా ఆ పార్టీ నెరవేర్చలేదని చెప్పారు. ప్రాజెక్టులను పడావు పెట్టారంటూ కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. గోదావరి, కృష్ణా జలాలను వడిసి పట్టుకుండా కిందకు వదిలి పెట్టారంటూ కాంగ్రెస్ నేతల తీరును ఎండగట్టారు. ఈ మేరకు బుధవారం నిర్మల్‌లో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన 'రైతు గర్జన' బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత కరువు ప్రకృతి తెచ్చింది కాదని.. కాంగ్రెస్ పాలకులు తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పట్టిసీమ వద్ద సీఎం చంద్రబాబు నీళ్లు ఎత్తి పోస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి కన్నెపల్లి వద్ద నీటిని ఎత్తి పోయలేదని విమర్శించారు. నీటిని ఎత్తి పోస్తే ఇవాళ తెలంగాణ సస్యశ్యామలమయ్యేదని అన్నారు. ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు వెక్కిళ్లు ఇచ్చారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమైక్యపాలనలో కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ కష్టాలు ఎన్నడూ కూడా రోజులకు 4గంటలు కరెంట్ వ్యవసాయానికి ఇచ్చింది లేదు.. మరి ఆ పరిస్థితి నుంచి కేవలం 6 నెలల లోపే కేసీఆర్ నాయకత్వంలో బ్రహ్మాండంగా మన సింగరేణికి కొత్త జీవం పోసి.. బొగ్గు ఉత్పత్తి చేసి విద్యుదుత్పత్తి కేంద్రాలు కట్టి.. కరెంట్ ఎక్కడుంటే అక్కడ కొనుగోలు చేసి తీసుకొచ్చి జనరేటర్లు, ఇన్వర్టర్లు బంద్ అయి 60 ఏండ్ల కరెంట్ కష్టాలు తీర్చి 24 గంటలు నాణ్యమైన కరెంట్ ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో పైసా ప్రయోజనం లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధుల తీసుకురావడంలో వీరంతా ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ దిగిపోవాలని దేశమంతా ఆందోళనలు చేస్తుంటే.. బీజేపీ ఎందుకు ర్యాలీలు నిర్వహిస్తోందని ప్రశ్నించారు. బీజేపీ హడావుడి చేస్తుందంటే అనుమానం కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్ - బీజేపీ దొందుదొందేనని అన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో రైతులకు అప్పుల బాధ, ఆత్మహత్యల బాధ.. మిత్తీలు మీద పడి రైతులు ఆగమైన పరిస్థితి. కేసీఆర్ అందుకే ఒక నిర్ణయం తీసుకున్నరు.. అప్పు నుంచి రైతును విముక్తి చేయాలి. రుణ విముక్తి జరగాలే.. భారతదేశంలో రైతు దగ్గర భూమి శిస్తు పేరు మీద, నీటి తీరువా పేరు మీద.. ఇంకో పేరు మీద తీసుకున్న ప్రభుత్వాలున్నయి.. ప్రభుత్వానికి కట్టుడే తప్ప రైతుకు ఇచ్చిందేమి లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80ఏండ్లు అయితుంది.. భారతదేశంలోనే రైతుకు పెట్టుబడి సాయం చేయాలని ఆలోచన చేసిన మొట్టమొదటి ఓకే ఒక్క నాయకుడు ఎవరు..? ఒక్కసారి కాదు రెండు సార్లు కాదు.. 11 సార్లు 73 వేల కోట్ల రూపాయలు 11 దఫాలుగా 11 పంటలకు వేసింది కేసీఆర్ దేనికోసం..? ఆ రోజు నాట్లేసే టైం వస్తే మీ ఫోన్లో టింగ్ టింగ్మని మోగుతుండే.. మా నిర్మల్లో ఉండే రైతన్నలను అడుగుతున్నా. ఎట్లుండే ఎట్లయింది పరిస్థితి అని ఒక్కసారి మీరు ఆలోచించాలని అడుగుతున్నా.. తెలంగాణలో చిన్న, సన్నకారు రైతులు.. 5 ఎకరాలోపున్నవాళ్లే 93 శాతం మంది ఉన్నారు. వాళ్లంతా మంచిగుండాలే.. ఎందుకంటే అర ఎకరం, ఎకరం ఉన్న రైతు ఏమైనా జరుగకూడనిది జరిగి ఇంటి కుటుంబ పెద్ద చనిపోతే ఆ రైతు కుటుంబం ఆగమైతదనే బాధతో కేసీఆర్ ప్రపంచంలోనే ఎవరూ తీసుకోని నిర్ణయం తీసుకున్నారు.. రైతు ఎట్లా చనిపోయినా, గుండెపోటుతో, పాముకాటుతో, యాక్సిడెంట్తో చనిపోయినా.. ఆ కుటుంబానికి ధీమా ఉండాలని రూ.5 లక్షల రైతు బీమా తెచ్చిన నాయకుడు కేసీఆర్ అన్నారు.

అంతేకాదు కరోనా టైంలో కూడా పండించిన ప్రతీ గింజా కొన్నరు. 7-8 వేల కొనుగోలు కేంద్రాలు పెట్టి మీ ఊరూరికి కల్లం దగ్గరికి వచ్చి కొని.. అక్కడి నుంచి వారం , పది రోజుల్లోపల మీ ఖాతాలో పైసలుపడేటట్టు చేసింది కేసీఆర్ . అన్నింటికి మించి కృష్ణా, గదావరి నదుల్లో ఒక్కొక్క నీటి బొట్టును ఒడిసిపట్టి.. మన చెరువులు బాగు చేయడమే కాదు.. ఆ చెరువులు నింపి వాగుల మీద చెక్ డ్యాములు కృష్ణా, గోదావరిలో నీటిని ఒడిసి పట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు -రంగారెడ్డి, సీతారామ, భక్త రామదాసు, మన దగ్గర కట్టిన సదర్మాట్ బ్యారేజ్ అయితే ఏంటి ఇవన్నీ కూడా తొమ్మిదిన్నర,పదేండ్ల కాలంలోనే మన హక్కులను కాపాడటానికి, మన రైతులు, మన వ్యవసాయాన్ని నిలబెట్టేందుకు కేసీఆర్ బ్రహ్మాండంగా నాడు మన కోసమో ఈ కార్యక్రమాలు చేశారని మీకు తెలుసునన్నారు. నిర్మల్లో మీరు బీజేపీ ఎమ్మెల్యేలను గెలిపించారు.. ఆ ఎమ్మెల్యే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తా.. నిర్మల్ స్మార్ట్ సిటీ చేస్తా, వంద పడకల ఈఎస్ ఐ ఆస్పత్రి తెస్తా.. రైల్వే లైన్ తెస్తా.. ఉపాధి కల్పన చేస్తాపేదలకు పట్టాభూములిస్తా.. ఉన్నత విద్యాసంస్థలు తెస్తా అని చెప్పిండు.. మూడేండ్లాయె ఒక్క పైసా పని అయినా అయిందా..? బీజేపీతో.. మీ ఎమ్మెల్యే ఈ మూడేండ్లలో ఏమైనా పని చేసిండా..? అని అడుగుతున్నానన్నారు. ఏం చేసిరయ్యా మీరని నన్నడిగితే.. నిర్మల్ జిల్లా చేసిందెవరు..? కేసీఆర్.. నిర్మల్కు నర్సింగ్ కాలేజ్, మెడికల్ కాలేజ్ తెచ్చిందెవరు..? నిర్మల్కు కలెక్టర్, ఎస్పీని తీసుకొచ్చి కూర్చోబెట్టిందెవరు..? కేసీఆర్..సదర్మాట్ బ్యారేజ్ కట్టించింది కేసీఆర్ ఆయన గురించి చెప్పమంటే నేను ఇంకో 1000పనులు చెప్తా అన్నారు కేటీఆర్.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF T.G.LTD.
Operation Banjara Hills Circle

Short Tender Notice No.07/2026-27 (Paper Notification)

TGSPDCL intends to float tenders and saled bids are invited from various contractors having experiences for **(1)** Loading & Unloading materials at City Stores in the month of Feb' 2026 (Reseved for SC-Extn-III Converted to General) **(2)** Erection of 3Nos 11KV bays with VCBs at 33/KV Raheja in Madhapur **(3)** Loading & Unloading materials at City Stores in month of July'2026 (Reserved for SC) Further details please visit www.tgsouthernpower.org. Contact **Phone No. 8712472302**.

Sd/- Superintending Engineer
R.O.No.13504-PP/CL/Advt/2026-27.Dt.11-11-2026 Operation Banjarahills Circle

కర్షకుల కన్నీళ్లు

మట్టి మనుషులు ఇప్పుడు మస్తు గోస పడ్తాండ్రు
ఏ తనువును తాకినా
కన్నీటి సాగరాలే ఉప్పొంగుతున్నాయి
ఏ గుండెను తడిమినా
గాయాల వీణలై మోగుతున్నాయి
ఏ కర్షకున్ని కదిలించినా
కన్నీటి సుడులే తిరుగుతున్నాయి
పచ్చటి పైరు కండ్ల ముందే
కందిపోతాంటే... పేర్చుకున్న ఆశలు
దూది పింజల్లా ఎగిరిపోతున్నాయి
చినుకు లేక కునుకు రాక రైతన్న
ఇప్పుడు బగ్గ రంది పడ్తాండ్రు
మట్టిని నమ్ముకున్న మనిషి ఇప్పుడు
ఒడ్డున పడ్డ చేపపిల్లైతాండు

ముఖం చాటేసిన మేఘం తోటి వరి చేను
కుతికలల్చొచ్చి నిలువునా కూలబడ్తాంటే
రైతన్న గుండెలు నెర్రబారిన నేలలవుతున్నాయి
మక్కల చేను నిలువునా మాడిపోతాంటే
రైతన్న తనువులు తగలబడుతున్నాయి
పత్తి చేను వక్కిపోతాంటే రైతన్న ప్రాణం
అంపశయ్యపై ఆవిరైతాంది

ఓట్ల కోసం పాట్లు పడే ఏలికలు
కర్షకుల కోసం కాపిశ్కైనా కనికరం చూపిస్తలేదు
రైతన్నను కరువు నీడలా వెంటాడుతుంటే
ఏలికలు నిట్టాడై నిలబడకుండా
నీటిపై అబద్ధపు రాతలు రాస్తున్నారు
బండెడు బాధల్లో ఉన్న రైతన్నకు
ధైర్యపు లేపనాలను రాయకుండా
పేర్చుకున్న కాసుల్లో కునుకు తీస్తున్నారు

రైతన్న జీవితం ఎప్పుడూ ఎండమావే
ఎగుసం ఎప్పుడూ జూదపు గవ్వలే

- తాటిపాముల రమేష్
7981566031

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీ వల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం మరియు వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేక పోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది.

ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు మరియు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతరాజ్జీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం.

అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించి పోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి.

పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, మరియు ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూసమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారా లను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగు తోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరువు వంటి ప్రతికూల మార్పులు చోటు చేసుకుంటు న్నాయి.

వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించక పోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుది రాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొం దిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం స్వంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవనశైలిని సవరించు కోవడానికి ఆసక్తి చూపిస్తారు.

శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి.

ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్ప త్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, మరియు ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపా డడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించ గలుగుతాం. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. దీని కారణంగా అనేక రకాలైన శ్వాస రోగాలు, క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సంభవిస్తున్నాయి. ఈ కాలుష్యం వల్ల సహజంగానే సమస్త ప్రాణికోటి, వృక్షజాతులు ప్రమాదంలో పడ్డాయి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


సీమకు మిగిలింది ఏమిటి?

శ్రీ రాంధ్ర-రాయలసీమ ప్రాంతాల మధ్య సమన్వయంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన 1937 శ్రీబాగ్ ఒప్పందం మరోసారి రాజకీయ, సామాజిక చర్చ కేంద్రంగా మారుతోంది. ప్రాంతీయ సమానాభివృద్ధి, నీటి వనరుల వినియోగంలో రాయలసీమకు ప్రాధాన్యం, ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటు, పరిపాలనా వికేంద్రీకరణ వంటి అంశాలకు ఈ ఒప్పందం ప్రాధాన్యత ఇచ్చింది. అయితే, దశాబ్దాలు గడిచినా ఆ ఒప్పందం స్ఫూర్తి ఎంతవరకు ఆచరణలోకి వచ్చిందన్న ప్రశ్న నేడు రాయలసీమ ప్రజల ముందుంది.

ఒకప్పుడు ప్రాంతాల మధ్య నమ్మకాన్ని పెంపొందించి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి పునాది వేసిన ఈ చారిత్రక ఒప్పందం, కాలక్రమేణా రాజకీయ చర్చల నుంచి మరుగున పడిపోవడం ఆందోళన కలిగించే అంశం. రాయలసీమ వెనుకబాటుతనం, నీటి కొరత, పరిశ్రమల లేమి, యువత వలస వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీబాగ్ ఒప్పందం స్ఫూర్తిని మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ఆంధ్ర ప్రాంత రాజకీయ చరిత్రలో శ్రీబాగ్ ఒప్పందానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కేంద్రం ఎక్కడ ఉండాలనే ప్రశ్నపై తీరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తాయి. విద్యాపరంగా వెనుకబడిన రాయలసీమలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని అక్కడి నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు.

అయితే విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రం వాల్టేర్లో ఏర్పడటం, రాయలసీమ కళాశాలలు మళ్లీ మద్రాస్ విశ్వవిద్యాలయం పరిధిలోకి వెళ్లడం ప్రాంతంలో అసంతృప్తిని పెంచింది. ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణ కోసం రాయలసీమ మహాసభ వంటి ఉద్యమాలు బలపడ్డాయి.ఈ పరిస్థితుల మధ్య, 1937 నవంబర్ 16న చెన్నైలోని కాశీనాథుని నాగేశ్వరరావు నివాసమైన శ్రీబాగ్లో రెండు ప్రాంతాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కుదిరిన ఒప్పందమే చరిత్రలో శ్రీబాగ్ ఒప్పందంగా ప్రసిద్ధి చెందింది.



ఈ ఒప్పందం ప్రధానంగా రాయలసీమలో ఉన్నత విద్యా కేంద్రాల అభివృద్ధి, తుంగభద్ర, కృష్ణా, పెన్నా నదుల నీటి వినియోగంలో రాయలసీమ అవసరాలకు ప్రాధాన్యం, శాసనసభ ప్రాతినిధ్యంలో సమతుల్యత, అలాగే రాజధాని, విశ్వవిద్యాలయం, హైకోర్టు వంటి ప్రధాన సంస్థలను ప్రాంతాల మధ్య సమన్యాయంగా పంపిణీ చేయాలనే సూత్రాలను ప్రతిపాదించింది. దీని అంతర్లీన లక్ష్యం ఒకటే- ప్రాంతాల మధ్య ఆధిపత్యం కాకుండా సమాన భాగస్వామ్యం, సమతుల్య అభివృద్ధి.

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలు రాజధానిగా, గుంటూరు హైకోర్టు కేంద్రంగా నిర్ణయించారు. అయితే 1956లో తెలంగాణ విలీనంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత రాజధాని, హైకోర్టు రెండూ హైదరాబాద్‌కు మారాయి.ఈ పరిణా మాలు రాయలసీమకు ఇచ్చిన హామీలు, ప్రాంతీయ సమతుల్యతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తాయి. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కూడా రాయలసీమ అభివృద్ధిపై స్పష్టమైన, దీర్ఘకాలిక కార్యాచరణ కనిపించలేదన్న విమర్శలు కొనసాగుతున్నాయి.

రాయలసీమ సమస్యలలో అత్యంత కీలకమైనది నీటి కొరత. అనంతపురం వంటి జిల్లాలు తరచూ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా ఉండటం, భూగర్భజలాలు తగ్గిపోవడం, తాగునీటి సమస్య తీవ్రంగా మారడం ప్రజల జీవనంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది.హంద్రీ-నీవా, గలేరు-నాగరి వంటి ప్రాజెక్టులు రాయలసీమ భవిష్యత్తుకు అత్యంత కీలకమైనవి. ఈ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో సాగునీరు, తాగునీరు, కరువు నివారణకు సమగ్ర ప్రణాళిక అవసరం.

పోలవరం ద్వారా కృష్ణా డెల్టాకు మళ్లించే నీటిలో రాయలసీమ సాగునీటి అవసరాలకు తగిన కేటాయింపులు చేయాలనే డిమాండ్ కూడా పరిశీలనకు అర్హమైనది. నాగార్జునసాగర్ టెయిల్పాండ్ ద్వారా నీటి లభ్యత వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమర్థవంతంగా చర్చించి రాయలసీమ ప్రయోజనాలను కాపాడాలి. నీటి వనరుల విషయంలో తాత్కాలిక నిర్ణయాలకు బదులుగా శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా దీర్ఘకాలిక విధానం రూపొందించాలి.

ఒకప్పుడు రత్నాలసీమగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతం నేడు వెనుకబాటుతనం, కరువు, నిరుద్యోగం కారణంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. పెద్ద పరిశ్రమల కొరత, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు తగిన ప్రోత్సాహం లేకపోవడం ఉపాధి అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. కియా మోటార్స్ వంటి కొన్ని ప్రధాన పెట్టుబడులు వచ్చినప్పటికీ, విస్తృత స్థాయిలో పరిశ్రమీకరణ జరగలేదన్న భావన ఉంది. ఫలితంగా వేలాది మంది యువత ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జనాభా తగ్గడం, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కోవడం ఆందోళన కలిగించే పరిణామాలు. కడప ఉక్కు పరిశ్రమ వంటి ప్రధాన ప్రాజెక్టుల అమలులో జాప్యం కూడా ప్రాంత అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ప్రకటించిన అభివృద్ధి ప్యాకేజీలు, నిధుల కేటాయింపులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, స్పష్టమైన కాలపరిమితితో అమలు కావాలి. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని సమగ్రంగా అమలు చేయాలనే డిమాండ్ను ప్రభుత్వాలు గంభీరంగా పరిశీలించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగులు, మార్కెట్ లింకులు, నీటి నిల్వ వ్యవస్థలను విస్తరించాల్సిన అవసరం ఉంది.


బాగ్ ఒప్పందం స్ఫూర్తిలో పరిపాలనా వికేంద్రీకరణకు కీలక స్థానం ఉంది. రాష్ట్రంలోని ప్రధాన సంస్థలు, కార్యాలయాలు ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా వివిధ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుంది.రాయలసీమలో ముఖ్యమైన రాష్ట్ర, కేంద్ర స్థాయి సంస్థలను ఏర్పాటు చేయడం, పరిపాలనా కార్యాలయాలను వికేంద్రీకరించడం ద్వారా ఉపాధి, మౌలిక సదుపాయాలు, సేవారంగ అభివృద్ధికి ఊతం లభిస్తుంది. కేఆర్ఎంబీ వంటి కీలక సంస్థల కార్యాలయాల ఏర్పాటు విషయంలో కూడా ప్రాంతీయ సమతుల్యతను పరిగణనలోకి తీసుకోవాలనే అభిప్రాయం ఉంది.అదేవిధంగా, హైకోర్టు బెంచ్ వంటి న్యాయపరమైన సంస్థల ఏర్పాటు డిమాండ్లను ప్రజల న్యాయసేవల సౌలభ్యం, ప్రాంతీయ అవసరాలు, రాజ్యాంగపరమైన ప్రక్రియల దృష్ట్యా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

శ్రీబాగ్ ఒప్పందాన్ని కేవలం చారిత్రక పత్రంగా చూసి పక్కన పెట్టడం సరైంది కాదు. దాని అసలు స్ఫూర్తి ప్రాంతాల మధ్య విభేదాలను పెంచడం కాదు; అభివృద్ధి అవకాశాలను సమానంగా పంచుకోవడం. నీటి వనరులు, విద్య, పరిశ్రమలు, పరిపాలనా సంస్థలు అన్నీ కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా సమతుల్యంగా అభివృద్ధి చెందాలనే సందేశమే ఆ ఒప్పందం ఇచ్చింది. రాయలసీమ నిజమైన అభివృద్ధి కోసం రాజకీయ ప్రకటనల కంటే దీర్ఘకాలిక కార్యాచరణ అవసరం.

నీటి నిర్వహణకు శాస్త్రీయ ప్రణాళిక, కరువు నివారణకు స్థిరమైన చర్యలు, పరిశ్రమీకరణకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల విస్తరణ-ఇవన్నీ సమన్వయంతో అమలు కావాలి.రాయలసీమకు కావాల్సింది సానుభూతి కాదు, సమాన అభివృద్ధిలో న్యాయమైన వాటా. శ్రీబాగ్ ఒప్పందం హామీలను అక్షరాలా అమలు చేయాలా, వాటి స్ఫూర్తికి అనుగుణంగా నేటి అవసరాలకు కొత్త అభివృద్ధి విధానాన్ని రూపొందించాలా అనే చర్చ ఇప్పుడు అవసరం. చరిత్రను మరచిపోవడం సులభం కావచ్చు. కానీ చరిత్ర నేర్పిన సమతుల్య అభివృద్ధి పాఠాలను విస్మరిస్తే, ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. శ్రీబాగ్ ఒప్పందం గతానికి చెందిన పత్రం కావచ్చు. కానీ సమాన అభివృద్ధి అనే దాని సందేశం నేటికీ అత్యంత ప్రాసంగికమే. రాయలసీమ అభివృద్ధి ఒక ప్రాంత సమస్య కాదు, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి అది ఒక పరీక్ష.

- డా. ముచ్చుకోట సురేష్ బాబు
9989988912

సామాజిక ప్రతిబింబం 'ఉదారి'



కొన్ని అక్షరాలు కాగితాల మీదే నిలిచి పోతాయి. మరికొన్ని మనుషుల గుండెల్లోకి వెళ్లి ఆలోచనలుగా మొలకెత్తుతాయి. ఇంకొన్ని అన్యాయాన్ని ప్రశ్నించే ఆయుధాలుగా మారి, అణగారిన గొంతులకు భాషనిస్తాయి. అలాంటి విశిష్టమైన అక్షరమే డా. ఉదారి నారాయణ గారి సాహిత్య ప్రయాణం. ఆదిలాబాద్ మట్టి నేల నుంచి ఎదిగి, తెలంగాణ గ్రామీణ జీవిత వాసనను తన రచనల్లో అణువణువునా నింపుకుంటూ, ప్రజా జీవితాలను సాహిత్య వస్తువుగా మలుచుకున్న ఆయనకు కాళోజీ ఫౌండేషన్, వరంగల్ ప్రకటించిన 'కాళోజీ స్మారక పురస్కారం' అత్యంత సముచితమైన గుర్తింపు. ప్రజల భాషకు ప్రామాణిక గౌరవం కల్పించడం, సామాజిక అసమానతలను నిలదీయడం, ఆదిలాబాద్ ప్రాంతీయ సాహిత్య వారసత్వాన్ని భద్రపరచడం, మరియు కొత్త తరం రచయితలకు నిరంతరం వేదికలు కల్పించడం వంటి విస్తృతమైన సాహిత్య సేవలో ఉంది.

1964లో ఆదిలాబాద్ జిల్లాలో జన్మించిన ఉదారి నారాయణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రముఖ కవి కె. శివారెడ్డి రచించిన 'ఆసుపత్రి గీతం - వస్తువు, సంవిధానం' అనే అంశంపై ఎం.ఫిల్ పరిశోధన చేశారు. 2001లో 'ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత స్పహ' అనే అంశంపై పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉదారి నారాయణ కవిత్వంలోని ప్రధాన ప్రత్యేకత తెలంగాణ భాష. ప్రజల జీవితానుభవాల నుంచి పుట్టిన జీవభాష. పల్లె అనుభవాలు, శ్రమజీవుల నుడికారాలు, ప్రాంతీయ అస్తిత్వం అందులో సహజంగా విలీనమై ఉంటాయి.

అదిలాబాద్ ప్రాంతీయ విశిష్టతతో, అక్కడి జీవన విధానం, ఉద్యమ ఆకాంక్షలు మరియు సామాజిక రుగ్మతలను ప్రతిబింబించే విధంగా 'అదిలాబాద్ నానీలు' రాసారు 'ఏ అమరవీరుడి / చిరకాల స్వప్నమో / చెట్టు నిండా / ఎర్ర పిడికిల్లే' ఎర్రపిడికిలి అనేది విప్లవానికి, పోరాట పటిమకు, ధైర్యానికి ప్రతీక. అమరవీరుల త్యాగఫలంగా నేడు తెలంగాణ నేలపై ఆశయాలు సజీవంగా పిడికిలి బిగించి నిలబడ్డాయనే గట్టి సందేశాన్ని ఈ నాని ఇస్తుంది. 'ఉద్యమ త్యాగం / ఎర్రటి ఎద్దుపుండు / ఇంతకూ / లొట్టలేసే కాకులెవరు' ఉద్యమ త్యాగాలు ఒక పక్క తీవ్ర వేదనను (ఎద్దుపుండు లాంటి బాధను) మిగిలిస్తే, ఆ త్యాగాల పునాదుల మీద కొందరు స్వార్థపరులు లబ్ధి పొందుతూ ఆనందిస్తున్న వైనాన్ని కవి ఎత్తిచూపారు. 'తండ్రి పత్తాలాట కాడ / కొడుకు కిర్కెట్ కాడ / ఎడ్లు ఏట్లే / ఎవుసం మంట్లే' ఇది పూర్తిగా అదిలాబాద్ ప్రాంతపు అచ్చమైన యాసలో సాగిన నాని. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు కుటుంబ వ్యవస్థ ఎలా నిర్వీర్యమవుతున్నాయో ఈ నాని అద్దం పడుతుంది. 'యాల్లెంది' అనే కవితా సంపుటిలో 'కొత్తపొదు' శీర్షికన రాజకీయ నాయకుల అసలురూపాన్ని బట్టబయలు చేశారు. 'కాలం కాన్వాసు మీద/రంకు రాజకీయాల కంపు వాసనే/బొంకు వాగ్దానాల బురద గుంటలే/కన్ను ఏడుస్తున్నది/కుంచె తుడుస్తున్నది/వర్తమాన బతుకుబండి/మలేరియా రోజులా వణుకుతున్నది' సమాజాన్ని తమ స్వార్థం కోసం దానిని 'రంకు రాజకీయాలు' మరియు 'బొంకు వాగ్దానాల'తో కలుషితం చేస్తున్నారు.

'మాగిపొద్దు' అనే కవితాసంపుటిలో 'మహాసంకల్ప యాత్ర' అనే శీర్షికన తెలంగాణ ఉద్యమకారుని గమనాన్ని, గమ్యాన్ని వివరిస్తూ కవి అద్భుతమైన ఆవేశంతో, అరుదైన విప్లవాత్మక భావజాలాన్ని ఆవిష్కరించాడు. 'అతనెవరైతేనేం/అనంత దుఃఖ నదుల పక్షాన/చుక్కానిలా నిలబడి/నదుల నడకలను ఏకం చేసే/కొత్త దారులను వెతుకుతున్నాడు/కంటి చెలిమెల నుంచి కరెంటు లాగి/మహా సముద్రంలా మలుస్తున్నాడు' కోట్ల మంది కన్నీళ్లను తుడిచేందుకు, వారి శోకాన్ని విప్లవ జ్వాలగా మార్చేందుకు కదిలిన ఒక ఉద్యమకారుని నిశ్చయత్వానికి, పట్టుదలకు ఈ కవిత ఒక నిలువెత్తు అద్దం.

తెలుగు సాహిత్యంలో రైతు సమస్యలు, ఆత్మహత్యలు, మరియు దేశ ఆర్థిక విధానాల దుష్ప్రభావాలపై ఎన్నో కవితలు వచ్చాయి.

తెలంగాణ వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆంధ్ర పాలకులు చేసిన మోసాన్ని 'సముద్రం లేనోన్ని' అనే కవిత ద్వారా కళ్లకు కట్టారు. 'వట్టిపోయిన గోదారి పొదుగును చూసి' కన్నీరు మున్నీరైన తెలంగాణ రైతు వేదన ఇక్కడ ప్రతిధ్వనిస్తుంది. 'నాకు చెరువుంటే సముద్రమున్నట్టే/ చెలిముంటే ప్రాణజలమున్నట్టే' అంటూ తమకున్న చిన్న చిన్న నీటి వనరుల్లోనే జీవితాన్ని వెతుక్కునే ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను చాటారు. 'ఆకుపచ్చని పంట పొలాలే మా సముద్రం' అని ప్రకటించడం ద్వారా తెలంగాణ ప్రజల జీవన విశ్వాసాన్ని, ఆశావహ దక్పథాన్ని కవి అద్భుతంగా ఆవిష్కరించారు.

2001లో తన తొలి కవితా సంపుటి 'ఆకుపచ్చని ఎడారి' తో సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించి, 2011లో 'యాల్లెంది రూపంలో నేల మనుషుల స్వరాన్ని గట్టిగా వినిపించారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉధతంగా సాగుతున్న కాలంలో, 2012లో ఆదిలాబాద్ పోరాట చైతన్యాన్ని అక్షరబద్ధం చేస్తూ 'ఎల్గడి' ప్రాంతీయ ఉద్యమ కవితా సంకలనానికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. ఆ తర్వాత కవిత్వంలో 'మాగిపొద్దు' (2017) తెచ్చిన ఆయన, 2019లో తెలంగాణ



సాహిత్య అకాడమీ ప్రచురించిన 'ఆదిలాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర' ఆయన పరిశోధనా కృషిలో ఒక ప్రధాన మైలురాయి.

సాహిత్య సేవలో మరో ముఖ్యమైన కోణం సంస్థాగత కషి. 'ఆదిలాబాద్ సాహితీ మిత్ర మండలి', 'దరకమే', 'తెలంగాణ రచయితల వేదిక' వంటి సంస్థల్లో వివిధ బాధ్యతలు నిర్వహించిన ఉదారి నారాయణ, సాహిత్యాన్ని సమూహ చైతన్యంగా విస్తరించేందుకు అహరహం కషి చేశారు. 2000వ సంవత్సరం నుంచి తన తండ్రి, తత్వకవిగా గుర్తింపు పొందిన ఉదారి నాగదాసు గారి జ్ఞాపకార్థం స్వగ్రామమైన బండల నాగాపురంలో సాహిత్య సమావేశాలు, కవితా పోటీలు నిర్వహించారు. 2019 నుంచి వాళ్ళ కుటుంబ సభ్యుల సహకారంతో రాష్ట్ర స్థాయిలో కమిటీ ద్వారా ఉత్తమ కవితా సంపుటిని ఎంపిక చేసి తన తండ్రి పేరిట ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్నారు. 2019 సెప్టెంబరు 2న ప్రారంభించిన ఐత్యారం ముచ్చట్లు వేదిక ద్వారా ప్రతి ఆదివారం కవితా సమావేశాలు నిర్వహిస్తూ నవతరం కవులకు, కవయిత్రులకు తమ రచనలు వినిపించే నిరంతర వేదికను కల్పించారు.

అన్యాయాన్నెదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు అన్న కాళోజీ స్ఫూర్తి ప్రజాపక్షాన నిలబడటంలో ఉంది. ఉదారి నారాయణ గారి రచనల్లోని భాషా స్వాభిమానం, సామాజిక స్పహ, ప్రాంతీయ అస్తిత్వం ఈ విలువలనే ప్రతిబింబి స్తాయి. గతంలో ఆయనకు తేజ ఆర్ట్ క్రియేషన్స్ పురస్కారం, సోమ సీతారాములు పురస్కారం, కలహంస పురస్కారం, వట్టికోట ఆళ్వారుస్వామి స్మారక పురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ కవితా పురస్కారం, సాహితీ కిరణం అవార్డు, తెలంగాణ సారస్వత పరిషత్తు అవార్డు, సురవరం ప్రతాప రెడ్డి కీర్తి పురస్కారం, సిద్దిపేట వారి సాహితీ సంగమం అవార్డు లాంటి పురస్కారాలు లభించాయి. కాళోజీ స్మారక పురస్కారం ఒక వ్యక్తికి లభించిన సన్మానం మాత్రమే కాదు తెలంగాణక స్వరానికి లభించిన సముచిత పురస్కారం.

(ఉదారి నారాయణ నవంబర్ 13న కాళోజీ ఫౌండేషన్ వారి కాళోజీ స్మారక సాహిత్య పురస్కారం అందుకుంటున్న సందర్భంగా)

- వినయ్ కుమార్ కొట్టే
7032629768



డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యకు సన్మానం

- జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్ చే ఘనంగా సత్కారం

జగిత్యాల నవంబర్ 11(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు గాజంగి నందయ్యను జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మహిళా కాంగ్రెస్ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు.

భూముల రీసర్వేపై రైతులు అవగాహన పెంచుకోవాలి



- వరికి బదులుగా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల, నవంబర్ 11 (మనం ప్రతినిధి): భూముల రీసర్వేపై రైతులు అవగాహన పెంచుకొని, సర్వే నిర్వహణ సమయంలో అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. బుధవారం గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, భూముల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు వరికి బదులుగా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్పామ్, కూరగాయల సాగు ద్వారా లాభాలు పొందుతున్న రైతుల అనుభవాలను తెలుసుకొని ఇతర పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ విధానానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దేశిని చిన మల్లయ్య



- మంత్రి పొన్నం ఘన నివాళి

చిగురుమామిడి, నవంబర్ 11 (మనం న్యూస్): ఇందుర్తి మాజీ శాసనసభ్యులు, ప్రజా నాయకులు స్వర్గీయ దేశిని చిన మల్లయ్య వర్ధంతి సందర్భంగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 'కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో జన్మించిన దేశిని చిన మల్లయ్య గారు ఇందుర్తి నియోజకవర్గం నుండి వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తపించిన నాయకుడు చిన మల్లయ్య ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో యోధుడిగా పాల్గొని, ముఖ్యంగా వెట్టి చాకిరి విధానానికి, బానిసత్వానికి, భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను చేపట్టి ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప నాయకుడు దేశిని చిన మల్లయ్య

అంతేకాకుండా వ్యవసాయ కార్మిక సంఘాల నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ముఖ్యంగా కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేసి వారికి అండగా నిలిచిన వ్యక్తి. ప్రజా ఉద్యమాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడం కోసం జీవితాంతం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

మాజీఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య వర్ధంతి వేడుకలు



చిగురుమామిడి, నవంబర్ 11 (మనం న్యూస్): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ నేతృత్వంలో నాయకులు,కార్యకర్తలు చిన్న మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ఇందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజల సంక్షేమానికి చిన్న మల్లయ్య చేసిన అంకితభావంతో కూడిన సేవలను కొనియాడారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సింగిల్ విండో ఛైర్మన్ చిట్టుమల్ల రవిందర్,డీసీసీ కార్యదర్శులు బడుకోలు దేవేందర్ రెడ్డి, సాంబారి బాబు,సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, ఆలువాల శంకర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, సింగిల్ విండో డైరెక్టర్స్ పోటు మల్లారెడ్డి, కుతాటి తిరుపతి,మర్రి శ్రీనివాస్, ఉపసర్పంచ్ లు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,గౌడ సంఘము అధ్యక్షులు వీరగోని విజ్జగిరి,ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాయమల్లు, తాళ్లపల్లి కుమార్, దేశిని రాజయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు మచమల్ల రమణయ్య,ఎలగందుల లక్ష్మణ్,మండల సీనియర్ నాయకులు పచ్చిమట్ల జగన్,బొమ్మగాని వెంకటేశ్వర్లు,దోమ శ్రీనివాస్ రెడ్డి, సుకోషి పద్మ,మడమడకల రాజిరెడ్డి,మామిడి రాజు,కూరెళ్ల కిషోర్ మామిడి శీను,మామిడి రమేష్,నన్నే రాకేష్,సమ్మయ్య, చట్ల శీను,రఘు రాములు, మాచమల్ల కిషోర్,సదానందం, నరసయ్య,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిగురుమామిడి కాంగ్రెస్ నేతల హర్షం



చిగురుమామిడి, నవంబర్ 11 (మనం న్యూస్): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో జీహెచ్ఎంసీ కి జాతీయ అవార్డు రావడం, గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డు అందుకోవడం పట్ల చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, హుస్నాబాద్ టౌన్ ప్రెసిడెంట్ వీవీ రమణ, చిగురు మామిడిసింగిల్ విండో చైర్మన్ చిట్టమల్ల రవీందర్, చిగురుమామిడి మండల కాంగ్రెస్ నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి అభినందనీయం. రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోవడం మన తెలంగాణకే గర్వకారణం. .జీహెచ్ఎంసీ 2017లో ఓడీఎఫ్ 2021లో వాటర్ ప్లస్, 2024లో 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీగా ఎదగడం వెనుక కార్మికుల, అధికారుల కృషి ఉంది. ఈ అవార్డు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను మరింత పెంచుతుంది' అని అన్నారు.

భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

- నవంబర్ నెలాఖరులోగా తొలి విడత సర్వే పూర్తి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్





సిరిసిల్ల, నవంబర్ 11 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్ నెలాఖరులోగా తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో మంత్రి మాట్లాడుతూ రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని, అసైన్డ్ భూముల పట్టాల నిజానిజాలు, భూముల విస్తీర్ణం, భూసేకరణకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రీసర్వేలో అవకతవకలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీసర్వే అనంతరం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్తో అందించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఐడీఓసీ నుంచి హాజరయ్యారు. ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కేఎస్వీ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువే విద్యార్థి ప్రగతికి ఆధారం

విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా అభ్యసించాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
పెద్దూర్ పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభం
జిల్లాలో 20 పాఠశాలలకు కోటి రూపాయలతో స్మార్ట్ తరగతి గదులు



సిరిసిల్ల, నవంబర్ 11 (మనం ప్రతినిధి): విద్యార్థుల ప్రగతికి చదువే ప్రధాన ఆధారమని, విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్ను కలెక్టర్ ప్రారంభించారు. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులు కోటి రూపాయలతో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, డెస్కులు, ఫ్యాన్లు, లైట్లు, యూపీఎస్ తదితర సౌకర్యాలు కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం, సుధామూర్తి వంటి ఆదర్శమూర్తులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. పేదరికం, కుటుంబ నేపథ్యం, ప్రాంతం విద్యాభ్యాసానికి అడ్డంకులు కావని, కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ప్రహసనంగా మారిన ఆహార తనిఖీలు



- అనుమతులు నిలిపివేసినా జోరుగా విక్రయాలు
- పైరవీలకే పెద్దపీట
- కాగితాలకే పరిమితమైన నిఘా విభాగం ఆదేశాలు

భద్రాచలం, నవంబర్ 11 (మనం న్యూస్): పట్టణంలో ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న పలు భోజనశాలలపై ఆహార నియంత్రణ విభాగం చేపట్టిన చర్యలు కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితమయ్యాయన్న విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టి, తీవ్ర లోపాలు బయటపడటంతో తొమ్మిది ప్రముఖ హోటల్ వ్యాపార అనుమతులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే, ఆ ప్రకటన కాగితాల దాటకపోవడం, క్షేత్రస్థాయిలో యథేచ్ఛగా లావాదేవీలు కొనసాగుతుండటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు నిలిచిన కేంద్రాలివే...

నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేసి వంటకాలు సిద్ధం చేస్తున్న సాయి దుర్గా, గీతాంజలి, గౌతమి స్వీట్స్, రాఘవేంద్ర, స్వాతి, అన్నపూర్ణ, నాగ సత్య విందు కేంద్రం, ఎస్.ఆర్.కె, అనిల్ భోజనశాలల అనుమతులను అధికారులు తక్షణమే నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా తీవ్రమైన లోపాలు ఉన్న కోసల, చందమామ, సరికొత్త వెన్నెల కేంద్రాలకు తమ పనితీరును మార్చుకోవాలంటూ హెచ్చరిక పత్రాలు అందించారు. ఈ తనిఖీల వేళ వినియోగానికి ఏమాత్రం పనికిరాని, దుర్వాసన వస్తున్న సుమారు 565 కిలోల ముడి సరుకులను పారబోయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

తనిఖీల్లో వెలుగుచూసిన విస్తుపోయే వాస్తవాలు, నిల్వ ఉంచిన పదార్థాల వినియోగం: రోజుల తరబడి ఫ్రిజ్లలో నిల్వ ఉంచిన మాంసం, కుళ్ళిన కూరగాయలు, విషపూరితంగా మారిన రసాయన నూనెలను విచ్చలవిడిగా వాడుతున్నట్లు గుర్తించారు.

అపరిశుభ్ర వాతావరణం, వంటగదుల పరిసరాలు తీవ్ర దుర్గంధంతో నిండి ఉండటం, ఈగలు, బొద్దింకల బెడద ఉన్నప్పటికీ అదే మురుగు వాతావరణంలో తినుబండారాలు తయారు చేస్తుండటం బట్టబయలైంది.

వైద్య ధ్రువీకరణ పత్రాల గైర్హాజరు: ఆహారం వండే సిబ్బందికి చర్మవ్యాధులు లేదా ఇతర అంటువ్యాధులు లేవని ధ్రువీకరించే తప్పనిసరి వైద్య పత్రాలు ఏ ఒక్క కేంద్రంలోనూ సరిగ్గా లేవు.

పైరవీల అండతో యథేచ్ఛగా దందా.. చూసీచూడనట్లు అధికారులు...!

నిబంధనల ప్రకారం అనుమతులు నిలిపివేసిన భోజనశాలలు తిరిగి పూర్తిస్థాయిలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించి, అధికారిక తనిఖీల్లో నిర్ధారణ అయ్యేంతవరకు దుకాణాలను తెరవడానికి వీల్లేదు. కానీ భద్రాచలంలో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. రాజకీయ, వ్యాపార పైరవీల ఒత్తిళ్లతో యజమానులు తాళాలు తీసి, నిర్భయంగా వంటలు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. స్థానిక పర్యవేక్షక విభాగం అధికారులు ఈ ఉల్లంఘనలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకోకుండా, తక్షణమే ఆయా దుకాణాలకు సీళ్ళు వేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని భక్తులు, పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి నవంబర్ 11(మనం న్యూస్): ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని బస్తీలు, కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు, మహిళా సంఘాలకు అవసరమైన భవనాల నిర్మాణం చేపడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప-అంబేద్కర్ నగర్, వెంకటేశ్వర కాలనీ, బంజారాహిల్స్-నందతాండా, గరిమెళ్ళపాడు ప్రాంతాల్లో దాదాపు రూ.47 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంబేద్కర్ నగర్లో రూ.10 లక్షల వ్యయంతో, వెంకటేశ్వర కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సంఘాల వీవో భవనాలను ప్రారంభించారు. అదేవిధంగా నందతాండాలో రూ.12 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, గరిమెళ్ళపాడులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, మురుగు కాలువల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, పొదుపు సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీవో భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు ఒకచోట సమావేశమై తమ సంఘాల కార్యకలాపాలు నిర్వహించుకోవడంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు పూర్తి చేయడం సంతృప్తికరమన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పల్లెలు, పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో సంధ్య, పీఆర్ డీఈ నాగేందర్, ఏఈ నవీన్ కుమార్, ఏపీఎం సీసీ రమాదేవి, నీడలా సుధాకర్, మన్నెం వెంకన్న, సర్పంచ్ సీతారాములు, సర్పంచ్ వాడే రాములు, జగదాంబ, గుగులోత్ నగేష్, రమేష్, అంకుష్, రవి, తాజుద్దీన్, నవీన్, ఉదయ్, తూముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశంలో విద్యాభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు అబుల్ కలాం



- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల, నవంబర్ 11 (మనం న్యూస్): స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి, గుణాత్మక విద్యకు పునాదులు వేసిన తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ పేర్కొన్నారు. బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ జన్మదినమైన నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆజాద్ సుమారు 11 సంవత్సరాల పాటు దేశ విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారు. సమగ్ర విద్యావిధాన రూపకల్పనకు పునాదులు వేయడంతో పాటు ప్రాథమిక, ఉన్నత, సెకండరీ విద్యాభివృద్ధికి ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేశారు. విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాల సాధనకు యూజీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటుకు కృషి చేసి, సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. భారతీయ సంస్కృతి, కళలు, సంగీతం, సాహిత్య పరిరక్షణకు విశేష సేవలందించారు. విద్య ద్వారానే వ్యక్తి, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని చాటిచెప్పిన ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయాలని ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ మరియు జిల్లా రెవెన్యూ అధికారి కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది మరియు పాల్గొన్నారు.

ఎంఆర్పీకి మించి మద్యం విక్రయాలు

- సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ అధికారులు ఉన్నట్లా? లేనట్లా?.
- బ్లాక్ డాగ్ బాటిల్‌పై రూ.370 అదనపు వసూలు?
- గోపాల్‌నగర్ చౌరస్తా వైన్స్‌లో ఈ ఘటన
- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇంతేనా? ప్రజల ఆగ్రహం

సిరిసిల్ల, నవంబర్ 11 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్ చౌరస్తా వైన్స్‌లో మద్యం విక్రయాలపై కొనుగోలుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ డాగ్ మద్యం బాటిల్ ముద్రించిన ఎంఆర్పీ ధర కంటే ఏకంగా రూ.370 అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఎంఆర్పీ ధర ఒకటైతే విక్రయ ధర మరొకటిగా ఉండటంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అధిక ధర ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే పెరిగిన ధరల ప్రకారం విక్రయిస్తున్నామని వైన్స్ నిర్వాహకులు సమాధానం ఇస్తున్నట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. బిల్లు అడిగితే వైన్స్ పేరు, వివరాలు లేని కాగితాలపై బిల్లులు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.



జిల్లా అంతటా ఇదే తంతు కొనసాగుతోందా?

జిల్లా కేంద్రంలోని ఒక వైన్స్లోనే ఎంఆర్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటే జిల్లాలోని ఇతర వైన్స్లలో పరిస్థితి ఎలా ఉందోనని కొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. సిరిసిల్ల జిల్లాలో అన్ని చోట్ల ఇదే తంతు కొనసాగుతోందా? మద్యం దుకాణాల్లో ధరల నియంత్రణపై పర్యవేక్షణ ఉందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ శాఖ అధికారులు ఎక్కడ? తనిఖీలు ఏవి?

మద్యం దుకాణాల్లో ఎంఆర్పీ ధరల అమలును పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఎక్కడ ఉన్నారనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారా? అధిక ధరల వసూళ్లపై పర్యవేక్షణ చేస్తున్నారా? తనిఖీలు ఎక్కడ? అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు వెంటనే గోపాల్నగర్ చౌరస్తా వైన్స్లో తనిఖీలు నిర్వహించి, బాటిళ్లపై ఉన్న ఎంఆర్పీ ధరలు, వసూలు చేస్తున్న ధరలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని వైన్స్లలోనూ ధరలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

3000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్

- మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మనం ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లాను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్ది, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.58.85 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన నూతన ఐటీ టవర్‌ను బుధవారం నాడు ఆయన ప్రారంభించారు. నిధుల కొరతతో గతంలో నిలిచిపోయిన ఈ నిర్మాణాత్మక ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో వేగవంతం చేసి అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వలస వెళ్లకుండా, స్వగ్రామాల్లోనే అవకాశాలు కల్పించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు.

మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు...

నూతన ఐటీ టవర్లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణ కేంద్రంతో పాటు ఇంక్యుబేషన్ హబ్ను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పటికే ఎన్టీటీ డేటా (300 మంది), ఎన్ ల్యాబ్స్ (250 మంది), వైడర్ సాఫ్ట్వేర్ (20 సీట్లు), పోస్టిట్ ఏఐ (50 మంది) వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని వెల్లడించారు. వీటితో పాటు ఆదిలాబాద్లో 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు (తొలి విడతలో 2,000 ఎకరాలు, రెండో విడతలో 1,000 ఎకరాల భూసేకరణ). హైదరాబాద్కే పరిమితమైన ఐటీ సేవలను టైర్ 2, టైర్ 3 నగరాలకు విస్తరించడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి పేర్కొన్నారు.

విమానాశ్రయ శంకుస్థాపన, సీసీఐ పునరుద్ధరణ

ఆదిలాబాద్లో విమానాశ్రయం ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, భూసేకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని శ్రీధర్ బాబు చెప్పారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రాంతీయ పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. అలాగే, గతంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమను సాంకేతిక, విధానపరమైన చిక్కులు తొలగించి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విమానాశ్రయం, రైల్వే, సీసీఐ పునరుద్ధరణ ప్రాజెక్టులు పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఐటీ టవర్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. మరో ఐటీ టవర్, స్థానిక పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అభినందిస్తూ, ఆదివాసీ యువతకు ఉద్యోగ ప్రాధాన్యం, వర్సిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ కార్యదర్శులు అనుదీప్, శశాంక్, అడిషనల్ కలెక్టర్లు, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యతీంద్ర సప్తతి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక శోభ



- 70 మంది మాతృమూర్తులకు ఘన సన్మానం

హైదరాబాద్, నవంబర్ 11(మనంన్యూస్): రంగారెడ్డి జిల్లా పరిధిలోని శ్రీరామనగరంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక యతీంద్ర సప్తతి ఉత్సవాల్లో భాగంగా సమాజంలో నిస్వార్థ సేవలు అందిస్తున్న 70 మంది విశిష్ట మాతృమూర్తులకు శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అమృత హస్తాల మీదుగా ఘన సన్మానం జరిగింది. మై హోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు సతీమణి శ్రీకుమారి, ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త శైలజా కిరణ్, సివిల్స్ కోచ్ బాలలతతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళా మూర్తులను స్వామిజీ స్వయంగా శాలువాతో సత్కరించి ఆశీస్సులు అందించారు. సమాజ హితం కోసం నిశ్శబ్దంగా శ్రమిస్తున్న మహిళలను గుర్తించి గౌరవించడం ఎంతో ఆనందకరమని స్వామిజీ అన్నారు. భారతీయ సంప్రదాయం, వైదిక సంస్కృతిలో మహిళలకు అత్యున్నత గౌరవం, మర్యాద ఉన్నాయని స్పష్టం చేశారు. వేల సంవత్సరాల క్రితమే స్త్రీలకు మంత్రోపదేశంతో పాటు సమాన ఆధ్యాత్మిక హక్కులను కల్పించిన ఘనత భగవద్ రామానుజాచార్యులకే దక్కుతుందని కొనియాడారు. సమాజంలో మూఢనమ్మకాలు, లింగ వివక్ష తీవ్రంగా ఉన్న రోజుల్లోనే రామానుజులు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఆధ్యాత్మిక దార్శనికతను వివరించారు.

భగవంతుడి దృష్టిలో అందరూ సమానులే.. కుల, లింగ భేదాలపై స్వామిజీ హితవు:

సమాజ అభివృద్ధికి సమానత్వమే పునాది అని చాటిచెప్పిన రామానుజాచార్యులు, భగవంతుడి సృష్టిలో కుల, మత, లింగ భేదాలకు ఎంతమాత్రం తావులేదని స్పష్టం చేశారని స్వామిజీ వ్యాఖ్యానించారు. భగవంతుని దృష్టిలో మనుషులు, జంతువులు, పక్షులు అనే తేడాలు ఉండవని, ప్రతి ప్రాణిలోనూ దైవత్వాన్ని చూడటమే అసలైన మానవత్వమని హితవు పలికారు. మానవాళి అంతా ప్రేమ, కరుణతో మెలగాలని స్వామిజీ పిలుపునిచ్చారు.

15న పటాన్ చెరులో ఛట్ పూజ



- ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- ప్రముఖ భోజ్పురి గాయకుడు రితేష్ పాండే, గాయకురాలు కావ్య లతో సంగీత కచేరీ
- ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చెరు, నవంబర్ 11 (మనం న్యూస్) : నవంబర్ 15న పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు వేదికగా ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజను భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..ఛట్ పూజ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత 15 సంవత్సరాలుగా పటాన్ చెరు వేదికగా ఛట్ పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలతో పాటు సొంత నిధులతో ఉచితంగా చెరుకును పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఉత్తర భారతీయుల సంక్షేమానికి నిరంతరం అండగా నిలుస్తూ.. వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజలతో సమానంగా అన్ని రాష్ట్రాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. ఛట్ పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ రామచంద్రా రెడ్డి, రాజు, సుధాకర్ గౌడ్, సంజయ్ సింగ్, టింకు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు అదనంగా గోదావరి నీళ్లు



హైదరాబాద్, మనంప్రతినిధి: హైదరాబాద్ మహానగరంలో రాబోయే రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా జలమండలి పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. అంతర్జాతీయంగా ఎల్నినో పరిస్థితులు నెలకొనడం. దానికి తోడు నగరానికి ప్రధాన తాగునీటి ఆధారాలైన సింగూరు, మంజీరా జలవనరుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతుండటంతో అధికారులు ముందస్తు చర్యలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) అదనపు గోదావరి జలాలను హైదరాబాద్కు తరలించనుంది. ఇప్పటికే పైప్ లైన్ అనుసంధాన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీ నాటికి పైప్లైన్ అనుసంధాన పనులను పూర్తి చేసి గోదావరి జలాలను నగరానికి రప్పించాలని అధికారులు నిర్ణయించారు.

రెండు వైపులా వేగంగా పనులు..

పైప్లైన్ నిర్మాణాన్ని ఒకే వైపు నుంచి కాకుండా రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, అనుసంధాన ప్రక్రియను వేగంగా చేస్తున్నారు. బిల్లుల చెల్లింపులు, ఆర్థిక సర్దుబాట్లను పక్కనపెట్టి మరీ. ప్రస్తుతం మంచినీటి ప్రాజెక్ట్ పూర్తికే అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని తాజా జలమండలి ఎండీ ఆదేశించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి రోజుకు 8 గంటల చొప్పున మూడు షిఫ్టులలో ప్రత్యేక కార్మిక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకూ వేర్వేరు బృందాలను నియమించి రాత్రింబవళ్లు పనులు కొనసాగేలా చూడాలన్నారు.

రాత్రి వేళల్లో పనులకు ఆటంకం కలగకుండా భారీ ఫ్లడ్లైట్లు, అవసరమైన యంత్ర సామాగ్రి, ఇతర సాంకేతిక సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు క్రాసింగ్ పనులపై ప్రత్యేక దృష్టి.

పైప్లైన్ అనుసంధానంలో అత్యంత కీలకమైన రోడ్డు క్రాసింగ్ పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అవసరమైన రవాణా, పోలీసు అనుమతులు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసుకోవటంతో పాటు. రాత్రి నుంచే రోడ్డు కటింగ్ పనులు ప్రారంభించనున్నారు. రెండు మూడు రోజుల్లోనే పైపుల అమరికకు మార్గం సుగమం అయ్యేలా మరో రెండు మూడు అదనపు ప్రత్యేక కార్మిక బృందాలను ఈ పనుల కోసం కేటాయించనున్నారు. గోదావరి జలాల తరలింపులో ఎలాంటి అడ్డంకులు రాకుండా మిషన్ భగీరథ, అటవీ శాఖ అధికారులతో జలమండలి అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇతర గోదావరి ప్రాజెక్టు పనుల్లో ఉన్న ఇంజినీరింగ్ నిపుణులు, కార్మిక బృందాలు, ఎక్స్కవేటర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర భారీ వాహనాలను తక్షణమే ఘన్పూర్ పనులకు మళ్లించనున్నారు.

వేసవికి ముందే పక్కా ప్రణాళిక.

ముందుముందు వేసవి కాలంలో నగరంలో నీటి వినియోగం గణనీయంగా పెరుగుతుందని, దానికి తగినట్లుగా అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సమర్థవంతంగా వాడుకోవాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా మంజీరా, సింగూరు ప్రాజెక్టులపై ఆధారపడిన నగర ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు.

పైప్లైన్ పనుల పురోగతిని ప్రతిరోజూ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, సాంకేతిక సమస్యలు వస్తే అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు సకాలంలో పూర్తవ్వడం జలమండలి ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, కాంట్రాక్టర్లు, అధికారులు పూర్తి బాధ్యతాయుతంగా పనిచేసి నవంబర్ 15 కల్లా రోజుకు 40 ఎంజీడీల అదనపు గోదావరి నీటి సరఫరాకు మార్గం సుగమం చేయాలని స్పష్టం చేశారు.

ఆపదలో ఎమ్మెల్సీ 'అంజన్న' అపన్న హస్తం



- కొల్లూరు ఎగ్జిట్ వద్ద ఓఆర్ఆర్‌పై కారు అదుపు తప్పి ప్రమాదం
- క్షతగాత్రులకు అండగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి
- ప్రమాద బాధితులను సొంత వాహనంలో ఆసుపత్రికి తరలింపు
- స్వయంగా వైద్య సేవలను పర్యవేక్షించి బాధిత కుటుంబాలకు భరోసా

రామచంద్రాపురం, నవంబర్ 11 (మనం న్యూస్) : ఔటర్ రింగ్ రోడ్డుపై కొల్లూరు ఎగ్జిట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందించి, బాధితుల ప్రాణాలను కాపాడేందుకు సకాలంలో స్పందించారు. బుధవారం ఉదయం అధికారిక పర్యటన నిమిత్తం ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా వెళ్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి మార్గమధ్యంలో ఓ కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటనను గమనించారు. కారులో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడటంతో వెంటనే తన కాన్వాయ్ను నిలిపి సహాయక చర్యలు చేపట్టారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డితో కలిసి క్షతగాత్రులను తన సొంత వాహనంలో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం వైద్యులను అప్రమత్తం చేసి, క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్నవారికి సమయానికి సాయం అందించడమే నిజమైన మానవత్వమని తన చర్యల ద్వారా ఎమ్మెల్సీ అంజిరెడ్డి చాటి చెప్పారు. ఆయన తక్షణ స్పందన, మానవతా దృక్పథంపై స్థానికులు, వాహనదారులు అభినందనలు వ్యక్తం చేశారు.

సోనియా గాంధీ ఆత్మకథ ఆధారంగా సినిమా తీస్తాను

సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలు


సోనియా గాంధీ తాను స్వయంగా రాసిన 'బిలాంగింగ్- ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం పై జగ్గారెడ్డి కీలక ప్రకటన

సినిమా నిర్మాణం పై 50 మందితో కమిటీ ఏర్పాటు చేస్తాను: జగ్గారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభింపజేస్తా

సముద్రమంత లోతున్న కాంగ్రెస్ పార్టీ రాజకీయాన్ని సోనియాగాంధీ అధ్యయనం చేశారు

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను దేశం కోసం ముందుకు నడిపిస్తున్న ఘనత ఆమెదే.



సంగారెడ్డి నవంబర్ 11 మనం న్యూస్ ప్రతినిధి. : కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ స్వయంగా రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆధారంగా ఆమె జీవితాన్ని తెలుగులో తెరకెక్కిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రానికి సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణానికి రూ.2 కోట్లు ఇస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ జులకంటి ఆంజనేయులు ప్రకటించారు.

50 మందితో కమిటీ...

సినిమా నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేందుకు 50 మందితో కమిటీ ఏర్పాటు చేయాలని జగ్గారెడ్డి సూచించారు. ఈ కమిటీని గాంధీ భవన్ పీఆర్వో హరిప్రసాద్ పర్యవేక్షిస్తారని జగ్గారెడ్డి తెలిపారు.నాయకులు నిధులు సిద్ధం చేసుకోవాలని కోరారు. ''ఎన్నికలకు ఖర్చు పెడతారు కదా. దీన్నీ అలాంటి ఖర్చుగానే అనుకోండి. బడ్జెట్ సమీకరించి, మంచి దర్శకుడిని ఎంపిక చేద్దాం'' అని కార్యకర్తలతో అన్నారు. ఏర్పాట్లు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ను ఆహ్వానించి, వారి చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. సోనియాగాంధీ జీవితాన్ని కార్యకర్తలు మరింత దగ్గరగా తెలుసుకునేందుకు ఆమె పుస్తక ప్రతులను తెప్పించి పంపిణీ చేస్తామన్నారు. కుటుంబ జీవితం నుంచి రాజకీయ ప్రస్థానం వరకు ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్గాంధీ భార్యగా, రాహుల్గాంధీ, ప్రియాంకాగాంధీలకు తల్లిగా సోనియాగాంధీ జీవితంలోని వివిధ దశలను సినిమాలో చూపిస్తామని జగ్గారెడ్డి చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్గాంధీల హత్యలతో కుటుంబం ఎదుర్కొన్న విషాదం, ఆ తర్వాత సోనియా ఎదుర్కొన్న కష్టాలు, రాహుల్, ప్రియాంకలను పెంచిన తీరు, ఆమె రాజకీయ ప్రస్థానాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు. ఎన్నో మతాలు, కులాలు, భాషలతో కూడిన భారతదేశంలో సోనియాగాంధీ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని చెప్పారు. ''సముద్రం ఎంత లోతో, కాంగ్రెస్ రాజకీయ వ్యవస్థ అంత లోతైనది. ఆ రాజకీయాలను సోనియాగాంధీ అధ్యయనం చేశారు'' అని వ్యాఖ్యానించారు. ఆమెది విజయవంతమైన రాజకీయ జీవితమని అన్నారు.

ప్రధాని పదవిని వదులుకోవడం చరిత్ర

సోనియాగాంధీకి ప్రధాని పదవిపై వ్యామోహం లేదని జగ్గారెడ్డి అన్నారు. రాజీవ్గాంధీ మరణానంతరం పీవీ నరసింహారావు ప్రధాని అయిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అప్పట్లో సోనియా ఆ పదవిని ఆశించలేదని చెప్పారు. యూపీఏ అధికారంలోకి వచ్చాక సోనియాగాంధీని ప్రధానిగా ఉండాలని పార్టీ నేతలు కోరినా, ఆమె ఆ పదవిని స్వీకరించకుండా మన్మోహన్సింగ్కు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధాని అయ్యే అవకాశాన్ని ఆమె వదులుకోవడం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయమని అభిప్రాయపడ్డారు. సోనియాగాంధీ, మన్మోహన్సింగ్, రాహుల్గాంధీల ఆలోచనల నుంచి ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని జగ్గారెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం నుంచి మళ్లీ ప్రధాని రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రాహుల్గాంధీ ప్రధాని కావాలనేది సోనియాగాంధీ ఆకాంక్ష అని వ్యాఖ్యానించారు.

పటాన్చెరు నుంచి ఈపీఎఫ్ కార్యాలయం తరలించొద్దు

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- తాత్కాలికంగా కొత్తగూడకు మార్చే నిర్ణయాన్ని విరమించుకోవాలి
- ఈపీఎఫ్ కమిషనర్తో మాట్లాడిన ఎంపీ మాధవనేని
- భవన యజమానితో మాట్లాడి మూడు నెలల గడువు ఇప్పిస్తానని హామీ



పటాన్చెరు, నవంబర్ 11 (మనం న్యూస్) : పటాన్చెరు పట్టణంలోని ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) కార్యాలయాన్ని తాత్కాలికంగా హైదరాబాద్లోని కొత్తగూడకు తరలించే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సంబంధిత అధికారులను కోరారు. కార్యాలయం తరలింపుతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటూ ఈ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం పలువురు కార్మికులు ఈ సమస్యను ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఈపీఎఫ్ కమిషనర్తో ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుతం పైవేట్ భవనంలో కొనసాగుతున్న కార్యాలయానికి సంబంధించి అద్దె ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు భవన యజమాని నిరాకరించడంతో, పటాన్చెరు బస్టాండ్లోని మూడో అంతస్తుకు కార్యాలయాన్ని మార్చాలని నిర్ణయించినట్లు కమిషనర్ వివరించారు. అయితే అక్కడ కార్యాలయానికి అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టేందుకు కనీసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, అందుకే అప్పటివరకు తాత్కాలికంగా కొత్తగూడకు తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ తరలింపు వంటి కీలక నిర్ణయం తీసుకునే ముందు స్థానిక ఎంపీతో పాటు ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. భవన యజమానితో తాను మాట్లాడి మరో మూడు నెలల గడువు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్కసారి ఈపీఎఫ్ కార్యాలయం హైదరాబాద్కు తరలిపోతే తిరిగి పటాన్చెరుకు తీసుకురావడం కష్టమవుతుందని, దీనివల్ల స్థానిక కార్మికులు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కార్యాలయ తరలింపు ప్రక్రియను నిలిపివేయాలని కోరడంతో పాటు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే ఔదార్యం... తాగునీటి కష్టాలకు చెక్

- తలుపుల, ఎన్.పి.కుంట మండలాలకు మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నీటి విడుదల




కదిరి, నవంబర్11 మనంన్యూస్:కదిరి నియోజకవర్గంలోని తలుపుల, ఎన్.పి.కుంట మండలాల రైతులు, ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక చొరవతో బుధవారం మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయడం జరిగింది.

ఎల్నినో ప్రభావంతో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడం జరిగింది. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలనే ప్రభుత్వ లక్ష్యంతో పాటు రైతుల ఇబ్బందులు, మామిడి రైతుల అవసరాలు, ప్రజల తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ చూపడంతో నీటి విడుదలకు చర్యలు చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా రైతులు ఎవరూ స్వయంగా కాలువలు తెంచడం, అనుమతులు లేకుండా చెరువులకు నీటిని మళ్లించడం వంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైన చెరువులకు అధికారుల సమన్వయంతో ప్రభుత్వమే నీటిని అందించే చర్యలు చేపడుతుందని తెలిపారు.

రైతులు, ప్రజల నీటి అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నిరంతరం కృషి చేస్తున్నారని, నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ అధికారులకు సహకరించాలని కోరారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం , నవంబర్ 11 (మనం న్యూస్): జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ఆసిఫ్ అలీ,రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ కార్యదర్శి యశ్వంత్, జిల్లా కాంగ్రెస్ కమిటీ,కార్పొరేషన్ కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించినారు ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఆజాద్ ప్రముఖస్వాతంత్ర్య సమరయోధులుగా, భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా, ఇస్లామిక్ వేదాంతవేత్తగా సుపరిచితులని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ 1912 లో అల్ - హిలాల్, అల్ బలాల్ అనే పత్రికలను స్థాపించి ప్రజల్లో స్వాతంత్ర్య భావాలను రగిల్చినారని తెలిపారు.

భారతదేశంలో భావి తరాలకు అత్యున్నత విద్య అందించటానికి బంగారు బాటలు వేశారని కొనియాడారు. వారి ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్, నాగటి చంద్రశేఖర్, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, వేల్పుల మురళి, కిలారు వెంకట రమణ, భూక్యా సురేష్ నాయక్, పుల్లారావు,.నాగరాజు, నగర కాంగ్రెస్ నాయకులు ఫజల్ ,ధోన్ వాన్ వెంకట్రావు నాయక్, పోతగాని రమణ, జాని వినయ్, పంది రాజు గౌడ్, దామా స్వరూప, రేఖా భార్గవి, అన్నపూర్ణ, రమాదేవి, చంద్రిక, నీలవేణి, దివ్య, రజనీ, స్రవంతి, జరీనా పద్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- రైతులు ఆరుతడి పంటల సాగుచేసేలా చైతన్యం తేవాలి
- త్రాగు నీటికి ఇబ్బందులు రావద్దు
- అధికారులతో సమీక్ష చేసిన అదనపు కలెక్టర్



ఖమ్మం, నవంబర్ - 11(మనం బ్యూరో): ఎల్నినో ప్రభావం దృష్ట్యా జిల్లాలో రానున్న కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్లో పంటల సాగు, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాలేరు రిజర్వాయర్ లో 3 నెలలకు, వైరా రిజర్వాయర్ లో 5 నెలలకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

నీటి లభ్యత తగ్గనున్న దృష్ట్యా, ఉన్న నీటిని తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరి, మొక్కజొన్న వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను వేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి కళాజాత బృందాల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, అలాగే వాయిస్ మెసేజ్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా వ్యాప్తంగా

ముందస్తు వ్యవసాయ కార్యాచరణ

2025-26 లోజిల్లాలో మొత్తం 2,00,529 ఎకరాల్లో వివిధ పంటలు సాగు

2026-27 రబీ సీజన్లో సుమారు 1,38,695 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగే అవకాశం: కలెక్టర్ అంకిత్

నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి.. - వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

రైతులకు అవగాహన, నాణ్యమైన విత్తనాల సరఫరా, భూగర్భ జలాల వినియోగం, తేమ సంరక్షణపై ప్రత్యేక దృష్టి



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 11 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, లోటు వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు ప్రణాళికతో పలు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. భూగర్భ జలాల లభ్యత, సాగునీటి వనరుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో రైతులు పంటల సాగులో తగిన మార్పులు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పంటల సాగు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు తగిన సూచనలు అందిస్తున్నారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి (ఐడి) పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా సాగునీటి లభ్యతపై అనిశ్చితి ఉన్న ప్రాంతాల్లో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా స్థానిక పరిస్థితులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు.

రబీ 2025-26 సీజన్లో జిల్లాలో మొత్తం 2,00,529 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, రబీ 2026-27 సీజన్లో సుమారు 1,38,695 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. గత సీజన్తో పోలిస్తే సాగు విస్తీర్ణం సుమారు 31 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. గతంలో 89,348 ఎకరాల్లో సాగైన వరి పంటను ఈ సీజన్లో 29,300 ఎకరాలకు పరిమితం చేయాలని అంచనా వేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు . అదే సమయంలో పప్పుధాన్యాల సాగును 1,053 ఎకరాల నుంచి 9,300 ఎకరాలకు, నూనెగింజల సాగును 1,951 ఎకరాల నుంచి 3,509 ఎకరాలకు పెంచేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని బోరుబావుల పరిస్థితిని మండలాల వారీగా సమీక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 60,957 బోరుబావులు ఉండగా, వీటిలో 49,978 బోరుబావులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, 10,979 బోరుబావుల్లో పాక్షికంగా నీటి లభ్యత ఉందని, పూర్తిగా ఎండిపోయిన లేదా పనిచేయని బోరుబావులు లేవని నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పంటల్లో నేల తేమ తగ్గకుండా మల్చింగ్ పద్ధతిని అవలంబించాలని, బిందు సేద్యం వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతులను వినియోగించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆయిల్పామ్, యూకలిప్టస్ తోటల వరుసల మధ్య వేరుశనగ, అరటి, మినుము వంటి అంతర పంటలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అయితే చెట్ల మధ్య దూరం, పంటకు అందే సూర్యరశ్మి, నేలలో తేమ, చెట్ల వయస్సు వంటి అంశాలను పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అంతర పంటల సాగుకు సలహాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. దీనివల్ల అందుబాటులో ఉన్న భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు . అశ్వారావుపేట మండలంలో యూకలిప్టస్ తోటల్లో మినుము అంతర పంటగా సాగు చేస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంట ఎదుగుదల దశ, నేలలో తేమ పరిస్థితులు, చెట్ల మధ్య అంతరం, పంటకు అందుతున్న వెలుతురు వంటి అంశాలను పరిశీలించి, అంతర పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు అందించాలని అధికారులకు తెలిపారు.

పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ఆత్మ 2026-27 పథకం కింద సబ్సిడీపై పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమం ద్వారా 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల ఎంపిక, నేలలో తేమ సంరక్షణ, సాగునీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులను భాగస్వాములను చేసి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా పంటల పరిస్థితి, పంటల ఎదుగుదల దశ, నేలలో తేమ శాతం, చీడపీడల ఉనికిని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని సూచించారు. వీలైన చోట జియో ట్యాగింగ్ ఫొటోల ద్వారా పంటల పరిస్థితిని నమోదు చేయాలని, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, నేల తేమలో మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు సకాలంలో తగిన వ్యవసాయ సలహాలు, సూచనలు అందించాలని స్పష్టం చేశారు.

ఎల్నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. విత్తనాల లభ్యత, సాగునీటి వినియోగం, పంటల పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు, తేమ సంరక్షణ, అంతర పంటల సాగు, సమర్థవంతమైన నీటి వినియోగంపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



వైరా, నవంబర్ 11(మనం న్యూస్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం వైరా మండలం ముసలిమడుగులో ఆయన ప్రారంభించారు.

ముసలిమడుగు గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మీట్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ పోటీల్లో వివిధ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.కార్యక్రమంలో ఆర్డీవో రాంబాబు, ఎంఈఓ చావా శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్ర గంగారావు, దాసరి దానియేలు, బొర్రా రాజశేఖర్, రాంపూడి రోశయ్య, కట్ల రంగారావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, వీరంశెట్టి సీతారాములు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పమ్మి అశోక్, దొడ్డ పుల్లయ్య, కోసూరి శ్రీనివాసరావు, గురుకుల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కోడిశలగూడెంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

దమ్మపేట, నవంబర్ 11(మనం న్యూస్): బుధవారం తెల్లవారుజామున, దమ్మపేట పి.ఎస్ పరిధిలోని అంకంపాలెం, గ్రామం పరిధిలో గల కోడిశలగూడెం, గ్రామంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్,ఆదేశాల మేరకు, పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సతీష్ కుమార్,యొక్క సూచనల మేరకు,అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో, అశ్వారావుపేట సిఐ నాగరాజు, పాల్గొని గ్రామస్తులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుర్వినియోగం, ముఖ్యంగా గంజాయి, సేవించడం అక్రమ రవాణా,రోడ్డు భద్రత, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో (4) ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించబడ్డాయి.మొత్తం 52 ఇళ్లు తనిఖీ చేయబడ్డాయి. 33 బైకులు, 04 ప్యాసింజర్ ఆటో 01 ట్రాక్టర్ వాహనం యొక్క పత్రాలు తనిఖీ చేయబడ్డాయి.కార్యక్రమంలో దమ్మపేట ఎస్ ఐ రాజేష్ కుమార్,అశ్వారావుపేట ఎస్ఐ ,సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ కళల వారసత్వాన్ని కొనసాగిద్దాం

పిల్లల సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రోత్సహించాలి

సెల్ ఫోన్ బానిసత్వానికి దూరంగా ఉండాలి

జిల్లా అడిషనల్ సిపి రామానుజం

హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాలు

పలు జిల్లాల నుంచి హాజరైన బాల కళాకారులు



ఖమ్మం, నవంబర్ 11(మనం న్యూస్): మనదేశ కళల వారసత్వాన్ని ప్రతి తరం వారు కొనసాగించాలని రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల ప్రారంభ సభలో జిల్లా అడిషనల్ పోలీస్ కమిషనర్ రామానుజం తెలియజేశారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ వేడుకల ప్రారంభోత్సవానికి అడిషనల్ సిపి రామానుజం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశానికి చెందిన కళారూపాలు ప్రపంచవ్యాప్తంగా అందరినీ ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. మన సాంప్రదాయ జానపద కళారూపాలకు రోజురోజుకూ సినిమాల్లోనూ అత్యధిక ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేలా తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించాలని కోరారు. పిల్లలు సెల్ఫోన్ బానిసత్వానికి గురికాకుండా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సృజనాత్మకతను పెంపొందించే కళలను నేర్చుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా , దృఢంగా రూపొందుతారని, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఖమ్మం బాలోత్సవ్ సంబురాల సభలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనడమే పిల్లలకు గొప్ప విజయం అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సంబురాలలో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ జంగాల సునీల్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, డాక్టర్ కాటమనేని రాజకుమార్, నృత్యదర్శకులు ఆర్ ఎన్ ప్రసాద్, న్యాయ నిర్ణేతలు లింగం శ్రీనివాసరావు, జైపాల్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ బాధ్యులు చిక్కుళ్ల వెంకటేష్, పగిల్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్ ,రాజేష్ ,భవాని శంకర్, ముకేష్, నాని,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నృత్యాలు.

వారధి ఫౌండేషన్ ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు హోరెత్తాయి. బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, పలు జిల్లాల నుంచి బాలలు 300 మందికి పైగా పోటీలలో పాల్గొన్నారు. తొలి రోజు సాంప్రదాయ విభాగాలలో జూనియర్, సీనియర్ విభాగాలలో బాల బాలికలు తమ సృజనాత్మకతకు దర్పణం పట్టారు. నెమళ్ళు నాట్యం ఆడినట్లుగా సాంప్రదాయ వస్త్రధారణలో సంగీతానికి అనుగుణంగా స్టెప్పు లేస్తూ బాలల ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఉర్రూతలుగించాయి. అతిపెద్ద డిజిటల్ స్క్రీన్ పై , డిజిటల్ లైట్ల వెలుగులతో బాల బాలికలు ప్రదర్శించిన నృత్యాలను తల్లిదండ్రులు తిలకించి మురిసిపోయారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలన్ని సభికులని కనువిందు చేశాయి. సోలో క్లాసికల్ , ఫోక్ డాన్స్ విభాగాలకు 200 ఎంట్రీస్, గ్రూప్ క్లాసికల్, ఫోక్ డాన్స్ కు గాను 40ఎంట్రీస్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగానికి 50ఎంట్రీల ద్వారా బాల బాలికలు తమ సృజనతో కనువిందు చేస్తున్నారు. ఖమ్మం బాలోత్సవ్ పోటీలు గురువారం సాయంత్రం వరకు జరుగుతాయని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో అతిధులు బహుమతి ప్రధానం చేస్తారని వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ నిర్వాకులు తెలియజేశారు. ఖమ్మంలో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ కు బాల బాలికల నుంచి అనూహ్య స్పందన రావడంతో నిర్వాహకుల్లో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తున్నాయి.

మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తాం

- తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు అర్జేసి కృష్ణ
- నూతన కమిటీ ఎన్నిక



ఖమ్మం, నవంబర్ 11(మనం న్యూస్): మున్నూరు కాపు సమాజ అభ్యున్నతికి, సంక్షేమానికి, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు అర్జేసి కృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని మున్నూరు కాపు బాలుర వసతి గృహంలో తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్జేసి కృష్ణ, జిల్లా కార్యదర్శిగా బచ్చు విజయ్ కుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఆర్జేసి కృష్ణ మాట్లాడుతూ తమపై నమ్మకంతో జిల్లా కమిటీ బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, యువతకు సరైన మార్గదర్శనం కల్పిస్తామని తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యతను బలోపేతం చేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లా కార్యదర్శి బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపు కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా ముందుకు నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులకు విద్యా పరంగా ప్రోత్సాహం అందించడం, యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, సంఘంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటూ నాయకులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మున్నూరు కాపు ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ లక్కినేని రఘు మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజం విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కమిటీ నాయకత్వంలో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తూ, యువతకు మరియు విద్యార్థులకు ప్రోత్సాహం అందించి, సమాజ అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లక్కినేని సుధీర్ మాట్లాడుతూ మున్నూరు కాపుల ఐక్యతే సమాజ అభివృద్ధికి ప్రధాన బలమని, ప్రతి ఒక్కరూ సంఘం కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. నూతన కమిటీకి తమ సంపూర్ణ సహకారం అందిస్తూ సమాజ సంక్షేమం కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, జేఏసీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులు మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని వెల్లడించారు.

నిబంధనలు పాటించని కళాశాల బస్సులపై కేసులు నమోదు - డీ.టీ.ఓ



అమలాపురం నవంబర్ 11 మనం ప్రతినిధి : నిబంధనలు పాటించని 4 శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల బస్సులపై కేసులు నమోదు చేసి 42,000/- అపరాధరుసుము విధించామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. డీ.టీ.ఓ మాట్లాడుతూ భారీ వాహనాలు నడిపే లైసెన్స్ ఐదేళ్ల అనుభవం ఉన్న చోదకులకు మాత్రమే బడి బస్సు డ్రైవర్ గా అర్హత ఉంటుందని అదేవిధంగా 60 ఏళ్ల నిండిన డ్రైవర్లు బడి బస్సు నడిపే అర్హత ఉండదని బడి / కళాశాలల యాజమాన్యం ఈ నిబంధనని ఖచ్చితంగా పాటించాలని డీ.టీ.ఓ పేర్కొన్నారు. అధిక వేగం మరియు సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసే బస్సు డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని డీ.టీ.ఓ హెచ్చరించారు.

పదవి విరమణ పొందిన హోంగార్డుకు సహచరుల ఆపన్నహస్తం

- ఒక రోజు జీతం అందజేసిన ఉమ్మడి జిల్లా హోంగార్డులను అభినందించిన ఎస్పీ

అనంతపురం, నవంబర్ 11 మనం బ్యూరో: అనంతపురం జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా సుమారు 34 సంవత్సరాల సేవలందించిన ఎస్. ఒబులేసు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తోటి హోంగార్డులు మానవీయతతో ముందుకొచ్చి ఆయనకు అండగా నిలిచారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని హోంగార్డులు తమ ఒక రోజు జీతాన్ని అందించి సమకూర్చిన మొత్తం రూ.4,95,580 విలువైన చెక్కును జిల్లా ఎస్పీ పి. జగదీష్ చేతుల మీదుగా పదవీ విరమణ పొందిన హోంగార్డు ఎస్. ఒబులేసుకు ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా తోటి హోంగార్డుకు అండగా నిలిచి మానవీయతను చాటిన ఉమ్మడి జిల్లా హోంగార్డులను జిల్లా ఎస్పీ అభినందించారు. సుమారు 34 ఏళ్లపాటు పోలీసు శాఖకు సేవలందించిన హోంగార్డు ఎస్. ఒబులేసు సేవలను ఎస్పీ అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమ లో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ పవన్ కుమార్ , ఆర్ ఎస్ ఐ జాఫర్ , తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం నూతన ఈఓగా కె. లక్ష్మీ శివజ్యోతి

దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కాకినాడ జిల్లా, అన్నవరం, నవంబర్ 11 (మనం) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నూతన కార్యనిర్వహణాధికారిగా (ఈఓ) కె. లక్ష్మీ శివజ్యోతిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బుధవారం (11-11-2026) జీఓ ఆర్టీ నంబర్ 2131ను విడుదల చేసింది. ప్రస్తుతం గుంటూరు మహిళా, శిశు సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్/డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్న కె. లక్ష్మీ శివజ్యోతిని ఆ శాఖ నుంచి రిలీవ్ చేస్తూ, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ పరిధిలోకి తీసుకుని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమించారు. దేవస్థానంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈఓ పోస్టులో ఆమెను నియమిస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో వెలువడిన ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి. సదరు అధికారిణి విధుల నుంచి రిలీవ్ అయిన తేదీ, నూతన బాధ్యతలు స్వీకరించిన తేదీ వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటైన అన్నవరం దేవస్థానంలో కార్తీక మాస వేడుకలు కొనసాగుతున్న నేపథ్యంలో నూతన ఈఓ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. దేవస్థానంలో భక్తులకు మెరుగైన దర్శన, వసతి, అన్నప్రసాదం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆలయ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో నూతన ఈఓ కీలక బాధ్యతలు చేపట్టనున్నారు.

శ్వాసకోశాన్ని కబళిస్తున్న అదృశ్య శత్రువు


సాధారణ అలర్జీ రూపంలో పొంచి ఉన్న ప్రాణాంతక గండం!

కలుషిత గాలి, పక్షుల విసర్జితాలతో ఊపిరితిత్తుల పనితీరుపై తీవ్ర ప్రభావం

హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్ వ్యాధి పట్ల అప్రమత్తత తక్షణ అవసరం

ఏసీ ఫిల్టర్లలో పేరుకుపోయే శిలీంధ్రాలతో శ్వాస నాళాలకు పెను ముప్పు


సాధారణ దగ్గు, జలుబుగా భావించి సొంత వైద్యం చేసుకుంటే ప్రాణాలకే ప్రమాదం



కాకినాడ నవంబర్ 11 మనం న్యూస్ ; మారుతున్న జీవనశైలి, పర్యావరణ కాలుష్యం, పరిసరాల్లోని సూక్ష్మక్రిముల కారణంగా మానవ శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర స్థాయిలో దాడి జరుగుతోంది. పైకి సాధారణ అలర్జీలా కనిపించే లక్షణాలు లోపల ఊపిరితిత్తులను పూర్తిగా నిర్వీర్యం చేసే 'హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్' (హెచ్పీ) అనే ప్రమాదకర వ్యాధికి దారితీస్తున్నాయి. ఈ నిశ్శబ్ద మహమ్మారిపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకొచ్చేందుకు కాకినాడలోని ఓ ప్రముఖ హోటల్లో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్, పల్మనాలజీ రెండో విభాగాధిపతి డాక్టర్ గోపీ కృష్ణ ఎడ్లపాటి పాల్గొని వ్యాధి పూర్వాపరాలు, ఆధునిక చికిత్సా విధానాలు, నివారణ మార్గాలను సవివరంగా వెల్లడించారు. శ్వాసకోశ వైద్య రంగంలో దశాబ్దాల తరబడి విశేష అనుభవం గడించి, జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపు పొందిన గోపీ కృష్ణ ఎడ్లపాటి.. తన సుదీర్ఘ వైద్య ప్రస్థానంలో ఎన్నో సంక్లిష్టమైన ఊపిరితిత్తుల రుగ్మతలకు విజయవంతంగా చికిత్స అందించి వేలాది మంది రోగులకు పునర్జన్మ ప్రసాదించారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ వేదికగా అంతర్జాతీయ స్థాయి ఊపిరితిత్తుల వైద్య ప్రక్రియలను అందించడంలో ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు.

మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ బయటి కణాలపై అతిగా స్పందించడం వల్లే ఈ హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్ వ్యాధి తలెత్తుతుందని గోపీ కృష్ణ ఎడ్లపాటి తెలిపారు. ఊపిరితిత్తుల చివరి భాగంలో ఉండే సూక్ష్మమైన వాయు గోణుల (అల్వియోలై) చుట్టూ ఉండే సున్నితమైన పొరలు వాపునకు గురై, క్రమంగా ఇంటర్స్టీషియల్ లంగ్ డిసీజ్గా రూపాంతరం చెందుతుందని విశ్లేషించారు. ముఖ్యంగా నివాస సముదాయాలు, ఆలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద సంచరించే పావురాల రెట్టలు, వాటి ఈకల నుంచి గాలిలో కలిసే సూక్ష్మ ధూళి కణాలు ఈ వ్యాధికి ప్రధాన కారకాలుగా మారుతున్నాయి. వీటితో పాటు ఇళ్లు, కార్యాలయాల్లో సకాలంలో శుభ్రం చేయని ఎయిర్ కండిషనర్లు, ఎయిర్ ప్యూరిఫైయర్ ఫిల్టర్లలో చేరే ఫంగస్, చక్కెర పరిశ్రమల్లో వెలువడే మొలాసిస్ ఘాటు వాయువులు శ్వాసకోశాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డి, రసాయన పురుగుమందుల మధ్య పనిచేసే రైతులు, కలప కోత కార్మికులు, భవన నిర్మాణ కూలీలు, డ్రిల్లింగ్, పెయింటింగ్ వృత్తుల్లో ఉన్నవారు . సాధారణ సీజనల్ జలుబు, దగ్గు, ఆస్తమా వంటి సమస్యలు ప్రాథమిక మందులతో తగ్గుముఖం పడతాయని, అయితే హెచ్పీ వ్యాధి సోకిన వారిలో మాత్రం ఎన్ని మందులు వాడినా దగ్గు, కఫం తగ్గకపోగా రోజురోజుకూ తీవ్రమవుతాయని పేర్కొన్నారు. కొద్దిపాటి దూరం నడిచినా, మెట్లు ఎక్కినా విపరీతమైన ఆయాసం రావడం దీని ప్రధాన లక్షణమని చెప్పారు. సరైన అవగాహన లేక చాలామంది దీనిని సాధారణ అలర్జీగా భావించి సొంత వైద్యం చేసుకుంటూ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని, ఫలితంగా ఊపిరితిత్తులు పూర్తిగా చెడిపోయిన తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు, రహదారి నిర్మాణ కూలీల్లో ఊపిరితిత్తుల దిగువ భాగం దెబ్బతింటే, హెచ్పీ బాధితుల్లో మాత్రం ఊపిరితిత్తుల పైభాగం ఎక్కువగా క్షీణిస్తుందని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన సత్తా చాటుతుంది



- **48 వార్డుల్లోనూ పోటీకి సిద్ధమని జనసేన నేతల ప్రకటన**

తాడేపల్లిగూడెం నవంబర్ 11 తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని జనసేన పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి వెంకటేశ్వరరావు అన్నారు.

కూటమి ధర్మం ప్రకారం కలిసి వెళ్లడమే సరైనదని, ప్రజల అభివృద్ధే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.జనసేన పార్టీ తాడేపల్లిగూడెం అధికార ప్రతినిధి సజ్జ సుబ్రమణ్యం మాట్లాడుతూ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల్లో 48 వార్డుల్లోనూ పోటీ చేస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే నాయకత్వంలో, కూటమి బలోపేతం కోసం పని చేస్తామని ఆయన అన్నారు.నీలపాల దినేష్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నాయకులు ముళ్ళపూడి బాపిరాజు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన హెచ్చరించారు. పైబోయిన రఘు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆదేశాల మేరకు పనిచేస్తామని ప్రకటించారు.జనసేన నేతల ఈ ప్రకటనలతో తాడేపల్లిగూడెంలో మున్సిపాలిటీ ఎన్నికల వేడి ఒక్కసారిగా పెరిగింది.

ఘనంగా వేద పండితుల చే చండీహోమం




పాలకొల్లు, నవంబర్ 11,మనం ప్రతినిధి: పాలకొల్లు పట్టణంలోని లాకు దిగువ కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో శ్రీ నీలకంటేశ్వర స్వామి శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ప్రాంగణంలో బుధవారం వేద పండితుల చే చండీహోమం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగినది. ఆలయ చైర్మన్ వట్టం గణేశ్వరరావు మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ చండీ హోమం చేయడం జరిగిందని ఈ కార్తీకమాస నాలుగు సోమవారములు ఉదయం భక్తులకు వారి వారి గోత్రనామాలతో స్వామివారికి అభిషేకములు మరియు సాయంత్రం 7 గంటలకు పంచహారతులు జరుగునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లు బాసిన గుణేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, కార్యదర్శి మానెం బసవరాజు, ట్రెజరర్ ఆనెం భాస్కరరావు, యర్రా శివాజీ, బొండపల్లి చంద్రశేఖర్, బాసిన మోహన్, మానెం రాము, జగరోతు రాంబాబు, మానెం ధనుంజయ శ్రీనివాసరావు, మానెం గణేష్ మాస్టర్, కుడకా సోమేశ్వరరావు, వట్టం కిరణ్, బాసిన భార్గవి, మానెం గంగాభవాని, వట్టం అమ్ము, కూర్మా ప్రసన్న తదితరులు ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 2.76 కోట్లు



మంత్రాలయం,నవంబర్ 11, (మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం అక్టోబర్ , నవంబర్ నెలలోని 19 రోజుల హుండీ ఆదాయం రూ. 2,76,62,955 లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 49 గ్రాముల బంగారం, 680 గ్రాముల వెండి ని భక్తులు కానుకులుగా హుండీ లో సమర్పించుకున్నారని మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు వివరించారు.

మున్సిపాలిటీ చైర్మన్ రేసులో సజ్జ సుబ్బు



తాడేపల్లిగూడెం, నవంబర్ 11 మనం న్యూస్ తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎన్నికల్లో చైర్మన్ పదవికి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తాడేపల్లిగూడెం జనసేన పార్టీ అధికార ప్రతినిధి సజ్జ సుబ్బు ప్రకటించారు.గురువారం మాట్లాడుతూ ఆయన ఈ ప్రకటన చేశారు. జనసేన పార్టీ ప్రారంభం నుండి పార్టీలో కొనసాగుతున్నానని ఆయన తెలిపారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా నిస్వార్థంగా పని చేశానని, కార్యకర్తల అండదండలతో ముందుకు వెళ్తున్నానని అన్నారు.ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అవకాశం ఇస్తే చైర్మన్ పదవికి పోటీ చేస్తానని సజ్జ సుబ్బు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నాయకత్వంలో పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా తాడేపల్లిగూడెం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రజల చెంతకు వెళ్తేనే సమస్యపై పూర్తి అవగాహన



- **నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా ముందుగా ప్రజల చెంతకు వెళ్లి సమస్యలను పరిశీలిస్తేనే వాటిపై పూర్తి అవగాహన వస్తుందని, అర్జీదారులతో నేరుగా మాట్లాడటం వల్ల వారికి సంతృప్తి కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం ఇన్కమ్ ట్యాక్స్, ఎస్బీఐ బ్యాంకు కూడళ్లు, ఏ.క్యాంప్ భరత్ కాలనీ, చల్లావారి వీధి, వీనస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల పనులను చేపడుతున్నామని, ఆర్థిక భారం లేని పనులను తక్షణమే చేపడతామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల మరమ్మతు పనులను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా అధ్వానంగా ఉన్న రహదారులపై ప్రస్తుతానికి డబ్ల్యూబీఎం రహదారులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

నగరాభివృద్ధికి అధికారులు చేస్తున్న కృషిని ప్రజలు అర్థం చేసుకుని తమ వంతు సహకారం అందించాలని కమిషనర్ కోరారు.అనంతరం పరిమళ నగర్లోని అన్న క్యాంటీన్ను, వెంకటరమణ కాలనీలోని జీటీఎస్ స్టేషన్ను పరిశీలించారు.కార్యక్రమంలో డీసీపీ శబ్నం శాస్త్రీ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, టీఏఈ రామోహన్, వెహికల్ ఇన్చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా పలు సేవా కార్యక్రమాలు



పాలకొల్లు, నవంబర్ 11 మనం ప్రతినిధి: స్థానిక ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్సీ () విజిట్ ఘనంగా జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ యిమ్మిడి లలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్) డాక్టర్ జయభారత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 100 మందికి ఐ స్క్రీనింగ్ (కంటి పరీక్షలు) చేయగా, వారిలో అవసరమైన 24 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అలాగే మరో ఎనిమిది మందికి ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్ల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. వీటితో పాటు తుఫాను బాధితులకు, క్యాన్సర్ రోగులకు రూ.1,500 విలువైన నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ కు స్టీల్ వాటర్ ఫిల్టర్ ను ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ కు అందజేశారు, అన్నదానానికి 25 కేజీల బియ్యం బస్తాను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వ్యాఖ్యలపై జనసైనికుల ఆగ్రహం



- **ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్పై ఏకవచన వ్యాఖ్యలపై మండిపాటు**

తాడేపల్లిగూడెం, నవంబర్ 11 మనం న్యూస్: టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పై జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాపిరాజు తదితరులు చేసిన ఏకవచన వ్యాఖ్యలపై జనసైనికులు మండిపడ్డారు.బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన సమావేశంలో పైబోయిన రఘు, పుల్ల బాబి, అడపా ప్రసాద్ స్పందించారు.ఈ నియోజకవర్గంలో మీకేం పని అని వారు ప్రశ్నించారు. కూటమి నాయకుల మధ్య విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, కూటమి ధర్మాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదని వారు హెచ్చరించారు. రవికుమార్ ఓటమి ఆయన స్వయంకృత అపరాధమని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో కూటమి నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. మున్సిపాలిటీ ఎన్నికల వేళ ఈ వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం రేపాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మహానంది, నవంబర్11,మనంన్యూస్: మహానంది మండల పరిధిలోని నందిపల్లె గ్రామ పంట పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ ఐ శివాంజల్ బుధవారం తెలిపారు.పంటపొలాలలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించినట్లు ఎస్ ఐ తెలిపారు.మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయినట్లు తెలిపారు. మృతదేహం వద్ద బట్టలు ఉన్నట్లు తెలిసింది.సంఘటనా స్థలాన్ని నంద్యాల రూరల్ సి ఐ శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ ఐ తెలిపారు.కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనోధైర్యంతోనే ప్రమాదాలనుండి రక్షణ



మహానంది, నవంబర్11,మనంన్యూస్: ప్రమాదాలు సంభవించినప్పుడు ఎవరైనా సరే మనోధైర్యమే ముఖ్యమని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర ప్రసాద్ తెలిపారు. బుధవారం మహానంది పుణ్యక్షేత్రం లో ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ లు సంయుక్తంగా భక్తులకు పలు సంఘటనల సమయంలో వ్యవహరించాలసిన వాటిపై అవగాహన కల్పించారు. ఆలయాలలో రద్దీ వున్నప్పుడు తోపులాటలు, అగ్నిప్రమాదం వంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేవాటిని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రఘునాద్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఏ ఈఓ మధు, ఏ ఆర్ సి ఐ బాబు, ఎస్ ఐ లు శివాంజల్ శ్రీ చరణ్, సూపర్డెంట్ సుబ్బారెడ్డి, డాక్టర్ భగవాన్ దాస్, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- **హౌసింగ్ ఈ ఈ శివయ్య**

గూడూరు, అక్టోబర్ 11 (మనం న్యూస్): గూడూరు మండలంలోని పట్టణంలోని గృహ విమానాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ శివయ్య సంబంధిత హోసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గూడూరు మండలంలో పర్యటించి పట్టణంలో కూడా పర్యటించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ ఈ తో పాటు డి ఈ వాసుదేవరావు ఏఈ రామయ్య వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తో పాటు పలువురు లబ్ధిదారులు అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఈ ఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను అనుకున్న సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఆయన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఆయన సూచించారు.



విద్యావ్యాప్తికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు మౌలానా ఆజాద్!

- **ఆజాద్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం కావాలి – కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, నవంబర్ 11 మనం న్యూస్: స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, స్వతంత్ర భారతదేశంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు, భారతరత్న పురస్కార గ్రహీత, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఘనంగా నిర్వహించారు. విద్యను సమాజ మార్పునకు శక్తివంతమైన సాధనంగా భావించి, భావితరాల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసిన ఆయన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. బుధవారం పుట్టపర్తిలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అందించిన సేవలను, స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణంలో పోషించిన పాత్రను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, దేశ విద్యారంగానికి శాశ్వత దిశానిర్దేశం చేసిన గొప్ప విద్యావేత్త, దార్శనికుడని పేర్కొన్నారు. దేశంలో ఆధునిక విద్యావ్యవస్థ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఉన్నత విద్యకు ప్రాధాన్యత కల్పించడం, ఐఐటీలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి కృషి చేయడం, విశ్వవిద్యాలయాల ప్రమాణాలను పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పాటుకు పునాదులు వేయడం వంటి కీలక నిర్ణయాలు దేశ విద్యారంగ పురోగతిలో మైలురాళ్లుగా నిలిచాయని వివరించారు. కులమతాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించిన గొప్ప జాతీయవాది ఆజాద్ అని కలెక్టర్ అన్నారు. విద్య ద్వారానే వ్యక్తి వికాసం, సామాజిక చైతన్యం, దేశాభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన బలంగా విశ్వసించారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలన్న ఆయన ఆశయాన్ని నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత ఆయన జీవిత చరిత్ర, సేవలు, సిద్ధాంతాలను తెలుసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి ఆలోచన తరతరాలకు వెలుగునివ్వగలదనే దానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నిదర్శనమని, ఆయన చూపిన విద్యా మార్గం భారతదేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే ఏడీ విజయశాంతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు



ఫేస్‌బుక్‌లో బోయింగ్‌ను కొని.. ఇంటి వెనక తోటలో పాతిపెట్టి..!



లండన్, నవంబర్ 11 : ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో పాత బోయింగ్ 737 విమానం బాడీని కొనుగోలు చేసి.. ఇంటి వెనక తోటలో పాతిపెట్టాడు. ఈ వింత ఘటన యూకేలో వెలుగులోకి వచ్చింది. డెర్బీషైర్‌కు చెందిన ఇంజినీర్ డేవ్ బిల్లింగ్స్ కొన్ని నెలల క్రితం ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన బోయింగ్ 737 విమానాన్ని చూశాడు. దాదాపు రూ.5 లక్షలకు దానిని కొనుగోలు చేశాడు. అనంతరం విమానంలోని క్యాబిన్ భాగాన్ని ఇంటి వెనక తోటలో 14 అడుగుల లోతు గొయ్యి తవ్వి అందులో పాతిపెట్టాడు. పై నుంచి కాంక్రీట్‌తో పూర్తిగా మూసివేశాడు. లోపల విద్యుత్, నీటి సౌకర్యం ఏర్పాటు చేశాడు. విమానంలోని టాయిలెట్‌ను తమ నివాసంలోని సెప్టిక్ ట్యాంక్‌కు అనుసంధానించాడు. ఈ విధంగా ఓ ఇంటికి కావాల్సిన అన్ని సౌకర్యాలతో పాటు లోపలికి వెళ్లడానికి ఓ రహస్య మార్గాన్నీ ఏర్పాటు చేసుకున్నాడు. అండర్ గ్రౌండ్‌లో పార్టీలు, కుటుంబంతో కలిసి సమయం గడపడం కోసం ఈ వినూత్న ఆలోచన చేసినట్లు డేవ్ బిల్లింగ్స్ వెల్లడించాడు. అంతే కాకుండా ఒకవేళ శత్రు దేశాలు తమపై దాడి చేసినా, మూడో ప్రపంచ యుద్ధం వచ్చినా దీనిని బంకర్‌గా వాడుకోవచ్చని తెలిపాడు.

ఎన్‌విడియాపై జెన్సన్ బలమైన పట్టు..

సీఈవో రేసులో భారతీయుడి పేరు..!



వాషింగ్టన్, నవంబర్ 11 : మహిళా గూఢచారితో అక్రమ సంబంధం వ్యవహారంలో ఎన్‌విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ చిక్కుకోవడంతో.. కంపెనీ షేర్లు భారీగా పతనం అవుతున్నాయి.

ఈ క్రమంలో పలు దర్యాప్తులు కూడా ఆయన్ను, కంపెనీనీ చుట్టుముడుతున్నాయి. ఈ క్రమంలో నాయకత్వ మార్పు దిశగా ఇన్వెస్టర్లు యత్నించే అవకాశాలు కూడా చర్చల్లోకి వస్తున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో హువాంగ్ పదవి నుంచి వైదొలిగితే తర్వాత ఎవరనే చర్చ మొదలైంది. మరోవైపు ఈ వివాదం ఎన్‌విడియాపై జెన్సన్ కుటుంబం పట్టును సడలించగలదా అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ఎన్‌విడియా నాయకత్వ రేసులో పలు పేర్లు తెరపైకి రాగా వాటిలో ఓ భారతీయుడు కూడా ఉన్నారు. కంపెనీ సేల్స్ విభాగం మాజీ చీఫ్ జై పురీ, సీఎఫ్‌వో కొలెట్ క్రెస్ సహా పలువురు రేసులో ఉన్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ కథనంలో పేర్కొంది.

మాజీ సేల్స్ చీఫ్ జై పురీ

జై పురీ 2009లో ఎన్‌విడియా వరల్డ్ వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. కంపెనీ గ్లోబల్ సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్, కస్టమర్ రిలేషన్‌షిప్ వంటి అంశాల్లో ఆయనకు బలమైన పట్టుంది. 2026 ఆగస్టులో ఆయన పదవీవిరమణ చేశారు. కానీ, తన అధికారాల బదిలీ వేళ సీనియర్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తారని కంపెనీ ఫైలింగ్‌లో వెల్లడించింది.

ఇన్వెస్టర్స్‌తో కోలెట్‌రెస్‌కు బలమైన సంబంధాలు

ఈమె 2013లో ఎన్‌విడియాలో చేరారు. కంపెనీ కృత్రిమ మేధ వ్యాపార విస్తరణను పర్యవేక్షించారు. ఆమె ఈ కంపెనీలో చేరకముందు సిస్కో, మైక్రోసాఫ్ట్, టెక్సస్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పనిచేశారు. ఆమె సుదీర్ఘ అనుభవం, ఇన్వెస్టర్లతో ఉన్న బలమైన సంబంధాల కారణంగా తాత్కాలికంగా అయినా జెన్సన్ బాధ్యతలు ఆమె చేపట్టవచ్చు.

మరోవైపు జెన్సన్‌తో సంబంధం పెట్టుకొన్న గూఢచారి అలిస్ ఫ్యామిలీపై 'ది ఇన్ఫర్మేషన్' పత్రికలో ఆసక్తికర కథనం వెలువడింది. అలిస్, ఆమె భర్త, ఆమె సోదరి అందరూ చైనా ఇంటెలిజెన్స్ కోసం పనిచేస్తున్నట్లు పేర్కొంది. వారు ఇందుకోసం సింగపూర్, చైనాలో ఓ కంపెనీల నెట్‌వర్క్‌ను నిర్మించినట్లు వెల్లడించింది. మెగాస్పీడ్, షాంఘై సెంచరీ లిటాంగ్ వంటి కంపెనీలను దీనిలో భాగం చేసింది. మొత్తం 2,40,000 చిప్లను చైనాకు తరలించినట్లు ఆరోపణలున్నాయి. వీటిల్లో అత్యంత శక్తిమంతమైన హెచ్100, హెచ్200 వంటి చిప్లు కూడా ఉన్నాయి. జెన్సన్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని వాడుకొని ప్రిఫర్డ్ క్లౌడ్ పార్ట్నర్ హోదాను దక్కించుకొని.. ఆంక్షల పరిధిలోని చిప్లను కూడా తేలిగ్గా కొనుగోలు చేసినట్లు సమాచారం.

ప్రపంచ వ్యాప్తంగా ఎన్విడియాగ్రాఫిక్ ప్రాసెసర్‌ను జనరల్ కంప్యూటింగ్‌కు వాడుకునేలా 'కూడ' సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసిన ఇయాన్ బక్ పేరు కూడా రేసులో వినిపిస్తోంది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కస్టమర్లకు అందించే ప్రొడక్ట్స్‌ను ఆయన పర్యవేక్షిస్తారు. సాంకేతిక నేపథ్యమే ఇయాన్‌కు అదనపు బలం. ఇక ఎన్‌విడియాలో చీఫ్ సైంటిస్ట్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న బిల్ డాలీ పేరు కూడా వినిపిస్తోంది. దీంతోపాటు కంపెనీ సహ వ్యవస్థాపకుడు క్రిస్ మాల్స్‌వీస్కీకి కూడా పగ్గాలు అప్పజెప్పే అవకాశం ఉంది.

అసలు జెన్సన్ పట్టును కదిలించగలరా..?

1993లో జెన్సన్ హువాంగ్ సహ వ్యవస్థాపకుడిగా ఏర్పాటు చేసిన ఎన్‌విడియా ప్రస్తుతం మార్కెట్లో కృత్రిమ మేధ ప్రాజెక్టులకు వాడే 90% చిప్స్‌ను సరఫరా చేస్తోంది. ఈ ప్రాజెక్టులే అమెరికా ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. టెస్లాపై మస్కుకు, యాపిల్‌పై స్టీవ్ జాబ్స్‌కు ఎంత పట్టుందో.. ఎన్‌విడియాపై జెన్సన్‌కు అంతే పట్టుంది. ప్రస్తుతం ఆయనకు కంపెనీలో 3.56 శాతం వాటా మాత్రమే ఉంది. కాకపోతే కంపెనీలో అత్యంత కీలకమైన 60 మంది ఎగ్జిక్యూటివ్ల బృందం నేరుగా ఆయనకే రిపోర్టు చేస్తోంది. దీంతో కంపెనీకి మూలస్తంభంగా ఆయనే ఉన్నారు. ఇక జెన్సన్ పిల్లలు ఇద్దరు ఎన్‌విడియాలోనే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుమారుడు స్పెన్సర్ హువాంగ్ ప్రొడక్ట్ మేనేజర్‌గా, కుమార్తె మాడిసన్ ప్రొడక్ట్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇక అల్లుడు నికో కాప్రెజ్ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్నారు.

బరువు తగ్గించే మందులతో దృష్టి కోల్పోయే ప్రమాదం!

జీఎల్పీ-1 ఔషధాలపై యూఎస్ఎఫ్‌డీయే హెచ్చరిక



వాషింగ్టన్, నవంబర్ 11: బరువు తగ్గించే మందులు వాడటం వల్ల అరుదైన సందర్భాల్లో శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుందనే కొత్త హెచ్చరికను కొన్ని ఉత్పత్తులపై ముద్రించేలా అమెరికా 'ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ' (యూఎస్ఎఫ్‌డీయే) చర్యలు తీసుకుంది. బరువు తగ్గించేందుకు వాడే ఒజెంపిక్, వెగోవీ వంటి ఔషధాలపై దీనిని ముద్రించాల్సిందేనని అమెరికా ఆరోగ్య నియంత్రణాధికారులు ప్రకటించారు. ముప్పు గురించి అన్ని జీఎల్పీ-1 మందుల లేబుళ్లపైనా చేరుస్తామని ఎఫ్‌డీయే తెలిపింది. స్థూలకాయం, మధుమేహం, మరికొన్నింటిని నియంత్రించడానికి వాడే 12 రకాల ఇంజెక్షన్లు, మాత్రలు ఈ వర్గంలోకి వస్తాయి. కంటి నరానికి రక్త ప్రసరణ తగ్గిపోవడం వల్ల జీఎల్పీ-1 మందుల వల్ల, దృష్టి దెబ్బతినే ప్రమాదం ఉన్నట్లు బయటపడిందని ఎఫ్‌డీయే తెలిపింది. దృష్టి మసక బారడం, రంగుల్ని గుర్తించలేకపోవడం వంటి లక్షణాల ద్వారా సమస్య తెలుస్తుందని వెల్లడించింది.

నాలాంటి వాళ్లు ఎక్కువ పన్నులు కట్టాలి

● యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సీఈఓ



వాషింగ్టన్, నవంబర్ 11 : కుబేరులపై భారీగా పన్నుల అంశం గురించి కొంతకాలంగా చర్చ జరుగుతోంది. అమెరికాలో పెరుగుతున్న ఆదాయ అసమానతల నేపథ్యంలో సంపన్నుల నుంచి అధిక స్థాయిలో పన్నులు వసూలు చేయాలని ఇప్పటికే డిమాండ్లు వినిపించాయి. తాజాగా యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సీఈఓ స్కాట్ కిర్బీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. తనలాంటి వారిపై ఎక్కువ మొత్తంలో పన్నులు వసూలు చేయాలన్నారు. ఇందుకోసం జాతీయ సంపద పన్ను చట్టం తీసుకురావాలన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

''ప్రస్తుత వ్యవస్థలో వేతన జీవులు, పెట్టుబడిదారుల మధ్య భారీ స్థాయిలో ఆదాయ అసమానతలు ఉన్నాయి. ఇవి సమాజానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తాయి. దీనిపై విధానపరమైన జోక్యం అవసరం. వేతనంపై ఆధారపడి జీవించే వారిపై పన్ను భారాన్ని తగ్గించాలంటే.. ప్రభుత్వాలు సంపన్నుల నుంచి పన్ను వసూళ్లను పెంచాలి. అందుకే జాతీయ స్థాయిలో సంపద పన్నును అమలు చేయాలి. ఇక, వారసత్వ ఆస్తులపై కూడా అవసరమైతే 100శాతం వరకు పన్నులు వేయాలి. నేను కూడా చెల్లిస్తా. మరో విషయమేంటంటే.. ఒక రాష్ట్రం తర్వాత మరో రాష్ట్రంలో అన్నట్లుగా ఈ పన్నుల అమలు ఉండకూడదు. అలా జరిగితే.. పన్నులు ఎక్కడ తక్కువ ఉన్నాయో చూసుకుని సంపన్నులు ఆ రాష్ట్రానికి మకాం మార్చే అవకాశం ఉంది'' అని స్కాట్ కిర్బీ వ్యాఖ్యానించారు.

కాగా.. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సీఈఓగా స్కాట్ కిర్బీ 2025 సంవత్సరానికి గానూ 32.28 మిలియన్ డాలర్ల వేతనం (భారత కరెన్సీలో దాదాపు రూ.300 కోట్లకు పైమాటే) అందుకున్నారు. ఇదే సమయంలో ఈ కంపెనీలోని మధ్య స్థాయి ఉద్యోగి వార్షిక వేతనం రూ.96,670 డాలర్లుగా ఉండటం గమనార్హం. ఇక, ఫార్చూన్ గణాంకాల ప్రకారం.. అమెరికా మొత్తం నికర సంపదలో 32.5శాతం వాటా.. ఒక శాతం సంపన్న కుటుంబాల వద్దే ఉంది.

కుమార్తె ఎదురుగానే అలిస్‌తో సన్నిహితంగా జెన్సన్

వైరల్ అవుతున్న వీడియో



వాషింగ్టన్, నవంబర్ 11 : ఎన్‌విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌తో చైనా మహిళ అలిస్ సన్నిహితంగా ఉన్న విషయం ఆయన కుటుంబసభ్యులకు ముందే తెలుసా..? ఇందుకు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ వీడియో చర్చనీయాంశంగా మారింది. కొన్నాళ్ల క్రితం తైవాన్‌లోని ఓ రెస్టరంట్లో జరిగిన కార్యక్రమంలో జెన్సన్-అలిస్ సన్నిహితంగా ఉన్న వీడియో ఒకటి తైవాన్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోలో జెన్సన్ కుమార్తె మాడిసన్ హువాంగ్ కూడా ఉన్నారు.

ఆ కార్యక్రమంలో అలిస్ నడుముపై చేయి వేసి జెన్సన్ సన్నిహితంగా మెలిగారు. ఒక దశలో సుతారంగా ఆమెను ముద్దు పెట్టుకోవడంలాంటి సన్నివేశాలను మాడిసన్ స్వయంగా ఫొటో తీశారు. ఈ కార్యక్రమంలో మాడిసన్ భర్త కూడా ఉన్నారు. ఈ పార్టీలో మాడిసన్, అలిస్ కూడా కలిసి మాట్లాడుకుంటూ గడిపారు. ఈ వీడియోతో.. ఎన్‌విడియా సీఈవో వ్యవహారం ఇంట్లో కూడా తెలుసా అనే చర్చ మొదలైంది.

ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించారు. నాడు టెక్ కంపెనీల సీఈవోలు కూడా ఆయన వెంట బీజింగ్‌కు వెళ్లారు. ఈ ప్రయాణానికి బయల్దేరిన వేళ.. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధ్యక్షుడు ట్రంప్‌తో ఎన్‌విడియా సీఈఓపై అందిన రహస్య ఇంటెలిజెన్స్‌ను పంచుకున్నారు. అలిస్‌తో ఆయన రిలేషన్‌షిప్‌ను కూడా వెల్లడించారు. కానీ, ట్రంప్ మాత్రం ఈ వ్యవహారం తనకు చాలా కాలం క్రితమే తెలుసన్న విషయాన్ని తోసిపుచ్చారు.

ఎయిరిండియా విమానం నుంచి హైజాక్ అలర్ట్

కోల్‌కతా, నవంబర్ 11 : ఎయిరిండియాకు చెందిన ఓ విమానం నుంచి హైజాక్ అలర్ట్ రావడం తీవ్ర కలకలం రేపింది. కోల్‌కతా ఎయిర్‌పోర్టు నుంచి ముంబయి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఈ విమానంలో బెదిరింపు నోట్ కన్పించింది. విమాన వాష్‌రూమ్‌లో హైజాక్‌ను సూచిస్తూ ఉన్న సందేశాన్ని గుర్తించిన పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు అలర్ట్ ఇచ్చారు. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి.. విమానాన్ని ఐసోలేషన్ ప్రాంతానికి తరలించారు. ప్రయాణికులను దించేసి ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు కోల్‌కతా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విక్రమ్ సింఘ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ విమానం ఉదయం 10.20 గంటలకు ముంబయికి టేకాఫ్ అవ్వాల్సి ఉంది. అయితే, ఆ బెదిరింపు నోట్లో ఉదయం 11.10 గంటలకు విమానాన్ని హైజాక్ చేస్తామని రాసి ఉన్నట్లు విక్రమ్ సింగ్ వెల్లడించారు. విమానంలో 105 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఘటనపై పోలీసులు, సెక్యూరిటీ ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి. దీనిపై ఎయిరిండియా ఇంకా స్పందించలేదు.



యూఎఈ అంతర్జాతీయ క్రికెట్ మాజీ భారత వికెట్ కీపర్ కె.ఎస్. భరత్ దృష్టి



హైదరాబాద్, నవంబర్ 11(మనంన్యూస్): భారత మాజీ టెస్ట్ వికెట్ కీపర్, బ్యాటర్ కె.ఎస్. భరత్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఈ) జాతీయ క్రికెట్ జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్లో ఆడాలనే తన ఆకాంక్షను వెల్లడించారు. 33 ఏళ్ల భరత్, భారత క్రికెట్కు వీడ్కోలు పలికిన అనంతరం తన కెరీర్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తూ అబుదాబి టీ10 టోర్నమెంట్లో ఎమిరేట్స్ ఈగల్స్ తరఫున ఆడుతున్నారు. 2027 ఫిబ్రవరిలో మూడేళ్ల కూలింగ్-ఆఫ్ వ్యవధి పూర్తయిన తర్వాత యూఎఈతరఫున ఆడేందుకు అర్హత సాధించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ వ్యవస్థ నుంచి వైదొలిగిన తర్వాత భరత్ అమెరికా, వెస్టిండీస్ సహా పలు దేశాల్లో క్రికెట్ ఆడే అవకాశాలను పరిశీలిస్తున్నారు. అదే సమయంలో దుబాయ్లో తన శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంకా తన ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉందని భావిస్తున్న ఆయన, తన కెరీర్ తదుపరి దశకు యూఎఈఒక ఆసక్తికరమైన వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో యూఎఈజెర్సీ ధరించి ఆడే అవకాశం ఉందా అని ప్రశ్నించగా, భరత్ తన ఉద్దేశాన్ని స్పష్టంగా వెల్లడించారు. నిజాయితీగా చెప్పాలంటే, అదే నా ప్రణాళిక. అయితే దీనికి ఇంకా కొంత సమయం ఉంది. నేను మూడేళ్ల కూలింగ్-ఆఫ్ వ్యవధిని పూర్తి చేయాలి. అది పూర్తయిన తర్వాత ఈ విషయంపై స్పష్టంగా చెప్పగలను. ప్రస్తుతం ఫిబ్రవరిలో నా మూడేళ్ల కూలింగ్-ఆఫ్ కాలం ముగియనుంది అని అబుదాబి టీ10 సందర్భంగా ఆయన తెలిపారు. భారత జట్టు తరఫున టెస్ట్ క్రికెట్ ఆడిన భరత్, భారత క్రికెట్ వ్యవస్థ నుంచి బయటకు రావడం అంత సులభమైన నిర్ణయం కాదని, అయితే అత్యున్నత స్థాయిలో క్రికెట్ కొనసాగించాలనే ఆకాంక్షతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

బంగారం ధర పలికిన పట్టుగూళ్లు.. కిలో రూ.911...!

ధర్మవరం నవంబర్ 11 మనం న్యూస్: ధర్మవరం పట్టువిక్రయ కేంద్రంలో బుధవారం పట్టుగూళ్ల ధరలు బంగారం ధరను తలపించాయి. పట్టు రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. పట్టు సహాయక సంచాలకురాలు రాజేశ్వరి తెలిపిన వివరాల మేరకు కుందుర్పి మండలానికి చెందిన రైతు నాగేంద్ర తీసుకొచ్చిన పట్టుగూళ్లకు కిలో రూ.911 గరిష్ఠ ధర లభించింది. అదేవిధంగా కుందుర్పి మండలం అప్పినేపల్లి గ్రామానికి చెందిన రైతు బసవరాజు పట్టుగూళ్లకు కిలో రూ.901, ధర్మవరం మండలం మోటకొండ గ్రామానికి చెందిన రైతు ఆదినారాయణ పట్టుగూళ్లకు



కిలో రూ.862 ధర పలికినట్లు ఆమె తెలిపారు.పట్టుగూళ్లకు ఆశాజనకమైన ధరలు లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా మార్కెట్లో మంచి ధరలు కొనసాగితే తమకు ఆర్థికంగా మరింత మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పెళ్లి చేసుకోవాలని టార్చర్

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించినందుకు ఫోన్లలో అసభ్య పదజాలంతో దూషణలు

విడాకులు ఇంకా రాలేదని పెళ్లి సంబంధాన్ని నిరాకరించిన బాధితురాలి కుటుంబం

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

నిందితుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన అధికారులు



హైదరాబాద్,నవంబర్ 11(మనం ప్రతినిధి) : హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందన్న అక్కసుతో నిందితుడు ఆమెకు పదేపదే ఫోన్లు చేస్తూ తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం.. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన 28 ఏళ్ల మహిళకు గతంలోనే వివాహం జరిగింది. అయితే వ్యక్తిగత కారణాల వల్ల ఆమె ప్రస్తుతం భర్తకు దూరంగా ఉంటోంది. దాదాపు ఏడాది క్రితం పీర్జాదిగూడలో ఓ జాతీయ బ్యాంకు సమీపంలో ఆమెకు శ్రీనివాస్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో వారిద్దరూ ఫోన్లలో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో ఇటీవల శ్రీనివాస్ ఆమె ఇంటికి వెళ్లి, తనను పెళ్లి చేసుకోవాలని కోరాడు. అయితే మొదటి భర్త నుంచి తనకు ఇంకా అధికారికంగా విడాకులు రాలేదని, కాబట్టి ప్రస్తుతం మరో వివాహం చేసుకోవడం సాధ్యం కాదని బాధితురాలితో పాటు ఆమె తల్లిదండ్రులు స్పష్టం చేశారు. అతని ప్రతిపాదనను వారు పూర్తిగా తిరస్కరించారు.

పెళ్లికి నిరాకరించడాన్ని జీర్ణించుకోలేకపోయిన శ్రీనివాస్.. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్నాడు. దీంతో నిరంతరం ఫోన్ కాల్స్ చేస్తూ ఆమెను తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు. ఫోన్ ఎత్తిన ప్రతిసారీ అసభ్యకరంగా మాట్లాడుతూ... తీవ్ర పదజాలంతో దూషిస్తూ మానసిక క్షోభకు గురిచేసేవాడు. ఇక, రోజురోజుకూ అతని వేధింపులు శృతి మించడంతో, అతని అగడాలు భరించలేకపోయిన బాధితురాలు తల్లిదండ్రులతో కలిసి మేడిపల్లి పోలీసులను ఆశ్రయించింది. శ్రీనివాస్ అసభ్యకర, వేధింపులు, అకృత్యాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదును స్వీకరించిన మేడిపల్లి పోలీసులు నిందితుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. అయితే, ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

ఎన్నికలు నిర్వహించడానికి

ప్రత్యేక ప్రభుత్వ గెజిట్ అధికారులు

అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 11 : మనం న్యూస్ రాష్ట్ర ఎన్నికల సంఘం మండల ప్రజా పరిషత్ల సభ్యుడు (కో-ఆప్టెడ్), అధ్యక్షుడు మరియు ఉపాధ్యక్షుడు మరియు సభ్యులు (కో-ఆప్టెడ్) ఎన్నికల నిర్వహణ కోసం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు.ఈ మేరకు ప్రతి మండల ప్రజా పరిషత్ సభ్యుడు (కో-ఆప్టెడ్), అధ్యక్షుడు మరియు ఉపాధ్యక్షుడి ఎన్నికను



నిర్వహించడానికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ గెజిటెడ్ అధికారులకు అధికారం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని 31 మండలాలకు 31 మంది ప్రభుత్వ గెజిటెడ్ అధికారుల నియామకం చేయడం జరిగిందని తెలిపారు.

డిసెంబర్ చివరికల్లా ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలి

- రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన
- పాలేరు వాగుపై రూ.47.64 కోట్లతో చేపట్టిన పథకం పనులు 70 శాతం పూర్తి
- నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు వేగం పెంచాలి
- కాలువ భూగర్భ మోటార్లు, సబ్‌స్టేషన్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్



కోదాడ నవంబర్ 11 (మనం న్యూస్): మండల పరిధిలోని రెడ్లకుంట వద్ద పాలేరు వాగు పై నిర్మిస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను బుధవారం రాష్ట్ర పౌర సరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి కాలువ పనులను, అండర్ గ్రౌండ్ మోటర్ లను, సబ్ స్టేషన్ పనులను నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ జిల్లా ఎస్పీ కే నరసింహతో కలిసి పవర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 47.64 కోట్ల రూపాయలతో 4,460 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లకు నీరు అందించడం జరుగుతుందని, ఈ లిఫ్ట్ ద్వారా ద్వారకుంటలో 66, నల్లబండగూడెంలో 1400, కాపుగల్లులో 1608, కూచిపూడిలో 400, రెడ్లకుంటలో 576, చిమిరాలలో 410 ఎకరాలకు

430 కిలో వాట్స్ సామర్థ్యం గల 4 మోటార్ల సహాయంతో సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు. మిగిలిన పెండింగ్ పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి నాణ్యతతో ఎలాంటి లోపాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి గుత్తందారులను ఆదేశించారు. అనంతరం కోదాడ నియోజక వర్గంలోని చిలుకూరు గుట్టలలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల, కోదాడ లో రూ.50 కోట్లతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను మంత్రి

ఉత్తమ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా మంత్రి చిలుకూరు గుట్టలో 200 కోట్ల రూపాయలతో 22 ఎకరాలలో నిర్మాణం చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బేస్మెంట్, కాంక్రీట్, పిల్లర్ల పనుల పురోగతి, నిర్మాణం పై సంబంధిత గుత్తందార్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, 2027-28 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిం చుటకు సిద్ధం చేయాలని ఆదేశించారు.కోదాడ లో 50 కోట్ల రూపాయాలతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై గుత్తందారులతో సమీక్షించారు. పట్టణములో వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ నూతన భవన నిర్మాణ పనులను, రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న.ఆర్ అండ్ బీ శాఖ నూతన భవన నిర్మాణ పనులను వీటితోపాటు షాదీఖానా నిర్మాణ పనులను అధికారులు, గుత్తందారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి భవన నిర్మాణాలను మంచి క్వాలిటీతో, నూతన ఆర్కిటెక్చర్ డిజైన్లతో పట్టణానికి అందం వచ్చే విధంగా నిర్మాణం చేపట్టాలని త్వరలో పనులు పూర్తిచేసి ప్రారంభించుటకు సిద్ధం చేయాలని గుత్తందారులను ఆదేశించారు. మంత్రి వెంట గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా నల్గొండలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

- గ్రౌండ్ +5 బ్లాక్ లలో 480 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- ఇంటికి 8.5 లక్షల రూపాయల ఖర్చు
- ప్రభుత్వ వాటా 5.0 లక్షలు,లబ్ధిదారుల వాటా 3.5 లక్షల రూపాయలు
- మీ సేవా ద్వారా ఆన్ లైన్ లో డిసెంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్



నల్లగొండ- నవంబర్ 11(మనం ప్రతినిధి): నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు లో మామిళ్లగూడ వద్ద ఒక్కో ఫ్లాట్ రూ.8.50 లక్షల రూపాయల చొప్పున (ఎ+5) బ్లాక్ లలో 480 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి.నెం.579 ద్వారా అనుమతించిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.5.00 లక్షల సబ్సిడీ ఇస్తుందని, లబ్ధిదారుల వాటా కింద యూనిట్కు రూ. 3.50 లక్షలను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన వారు మీ సేవా ద్వారా ఆన్ లైన్ లో డిసెంబర్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.దరఖాస్తు చేసుకునేందుకు నల్గొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు, ప్లాట్ లేని వారై ఉండాలని, వార్షిక ఆదాయం 6.0 లక్షలు దాటకూడదని, ఒక్క కుటుంబం నుండి ఒక్కరూ మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా నల్గొండ కార్పొరేషన్ పరిధిలో నివాసి అయి ఉండాలని తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



హుజూర్ నగర్, నవంబర్ 11 (మనం న్యూస్): హుజూర్ నగర్ ఇన్చార్జి తహసీల్దార్‌గా బాశెట్టి హరి ప్రసాద్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.సూర్యాపేట ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గా విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా హుజూర్ నగర్ ఇన్చార్జి తహసీల్దార్గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూ సేవలను ప్రజలకు వేగంగా పారదర్శకంగా అందిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని అని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు నూతన తహసీల్దార్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు



- జాతీయ రహదారి-65పై జంక్షన్ల గుంతలు పూడ్చివేత

సూర్యాపేట, నవంబర్ 11 (మనం ప్రతినిధి): పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఆదేశాల మేరకు బుధవారం సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని నియంత్రించుకొని నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

సాంకేతిక అనుమతి పత్రాలు కావాలి



హైదరాబాద్, నవంబర్ 11(మనంన్యూస్): శ్రీశైలం, నాగార్జునసాగర్ కు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా బోర్డు కొన్ని సూచనలు చేసింది. డిజైన్, ఆయకట్టు పరిధి, సాంకేతిక అనుమతి పత్రాలు కావాలని బోర్డు తెలిపింది. ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటి మళ్లింపు, వినియోగం బోర్డు వివరాలు కోరింది. మార్పులకు ఉన్న సాంకేతిక అనుమతి వివరాలు కోరిన కృష్ణా బోర్డు, అదనపు పథకాలకు ఆమోదం తెలిపింది. అనుమతుల రికార్డులు సమర్పించాలని చెప్పింది. కొత్త పథకాలు, అదనపు నీటి అవసరాల వివరాలను కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కోరింది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం?


హైదరాబాద్, మనంబ్యూరో: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. నవంబర్ 13న అల్పపీడనం ఏర్పడే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం వాయవ్య దిశగా కదులుతూ 24 గంటల్లో బలమైన అల్పపీడనంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే అది నవంబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, తుపానుగా మారే ఛాన్స్ లేకపోలేదని కూడా వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తుపానుగా మారే అవకాశముందా? లేదా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. గంటకు 40 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉంది.

తెలంగాణలో పొడి వాతావరణం...

తెలంగాణలో వాతావరణంపై కీలక అప్ డేట్ జారీ చేసింది. రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు వర్ష సూచనలు లేవని, వాతావరణం పూర్తిగా పొడిగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండి ఎండ కాస్తుండగా, సాయంత్రం, రాత్రి మరియు ఉదయవేళల్లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉదయం పూట కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురుస్తోంది.హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పగటిపూట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండగా, రాత్రి మరియు ఉదయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో కొంత వాతావరణం చల్లబడి విద్యుత్తు వినియోగం గణనీయంగా తగ్గనుంది. ఇది వినియోగదారులతో పాటు, ప్రభుత్వానికి కూడా ఊరట లాంటిదే.

కొన్ని చోట్ల వానలు...

ఆంధ్రప్రదేశ్ లో వానలు అక్కడక్కడ వానలు పడతాయని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వాతావరణం కొంత చల్లబడే అవకాశముంది. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో, రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు కొంత మేరకు



తగ్గుతాయని, అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతల కంటే రాత్రి ఉష్ణోగ్రతలు చాలా వరకూ తగ్గే అవకాశముందని కూడా వాతావరణ శాఖ వెల్లడించింది.

తుఫాన్ బాధితులకు కిట్స్ అందజేత



కాట్రేనికోన నవంబర్ 11 మనం ప్రతినిధి: సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ (సిఫార్డ్) స్వచ్ఛంద సేవా సంస్థ, బాపట్ల, సీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ న్యూఢిల్లీ వారి సహకారంతో కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని 360 కుటుంబాలకు అర్నాబ్ తుఫాన్ బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా సుమారు సుమారు రూ.3000/- విలువ గలిగిన హైజీన్ మరియు షెల్టర్ కిట్స్ అందించడం జరిగినది. సిఫార్డ్ సంస్థ డైరెక్టర్ కె. రవి ప్రదీప్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో బాధిత కుటుంబాలకు సహాయం అందించడం మా బాధ్యతని,కాట్రేనికోన పంచాయతీలో మా సంస్థ యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ , సిఫార్డ్ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, రామకృష్ణ,వెంకటేశ్వరరావు మరియు సంస్థ వాలంటీర్స్ పాల్గొన్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు పూర్తి



అమరావతి, మనంబ్యూరో: సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సర్వాంగ సుందరంగా విశాఖ నగరం ముస్తాబయింది. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో రేపు, ఎల్లుండి సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విదేశీ అతిథులకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గిరిజన థింసా డాన్స్, గరగ నృత్యం, తప్పెట గుళ్ళు తదితర సంప్రదాయాలను తెలియచేసేలా ఏర్పాటు చేసింది. ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలాట కూచిపూడి లాంటి సాంప్రదాయ కళల్ని ప్రదర్శించేలా అలంకరణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం, ఏపీ ఆతిథ్యం, రుచులు, అమరావతి వైభవం, నూతన రాజధాని, కడియం నర్సరీ లాంటి ప్రత్యేకతలను ప్రదర్శించేలా కళాకృతులను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు తెలియ చెప్పేలా వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, టూరిజం, లాజిస్టిక్స్, సోలార్ తదితర అంశాలను చాటి చెప్పేలా స్టాళ్లు, కళాకృతులను రూపొందించారు.

పారిశ్రామికవేత్తలు చర్చలు జరిపేలా? ప్రధాన ప్లీనరీ హాలు తో పాటు పారిశ్రామిక వేత్తలు చర్చలు జరిపేలా వివిధ సమావేశ ప్రాంగణాలను సిద్ధం చేసిన ప్రభుత్వం, దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యి చర్చలు జరిపేందుకు వీలుగా మరో ప్రత్యేక హాలును కూడా సిద్ధం చేశారు. బిజినెస్ టూ బిజినెస్, గవర్నమెంట్ టు బిజినెస్ చర్చల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భాగస్వామ్యాలు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు వేర్వేరుగా ఏర్పాట్లు చేసింది. ఒకేసారి రెండు, మూడు కార్యక్రమాలు నిర్వహించుకునేలా సమావేశ మందిరాలను తాత్కాలికంగా నిర్మించింది. ఈ సమావేశ మందిరాల్లో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు ఆరు కీలకమైన అంశాలపై మేధో మధనం జరగనుంది.

చిరుతలు ఎలుగుబంట్ల సంచారం...

భయాం భయంతో రైతులు ప్రజలు

- అటవీ ప్రాంత రహదారుల వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు
- అటవీ ప్రాంతాల్లో అరకోరగా త్రాగునీటి తొట్టెలు
- పట్టణ నడిబొట్టున ఎలుకబంటి సంచారం
- ఎలుకబంట్లు దాడులతో నష్టాల పాలవుతున్న పంటలు
- చర్యలు చేపడతామన్న అటవీ శాఖ అధికారులు కనిపించని చర్యలు.?



కళ్యాణదుర్గం నవంబర్ 11 మనం న్యూస్: అటవీ ప్రాంతాల ను వదిలి జన నివాసంలో కి వన్యప్రాణాలు సంచరించడం వల్ల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి వల్ల ఇటు ప్రజలకు అటు వన్యప్రాణాల కు రక్షణ కరువైంది. ఎలుకబంట్లు గ్రామీణ ప్రాంతాల లో పంట తోటలకు వెళ్లే రైతుల పై దాడులు చేయడం పంటల ను నేలపాలు చేయడం పూర్తిగా రైతులకు నష్టాల పాలు తప్పడం లేదు చిరుతలు ఆవు దూడ ఏనుములు వీధి కుక్కలు పై దాడులు అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని చెప్పడమే తప్ప ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే హడావిడి చేయడం అటవీ ప్రాంతంలో త్రాగునీటి సౌకర్యం మరియు రహదారుల వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం రైతులకు వాటిపై అవగాహన కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో తెలుపకపోవడం ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు ముందు నిద్ర వీడి చిరుతలు ఎలుగుబంట్ల జన నివాసంలోకి రాకుండా చూడాలని గ్రామీణ ప్రాంతాల రైతులు ప్రజలు తప్పించుకోవడం గమనార్హం

అటవీ ప్రాంతాల్లో కనిపించని హెచ్చరిక బోర్డులు

నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారులకు రైతు పంట పొలాలకు అతి దగ్గర సమీపంలో చిరుతలు ఎలుగుబంట్ల జింకలు వన్య మృగాలు సంచరిస్తున్న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. అరకొరగా ఏర్పాటు చేయడం తో సద్దగించారు.

వన్యప్రాణాలకు త్రాగునీటి కష్టాలు

కళ్యాణదుర్గం శేట్టూరు కనేకల్లు మూడు సెక్టార్లలో రాష్ట్ర ప్రభుత్వం వన్యప్రాణాల రక్షణ కొర కై తాగునీటి తొట్టెలు అటవీ ప్రాంతాలు దట్టమైన ప్రాంతాలు నిర్మించాలని నిధులు కేటాయించారు. అయితే తాగునీటి సౌకర్యం లేక జన నివాసంలో కి వన్యప్రాణాలు సంచరిస్తున్నాయా రైతులు మూగజీవాలను పంట పొలాల్లోకి రానివ్వకుండా హడలు చేశారా హడలు చేయడం వల్ల చుట్టేసిన ప్రాంతాలనే అవి చుట్టేస్తున్నాయా ఏది ఏమైనాప్పటికీ ఇటు ప్రజలను అటు వన్యప్రాణాల రక్షణ బాధ్యత మొత్తం అటవీ శాఖ అధికారుల పైనే ఉంది.

నిత్యం జన నివాసంలోకి చిరుతలు ఎలుగుబంట్లు

అధికారులు వస్తున్నారు వెళ్తున్నారు చర్యలు చేపడతాం పూర్తిస్థాయిలో నిర్మిస్తాం చెప్పిన మాటలు మాటలకే పరిమితం అవుతున్నాయి తప్ప జననివాసంలో కి ఎలుకబంట్లు చిరుతలు జింకలు ప్రవేశం లేకుండా చేయడం అందుకు తగ్గ చర్యలు చేపట్టడంలో అటవీ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. పట్టణానికి అతి దగ్గరగా ఉన్న దొడగట్ట గుబనపల్లి ముదిగల్లు గ్రామ లలో అనునిత్యం ప్రజల మధ్యలో కి వన్యప్రాణాలు సంచారించడం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తప్ప అధికారులు నామమాత్రపుగా విధులు నిర్వహించడం తప్ప వర్తిస్తాయిలో చర్యలు చేపట్టడం లేదని రైతులు ప్రజలు వాపోతున్నారు. ఫోటో రైట్ అప్ 1. చిరుతపులి ఎలుకబంట్లు

స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం



- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అనంత పోలీసులు ఘన నివాళి
- స్వాతంత్ర్య ఉద్యమం, విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి

అనంతపురం, నవంబర్ 11: మనం బ్యూరో: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను పోలీసు అధికారులు, సిబ్బంది స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యావేత్తగా, రచయితగా, పాత్రికేయుడిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు దేశ ఐక్యత, సమగ్రత, మత సామరస్యం కోసం కృషి చేశారని గుర్తుచేశారు.

స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధి, సాంకేతిక విద్య విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకోవడం విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా పేర్కొన్నారు. దేశానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారంతో ఆయనను గౌరవించారని తెలిపారు. ఆజాద్ దేశభక్తి, జాతీయ సమైక్యత, విద్యా దృక్పథం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ ఐ పవన్ కుమార్ , పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్ , ఆర్ ఎస్ ఐ జాఫర్ , లక్ష్మినారాయణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పైడాకుల అశోక్

ఏటూర్ నాగారం, నవంబర్ 11, మనం ప్రతినిధి: ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్ను బుధవారం ప్రారంభించారు. ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఝాన్సీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన వి.ఎన్. నాయక్



హనుమకొండ, నవంబర్ 11(మనంన్యూస్): జరుపుల విజయ సమ్మయ్య నాయక్ కుమారుని వివాహ వేడుక పీజీఆర్ గార్డెన్స్లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్. నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు వి.ఎన్. నాయక్ - బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్. లక్ష్మణ్ - జిల్లా బీసీ సంక్షేమ అధికారి, హనుమకొండ, భానోత్ భీమా నాయక్ - రిటైర్డ్ హెచ్ఎం., బానోత్ ఛత్రు నాయక్ - వ్యవసాయ శాఖ. బానోత్ సమ్మయ్య నాయక్ - రిటైర్డ్ టెలిఫోన్ శాఖ., ఈ సందర్భంగా నూతన వధూవరులకు పెద్దలు, ప్రముఖులు ఆశీస్సులు అందజేశారు.

తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సూర్య



ఏటూర్ నాగారం, నవంబర్ 11, మనం ప్రతినిధి: మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్ను బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య ప్రారంభించారు. ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఝాన్సీరాణి ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారంలో నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


భగవంతుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



- ఉమ్మడి వరంగల్ జిల్లా చిట్స్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్
- రామాలయ ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న తస్లీమా

ములుగు, నవంబర్ 11, మనం ప్రతినిధి: శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా చిట్స్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆకాంక్షించారు, బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయంలో నూతన ధ్వజస్థంభ, మరియు నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో తస్లీమా మహ్మద్ పాల్గొన్నారు. అనంతరం తస్లీమా మాట్లాడుతూ శ్రీ రాముడు జీవితాంతం ఎలాంటి పరిస్థితులలోనైనా ధర్మాన్ని పీడకుండా నడిచిన మహనీయుడని, ఆదర్శవ ంతమైన మానవ జీవన విధానానికి సీతారాములు నిదర్శనమని తస్లీమా అన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్,మరియు కౌన్సిలర్లు, రామాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ



- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రెటరీ కుంజ సూర్య

మంగపేట, నవంబర్ 11, మనం ప్రతినిధి: మంగపేట మండలంలో పూరేడుపల్లి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కొప్పుల విజయలక్ష్మి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు తో కలిసి తెలంగాణ యువజన సెక్రెటరీ కుంజ సూర్య పరామర్శించారు

తదనంతరం మంగపేట మండలం శనిగకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంజా పూర్ణచందర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించిన కుంజ సూర్య అన్న కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు

తదనంతరం మంగపేట మండలం మొట్ల గూడెం గ్రామానికి చెందిన కుడుముల శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కుంజ సూర్య అన్నగారు వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధర్యం కల్పించారు

ఈ కార్యక్రమంలో మంగపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేట్టిపల్లి వెంకటేశ్వర్లు, ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య, భద్రాచలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పూజారి సురేంద్రబాబు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి యూత్ కాంగ్రెస్ ఎడ్ల నరేష్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్, మండల కోశాధికారి చాదా మల్లయ్య, మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఎర్రంగాని సురేష్, డైరెక్టర్ బోడ బురయ్య, మండల అధికార ప్రతినిధి తాతినేని హరికృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నూతన కంటి రాజు, మండల సీనియర్ నాయకులు లక్ష్మీపతి, యూత్ కాంగ్రెస్ నాయకులు బూర్గుల సతీష్ తదితరులు పాల్గొన్నారు

చంద్రారెడ్డిని పరామర్శించిన కుంజ సూర్య



మంగపేట, నవంబర్ 11, మనం ప్రతినిధి: బుధవారం మంగపేట మండలంలోని బోర్ నరసాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేలపట్ల చంద్రారెడ్డి అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన చంద్రా రెడ్డి ని పరామర్శించిన కుంజా సూర్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈ కార్యక్రమంలో మంగపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చేట్టిపల్లి వెంకటేశ్వర్లు, ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య, భద్రాచలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పూజారి సురేంద్రబాబు, మంగపేట మండల కోశాధికారి చాదా మల్లయ్య, మాజీ ఆత్మ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిల్కాటి నరేష్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూక్య కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండపల్లి నరసయ్య గౌడ్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు పందిరి మోహన్, బండపల్లి యాకయ్య, మైల శ్రీను, వెంకటేష్, గోపాల నరేష్, గద్దల మురళి, తదితరులు పాల్గొన్నారు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన పలు జిల్లాల నేతలు

- స్థానిక ఎన్నికలు జరిగిన తీరుపై చర్చ

తాడేపల్లి, నవంబర్ 11(మనం న్యూస్): తాడేపల్లిలోని వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని పలు జిల్లాల నేతలు మంగళవారం కలిశారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలు జరిగిన తీరుపై వారు చర్చించారు. ఈ భేటీలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ పార్టీ కేడర్ అంతా కసితో గట్టిగా పోరాటం చేశారని అన్నారు. చంద్రబాబు అక్రమాలను ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే వైఎస్ఆర్సీపీ ఓటింగ్ శాతాలు పెరిగాయని, అరాచకాలు, అన్యాయాలు చేసినా ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగితే భారీ ఓట్ పర్సంటేజ్ వచ్చేదని అన్నారు. ఇది బయటకు వస్తే తన ప్రభుత్వం చిక్కుల్లో పడుతుందనే చంద్రబాబు అరాచకాలు చేశాడని ఆరోపించారు. ఎన్నికల అక్రమాల్లో చంద్రబాబు సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారని విమర్శించారు. వైఎస్ఆర్సీపీ గెలిచిన చోట ఫలితాలు తారుమారు చేశారని, దుర్మార్గాలు చేసి ఇప్పుడు బాబు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు.

జాతీయ సమైక్యతకు కలాం చేసిన కృషి ఆదర్శప్రాయం

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన వైయస్ జగన్



తాడేపల్లి, నవంబర్,11,(మనం ప్రతినిధి): భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆజాద్ చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని వైయస్ జగన్ కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని విశ్వసించిన గొప్ప దార్శనికుడు ఆజాద్ అని పేర్కొన్నారు.

దేశంలో విద్యావ్యాప్తికి, ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, మతసామరస్యం, లౌకికవాదం, జాతీయ సమైక్యత కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఆజాద్ అని గుర్తుచేసుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాలన్న ఆయన ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ ప్రగతికి, దేశాభివృద్ధికి పునాది అని ఆజాద్ బలంగా విశ్వసించారని, ఆయన ఆలోచనలు భావితరాలకు మార్గదర్శకమని వైయస్ జగన్ స్మరించుకున్నారు. ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం విద్యారంగానికి ఆయన అందించిన సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మైనార్టీ నాయకులు మహ్మద్ రుహుల్లా, డాక్టర్ మెహబూబ్ షేక్, షరీఫ్, దస్తగిరి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో కొత్త అధ్యాయనం

- విజయసాయిరెడ్డి కొత్త పార్టీ
- 'పరివర్తన రాజనీతి పార్టీ'గా నామకరణం
- రెండు కుటుంబాల ఆధిపత్యానికి చరమగీతం పాడాలి

పీఆర్పీ సత్తా చూపిస్తా: విజయసాయిరెడ్డి

ఏపీ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. పార్టీకి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరు, జెండాను ఆయన అధికారికంగా ఆవిష్కరించారు. బెజవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల మధ్య కొత్త పార్టీ పేరు, జెండాను బటన్ నొక్కి ఆవిష్కరించారు.

అమరావతి, మనంప్రత్యేక ప్రతినిధి: ముందుగా చెప్పినట్టుగానే 11 నెల 11వ తేదీ 11 గంటలకు కొత్త పార్టీ ప్రకటించారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. ఇక, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) అధ్యక్షుడు విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తానొక్కడినే రాష్ట్రాన్ని మారుస్తానని చెప్పడం లేదని, రాష్ట్ర ప్రజల చేతుల్లోనే మార్పు తీసుకొచ్చే శక్తి ఉందని అన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జగన్ అయినా, చంద్రబాబు అయినా తప్పు చేస్తే ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో తన పార్టీ విధానాలు, రాజకీయ లక్ష్యాలను వివరించారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలి రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ఆంధ్రులను రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని విజయసాయిరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రెండు కుటుంబాల ఆధిపత్యం, వారసత్వ రాజకీయాలకు చోటు ఉండకూడదన్నారు. ముఖ్యమంత్రి కుమారుడే ముఖ్యమంత్రి కావాలా? ప్రతిపక్ష నాయకుడి కుమారుడే సీఎం కావాలా? అని ప్రశ్నించారు. ప్రజలకు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించాలనే ఉద్దేశంతోనే పార్టీ పెట్టానని, తాను వ్యక్తిగతంగా నాయకుడిగా ఎదగడానికి ఈ పార్టీని స్థాపించలేదని స్పష్టం చేశారు. యువతలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు అన్ని సామాజిక వర్గాల నుంచి నాయకులను తయారు చేస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో మరో నాయకుడిని, కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న రెండు కుటుంబాలకు ఇకపై రాష్ట్రంలో చోటు ఇవ్వకూడదని వ్యాఖ్యానించారు.పీఆర్పీ సత్తా చూపిస్తా

ప్రస్తుతం రాష్ట్ర ప్రజల్లో తుఫాన్కు ముందు ఉండే ప్రశాంతత కనిపిస్తోందని విజయసాయిరెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికలకు ముందు పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) సత్తా ఏమిటో చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో దుష్ట పాలనకు చరమగీతం పాడతామని వ్యాఖ్యానించారు. ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రంలో రాజకీయ మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగంపై విమర్శలు

టీడీపీకి ప్రజలు అధికారం ఇచ్చింది ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయడానికి కాదని విజయసాయిరెడ్డి అన్నారు. ఇది వెన్నుపోటు కాలం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామని భావిస్తే రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఇంకా 30 నెలల సమయం మాత్రమే ఉందని, ఇప్పటికైనా పాలనా తీరును మార్చుకోవాలని సూచించారు. మొత్తంగా రాష్ట్రంలో రెండు కుటుంబాల ఆధిపత్యానికి ముగింపు పలకడం, వారసత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా యువతతో పాటు అన్ని సామాజిక వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం, ప్రజల సమస్యలపై ప్రశ్నించే రాజకీయ వేదికగా పీఆర్పీని తీర్చిదిద్దడం తన లక్ష్యమని విజయసాయిరెడ్డి ప్రకటించారు.

వైసీపీ కార్యకర్తలకు విజయసాయిరెడ్డి పిలుపు

వైసీపీలోని కార్యకర్తలకు విజయసాయిరెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. గౌరవం పొందాలని, ప్రజలకు సేవ చేయాలని భావించే వారు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సేవ చేయాలనే సంకల్పం ఉన్నవారికి పరివర్తన రాజనీతి పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తామని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

పార్టీలో చేరికలకు కార్యకర్తల అభిప్రాయమే కీలకం!

- పెనుమాదంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం
- వైఎస్సార్సీపీ నుంచి వచ్చేవారిని చేర్చుకునే అంశంపై చర్చ



పోడూరు, నవంబరు 11, మనం ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా,పోడూరు మండలం, పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని పెనుమాదం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వారిని పార్టీలోకి ఆహ్వానించాలా? వద్దా? అనే అంశంపై గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.పాలకొల్లు ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కడలి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పార్టీలోకి కొత్తగా వచ్చే వారిని చేర్చుకునే విషయంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే వారికే ప్రాధాన్యం ఉండాలని, ఐకమత్యంతో ముందుకు సాగితే గ్రామంలో పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.గతంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని నాయకులు సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ కార్యదర్శి దిద్దే హరికృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు దేవరపు దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు రాచకొండ విశ్వనాథం, దేవస్థానం చైర్మన్ తంగెళ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కొల్లు రామారావు, మాజీ సర్పంచ్ తానేటి బాబురావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నామవరపు రవికుమార్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు పాలా నాగలక్ష్మి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు దేవరపు పద్మ, పార్టీ కన్వీనర్లు జక్కంచెట్టి నాగరాజు, ఉందుర్తి రమేష్, బోసుపాముల నాగరాజు, గెద్దాడ రాంబాబు, పీతల సాల్మన్ రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ మెటాలిక్స్ ఆధ్వర్యంలో ఘనంగా ఆలోకమయ్ కోల్‌కత్తా

దీపావళి సంబరాలతో నగర ప్రజలను ఒక్కచోట చేర్చిన నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమం

కోల్‌కత్తా అక్రోపోలిస్ మాల్లో జరిగిన ముగింపు వేడుకలకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి హాజరు

విజయవాడ : నవంబర్ 10, 2026: దీపావళి పర్వదినం సందర్భంగా శ్యామ్ మెటాలిక్స్ సంస్థ కోల్‌కతా నగర ప్రజలను నాలుగు రోజులపాటు ఒకచోట చేర్చి 'ఆలోకమయ్ కోల్‌కతా' పేరిట ప్రత్యేక వేడుకలను నిర్వహించింది. నగరంలోని అక్రోపోలిస్ మాల్లో నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఈ కార్యక్రమం వెలుగులు, రంగులు, కళలు, సంస్కృతిపై ప్రజలకున్న అభిరుచిని ప్రతిబింబించింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో సృజనాత్మకత, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రజల భాగస్వామ్యంతో కోల్‌కతా పండుగ వాతావరణాన్ని, కళాత్మక వైభవాన్ని చాటిచెప్పారు. కోల్‌కతాకు ప్రత్యేకమైన సాంస్కృతిక గుర్తింపును వేడుకల రూపంలో ఆవిష్కరించాలనే లక్ష్యంతో శ్యామ్ మెటాలిక్స్ సంస్థ 'ఆలోకమయ్ కోల్‌కతా' పేరుతో ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. సంప్రదాయాలకు సృజనాత్మకత, ఆధునికతను జోడించి సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించింది.

ఈ వేడుకల్లో భాగంగా ఖిఉఔ టైగర్ ఖీఖీ బార్స్ బలాన్ని, ఖిఉఔ టైగర్ రూఫింగ్ షీట్స్ వైవిధ్యాన్ని చాటిచెప్పే ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేశారు. ఖిఉఔ టైగర్ ఖీఖీ బార్స్తో రూపొందించిన ఆకట్టుకునే దీపాల వృక్షం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అలాగే ఖిఉఔ టైగర్ రూఫింగ్ షీట్స్తో కోల్‌కతా నగర ప్రత్యేకతను ప్రతిబింబించే వారసత్వ ట్రామ్, సంప్రదాయ ట్యాక్సీ నమూనాలను కూడా సృజనాత్మకంగా రూపొందించారు. విద్యుద్దీపాలతో అలంకరించిన తోరణాలు, ఇతర అలంకరణలు ఈ ప్రదర్శనలకు మరింత వన్నె తెచ్చాయి. కోల్‌కతా నగర చారిత్రక ప్రత్యేకతలను, శ్యామ్ మెటాలిక్స్ ఉత్పత్తుల సాంకేతిక సామర్థ్యాన్ని ఈ నిర్మాణాలు చాటిచెప్పాయి. కేవలం అలంకరణలకే పరిమితం కాకుండా, ప్రజల భాగస్వామ్యానికి ఈ కార్యక్రమంలో పెద్దపీట వేశారు.



తొలిరోజైన నవంబర్ 6న పూలతో రంగోలి (ఫ్లోన్ కీ రంగోలి) కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 7న రంగోలి పోటీలు నిర్వహించారు. నవంబర్ 8న దీపాలంకరణ (దియా పెయింటింగ్) కార్యక్రమం చేపట్టారు. ఈ విభిన్నమైన సృజనాత్మక కార్యక్రమాల ద్వారా సందర్శకులను వేడుకల్లో భాగస్వాములను చేశారు.

వేడుకల చివరి రోజైన నవంబర్ 9న నగరంలోని అక్రోపోలిస్ మాల్లోజరిగిన ముగింపు వేడుకలకు

ప్రముఖ నటుడు, సాంస్కృతిక రంగ ప్రముఖుడు మిథున్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేసి సత్కరించారు. ప్రత్యేక బహుమతులను కూడా ప్రదానం చేశారు. కేవలం వ్యాపార కార్యకలాపాలకే పరిమితం కాకుండా, సమాజంతో మమేకమై ప్రజలను ఒక్కచోట చేర్చే అర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించాలనే లక్ష్యంతో శ్యామ్ మెటాలిక్స్ ఈ వేడుకలను చేపట్టింది.

ఈ కార్యక్రమం గురించి శ్యామ్ మెటాలిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నిర్మల్ ఉదయ్ మాట్లాడుతూ, కోల్‌కతా అంటే కేవలం ఒక నగరం మాత్రమే కాదని, ప్రజలు, వారి సంప్రదాయాలు, సృజనాత్మకత, అసాధారణమైన ఐక్యతా భావం మేళవించిన ఒక భావోద్వేగమని పేర్కొన్నారు. ఆలోకమయ్ కోల్‌కతా కార్యక్రమం ద్వారా ఈ ప్రత్యేకతలను వేడుకగా జరుపుకోవడంతోపాటు, నగర ప్రజలు పండుగ సంబరాల్లో అంతర్భాగం కావాలని భావించినట్లు తెలిపారు. తమ సంస్థ సొంతంగా భావించే ఈ కోల్‌కతా నగర స్ఫూర్తితో ఖిఉఔ టైగర్ ఖీఖీ బార్స్, ఖిఉఔ టైగర్ రూఫింగ్ షీట్స్ను సృజనాత్మక రూపాల్లో ఆవిష్కరించడం తమకు ఎంతో ప్రత్యేకమని చెప్పారు. తమ ఉత్పత్తులతో నిర్మించే కట్టడాలు దృఢమైనవే కాకుండా, ప్రజలు, సమాజంతో ఏర్పరుచుకునే బంధాల్లోనూ నిజమైన దృఢత్వం ఉంటుందని తాము విశ్వసిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలోకమయ్ కోల్‌కతా ద్వారా నగరంలో జరిగే దీపావళి వేడుకలకు మరింత వెలుగు, ఆనందం, ఐక్యతను జోడించాలని భావించినట్లు పేర్కొన్నారు.

అతిపెద్ద ట్రేడ్ డీల్ పూర్తి..

హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ పై ఐపీఎల్ అధికారిక ప్రకటన



టాటా ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు టోర్నీ చరిత్రలోనే అత్యంత సంచలనాత్మకమైన ప్లేయర్ ట్రేడింగ్ అధికారికంగా పూర్తయింది. ముంబై ఇండియన్స్ (ఏ) కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు మారగా, భారత టీ20 అగ్రశ్రేణి వికెట్ టేకర్, స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌లో చేరారు. ఈ భారీ ట్రేడ్‌లో భాగంగా హార్దిక్ పాండ్యా పారితోషికం గతంలో ఉన్న రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగగా, అర్ష్‌దీప్ సింగ్ తన ప్రస్తుత వేతనం రూ.18 కోట్లకే ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ ఒప్పందంతో ముంబై ఇండియన్స్‌తో హార్దిక్ పాండ్యాకు ఉన్న రెండో విడత ప్రయాణానికి తెరపడింది. 2015లో ఎంఐతో ప్రయాణం మొదలుపెట్టిన హార్దిక్.. 2015, 2017, 2019, 2020 టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్ అరంగేట్రంలోనే ఛాంపియన్‌గా, 2023లో రన్నరప్‌గా నిలిపిన ఆయన 2024లో తిరిగి ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 146.28 స్ట్రైక్ రేట్‌తో 2,955 పరుగులు సాధించడంతో పాటు 82 వికెట్లు తీసి అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్నారు. మరోవైపు, 2019లో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టి పంజాబ్ కింగ్స్ తరఫున ఎనిమిది సీజన్లలో 96 మ్యాచ్‌లాడిన అర్ష్‌దీప్ సింగ్.. 111 వికెట్లతో ఆ ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించారు. 2025 లో 21 వికెట్లు, 2026 లో 14 వికెట్లతో రాణించిన ఈ లెఫ్టార్మ్ పేసర్ చేరిక ముంబై డెత్ ఓవర్ల బౌలింగ్ విభాగాన్ని మరింత పటిష్టం చేయనుంది.

స్టార్ బాయ్ ఇంట్రెస్టింగ్

ప్రాజెక్ట్ షురూ





టాలెంటెడ్ స్టార్ సిద్ధు జొన్నలగడ్డ మరో బ్యూటిఫుల్ లవ్‌స్టోరీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కెరీర్‌లో మైలురాయిలా నిలిచే 10వ చిత్రంగా ఈ మూవీ రాబోతుండగా, తాజాగా, ఈ సినిమా పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్లు బుచ్చిబాబు సనా, నందిని రెడ్డి ఈ వేడుకను మరింత స్పెషల్‌గా మార్చారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ క్లాప్ కొట్టడంతో పాటు సినిమా గ్లింప్స్‌ను విడుదల చేయగా, బుచ్చిబాబు, నందిని రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఇప్పటివరకు తనదైన శైలి భిన్నమైన కథలు, అదిరిపోయే కామెడీ టైమింగ్‌తో మాత్‌లో ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న సిద్ధు జొన్నలగడ్డ.. ఇప్పుడు పూర్తిస్థాయి రొమాంటిక్ డ్రామాతో అలరించనున్నారు.ఈ సినిమాలో సిద్ధు సరసన క్యూట్ బ్యూటీ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు మోహన్ బి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేసే జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.

చిరంజీవి 'మెగావర్స్'కు గెస్ట్‌గా రాబోతున్న పాన్ ఇండియా స్టార్!



మెగాస్టార్ చిరంజీవి ఎట్టకేలకు ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ కోసం ఆయన 'మెగావర్స్' పేరుతో ఒక క్రేజీ సెలబ్రిటీ టాక్ షోకు హోస్ట్‌గా వ్యవహరించబోతున్నారు. ప్రస్తుతం ఈ షోకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ షో గురించి తాజాగా ఇండస్ట్రీలో ఒక సంచలన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ మెగా టాక్ షోలో పాన్ ఇండియా స్టార్, ప్రభాస్ ప్రత్యేక అతిథిగా పాల్గొనే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్, మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఒకే వేదికపై సందడి చేయడం అభిమానులకు కన్నుల పండుగ కానుందని టాక్.తాజా సమాచారం ప్రకారం.. ప్రభాస్ పాల్గొనే ఈ స్పెషల్ ఎపిసోడ్ షూటింగ్ నవంబర్ 20, 2026న జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. వీరిద్దరి మధ్య ఉండే ఆప్యాయత, సరదా సంభాషణలు ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తాయో అని ఇప్పుడే అంచనాలు మొదలయ్యాయి. కాగా.. ఇప్పటికే ఈ షో కోసం టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు ప్రముఖ నటీనటులు తమ ఎపిసోడ్ షూటింగ్స్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. ఇండియన్ సినిమాలోని దిగ్గజ తారలందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తూ నెట్‌ఫ్లిక్స్ ఈ షోను అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తోంది. త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ సంస్థ 'మెగావర్స్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించనుంది.

క్రిస్ గేల్.. 47 ఏళ్ల వయసులో మళ్లీ మైదానంలోకి!



వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ క్రిస్ గేల్ ఆడితే ఆ ఆకర్షణే వేరు. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడ లీగ్‌లు జరిగినా అతడు కచ్చితంగా ఉండేవాడు. కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్న అతడు మళ్లీ లీగ్ బాట పట్టాడు. 47 ఏళ్ల వయసులో ఇటాలియా టీ10 లీగ్‌లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ లీగ్‌లో వెనిస్ లైవ్‌వైర్స్‌కు అతడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ''టీ10 ఫార్మాట్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇటలీ అభిమానులను అలరించడానికి సిద్ధంగా ఉన్నా'' అని గేల్ చెప్పాడు. ''గేల్ అనుభవం, ఆటపై అతడికున్న అవగాహన.. వెనిస్ జట్టుకు ఎంతో ఉపయోగపడనుంది. గేల్‌కు స్వాగతం'' అని ఆ జట్టు డైరెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపాడు. నవంబర్ 18 నుంచి ఇటాలియా లీగ్ ఆరంభం కానుంది.

శర్వానంద్ 'భోగి' రిలీజ్ వాయిదా

త్వరలోనే కొత్త డేట్ ప్రకటన..!

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, సంపత్ నంది డైరెక్షన్‌లో తెరకెక్కిన హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా చిత్రం 'భోగి'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.అనుకోని కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని వారు తెలిపారు. సినిమా విడుదలపై వచ్చే ఎలాంటి రూమర్లు లేదా ఊహాగానాలను నమ్మవద్దని మేకర్స్ ప్రేక్షకులను, అభిమానులను కోరారు. ప్రేక్షకుల అంచనాలకు తగినట్లుగా అదిరిపోయే అనుభూతిని అందించేందుకు కష్టిస్తున్నామని, త్వరలోనే కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. ఇక భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరి ఈ చిత్ర కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు ఉంటుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రియుడిని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్

ప్రియా భవానీ శంకర్



తెలుగు బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి'తో ఇటీవల విశేష ఆదరణ పొందిన హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించింది. రవితేజ సరసన భార్య పాత్రలో కనిపించిన ఈ భామ, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ తమిళ భామ తన ప్రేమికుడు రాజ్‌వెల్ రాజ్‌ను వివాహం చేసుకుని ఒకటయ్యారు.

కాలేజీ రోజుల నుంచే పరిచయమున్న ఈ జంట, చాలా కాలంగా ప్రేమలో ఉంటూ తమ సంబంధాన్ని ఎప్పుడూ దాచకుండా బహిరంగంగానే వ్యక్తపరిచారు. నేడు వైభవంగా జరిగిన వేడుకలో ఈ జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. వివాహం పట్ల గతంలోనే స్పందించిన ప్రియా భవానీ శంకర్, 2024లోనే రాజ్‌వెల్‌తో త్వరలోనే ఏడడుగులు వేయబోతున్నట్లు స్పష్టం చేసింది. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తూనే, మరోవైపు ప్రొఫెషనల్‌గా వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. తమిళంలో ఘనవిజయం సాధించిన డిమోంటి సిరీస్‌లో భాగంగా రూపుదిద్దుకుంటున్న 'డిమోంటీ కాలనీ 3' చిత్రంతో 2027 పొంగల్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

బాలీవుడ్‌కు దూరమవుతున్న

ప్రియాంక చోప్రా

'వారణాసి' తర్వాత టాలీవుడ్‌లో భారీ ప్లాన్!

గ్లోబల్ స్టార్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా జానాస్ మరోసారి భారతీయ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లోకి ఆమె రీ ఎంట్రీ ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా చాలా ఏళ్ల తర్వాత దక్షిణాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆమె.. ఇకపై తెలుగు సినిమాల్లోనూ వరుసగా నటిస్తారా? లేక మళ్లీ హాలీవుడ్ ప్రాజెక్టులకే పరిమితమవుతారా? అన్న ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అంతర్జాతీయ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నప్పటికీ 'వారణాసి' వంటి భారీ ప్రాజెక్టుకు ఆమె అంగీకరించడం వెనుక కథలోని ప్రత్యేకత, రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, సినిమాకు ఉన్న గ్లోబల్ స్కేల్ ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.ప్రస్తుతం ప్రియాంక చోప్రా తన కెరీర్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటున్నారు. కేవలం స్టార్ హీరోల సినిమాలు, భారీ బడ్జెట్ ప్రాజెక్టులు అనే కోణంలో కాకుండా.. తన పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంది? కథలో తన పాత్ర ప్రభావం ఎంత? సినిమా అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో టాలీవుడ్ నుంచి ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నటనతో పాటు నిర్మాణ రంగంలోనూ ప్రియాంక చోప్రా తనదైన ముద్ర వేస్తున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ పర్పుల్ పెబుల్ పిక్చర్స్ ద్వారా విభిన్నమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

మాయాజాలంలో మునిగిపోవడానికి సిద్ధంగా ఉండండి

'హైందవ' ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చిన బెల్లంకొండ శ్రీనివాస్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'హైందవ'. ఎంతో వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆయన మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇందులో టాలీవుడ్ క్రేజీ బ్యూటీ సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, సౌరభ్ సచ్‌దేవా, మహేష్ మంజ్రేకర్, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆసక్తికరమైన కథనంతో పాటు ప్రేక్షకులను కట్టిపడేసే అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా నవంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్ర బందం ప్రమోషన్స్ వేగాన్ని పెంచింది.ఈ నేపథ్యంలో, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ మేకర్స్ ఫస్ట్ సింగిల్‌కు సంబంధించిన క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం నుంచి 'ఎవరైనా' అంటూ సాగే ఒక బ్యూటిఫుల్ మెలోడీ సాంగ్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా మధురమైన రాగాల మాయాజాలంలో మునిగిపోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ఈ మెలోడీ సాంగ్‌ను నవంబర్ 12న సాయంత్రం 5:04 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.